# రాత్రి ఒంటి గంట

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 179

ఏప్రిల్ 2016 నుంచి ఫిబ్రవరి 2017 వరకు

కౌముది మాసపత్రికలో

సీరియల్‌గా పునర్ముద్రణ పొందిన నవల

# (ప్రారంభం)

**"కూర్చోండి" అన్నాడు** డిటెక్టివ్ యుగంధర్.

"నా పేరు రామానుజం."

"యస్. మీరు నాకు తెలుసు. సైన్స్ కాంగ్రెసులో మిమ్మల్ని చూశాను. కూర్చోండి" అన్నాడు యుగంధర్.

"థాంక్యు" అని యుగంధర్‌కి ఎదురుగా కూర్చుని ఒకసారి చుట్టూ చూసి సిగిరెట్టు వెలిగించి "ఆయన?" అడిగాడు రామానుజం యుగంధర్ పక్కన కూర్చునున్న రాజును చూపించి.

"నా అసిస్టెంటు రాజు" చెప్పాడు యుగంధర్.

సిగిరెట్టు రెండుసార్లు పీల్చి ఆష్‌ట్రేలో పడేశాడు రామానుజం. కళ్ళద్దాలు తీసి తుడుచుకుని మళ్ళీ పెట్టుకున్నాడు. చిన్నగా దగ్గి యింకో సిగిరెట్టు వెలిగించాడు.

యుగంధర్ అతన్ని పరీక్షగా చూస్తున్నాడు. రామానుజం చాలా నెర్వస్‌గా వున్నాడని తెలుస్తూనే వుంది. అతనికి నలభై ఏళ్ళుంటాయి. చెవుల దగ్గిర నుదిటి మీదా జుట్టు నెరిసింది. మంచి పొడుగు, సన్నము. విశాలమైన నుదురు, చురుకయిన కళ్ళు. బూడిదరంగు టెరిలిన్ సూటు వేసుకున్నాడు.

"మిమ్మల్ని గురించి చాలా విన్నాను. ఒక విషయం గురించి మీతో మాట్లాడడానికి వచ్చాను" అన్నాడు రామానుజం.

"ఈ నాలుగు గోడల మధ్యా మీరు నాతో ఏం చెప్పినా మీరు చెప్పిన విషయాలు ఎటువంటి పరిస్థితిలోనూ మా ద్వారా బయటికి వెళ్ళవని మీకు హామీ యిస్తున్నాను" అన్నాడు యుగంధర్.

"థాంక్యు, థాంక్యు, నాకు కావలిసింది అదే నా యిరవై ఆరో యేట అమెరికా వెళ్ళాను. ఈ దేశం వచ్చి రెండేళ్ళయిది."

"ఈ దేశం అంటున్నారు. మీది యే దేశం?" అడిగాడు యుగంధర్.

"సారీ మన దేశం అనవలసింది. పొరబాటు. నేను ఏవో కొన్ని పరిశోధనలు చేస్తున్నాను."

"తెలుసు" అన్నాడు యుగంధర్.

"తెలుసా! నేను చేస్తున్న పరిశోధనల గురించి మీకు తెలుసా?" అడిగాడు రామానుజ.

యుగంధర్ తల వూపాడు.

"ఆశ్చర్యంగా వుంది. ప్రధానికీ, స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ భండార్కర్ తరపున నేను యిక్కడ వ్యవహరిస్తున్నాను" అన్నాడు.

"నేను నుంగంబాకంలో వుంటున్నాను. నాకు పిల్లలు లేరు. నా భార్య అమెరికన్ యువతి. పేరు ఎలైస్" చెప్పాడు రామానుజం.

యుగంధర్ తల వూపాడు.

"నా లాబరేటరీ తాంబరంకి అవతల ఎనిమిది మైళ్ళ దూరంలో వుంది. ట్రంక్ రోడ్‌నుంచి ఎడమ వైపుకి రెండు చిన్న కొండల మధ్య నుంచి వెళుతుంది నా లాబరేటరీకి వెళ్ళే రోడ్ దాన్ని మలయార్ రోడ్ అంటారు. అక్కడంతా మెట్టనేల, ఏమీ పండదు. ఆ ప్రాంతంలో పల్లెలు కానీ, మనుష్యులు కానీ వుండరు. అందువల్లే అక్కడ కట్టారు లాబరేటరీ."

"తెలుసు" అన్నాడు యుగంధర్.

రామానుజం నవ్వి "లాబరేటరీ గేటుకి 'మెడ్రాస్ మెడికల్ ప్రొడక్ట్సు' అని బోర్డు వున్నదనీ, నిజంగానే మెడికల్ ప్రొడక్ట్సు రీసెర్చి యిద్దరు సైంటిస్టులు చేస్తుంటారనీ, వెనక నా లాబరేటరీ వున్నదనీ, దానికి యిద్దరు సెక్యూరిటీ సాయుధ పోలీసులు కాపలా వుంటారనీ కూడా తెలుసా?" అడిగాడు రామానుజం.

యుగంధర్ నవ్వి "మీ లాబరేటరీ తలుపు వుక్కు తలుపనీ, మారుతాళాలతో ఆ తలుపుకున్న తాళం తియ్యడం ఎవరికీ సాధ్యం కాదనీ, తాళం చెవులు యిరవై నాలుగు గంటలూ మీ వద్దే వుంటాయనీ, మీరు తప్ప యింకెవరూ లోపలికి వెళ్ళరనీ, వెళ్ళకూడదనీ కూడా తెలుసు" అన్నాడు యుగంధర్.

"అన్ని విషయాలూ భండార్కర్ మీకు చెప్పారన్నమాట. దటీజ్ ఆల్‌రైట్. నా లాబరేటరీ విషయంలోగాని, నేను చేస్తున్న పని విషయంలోగానీ మీ సహాయం అడగడానికి రాలేదు నేను. ఇంకో విషయం."

"చెప్పండి" అన్నాడు యుగంధర్.

"మొన్న రాత్రి ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ఘోరమైన అనుభవం అది. చెపుతాను" అని గొంతు సవరించుకుని "నేను లాబరేటరీకి వెళ్ళి వచ్చే టయిం రోజూ ఒకటి కాదు. నాకు బుద్ధి పుట్టినపుడు వెళతాను. ఒక్కొక్క రోజు రాత్రంతా పనిచేస్తాను. ఒక్కొక్కప్పుడు ఏ అర్ధరాత్రిలో యింటికి వచ్చేస్తాను. లాబరేటరీనుంచి యిల్లు యిరవై నాలుగు మైళ్ళ దూరం. దాదాపు గంట పడుతుంది ప్రయాణం. నేనే డ్రయివ్ చేసుకుంటాను నా అంబాసిడర్ కారు" అని సిగిరెట్టు ఆష్‌ట్రేలో పడేసి, యింకో సిగిరెట్టు వెలిగించి "మొన్న రాత్రి ఒంటిగంటకి పది నిమిషాలుందనగా లాబరేటరీనించి బయలుదేరాను. నాలుగు మైళ్ళు వెళ్ళాను. సరిగా అప్పుడు ఒంటిగంట అయింది. ముప్ఫయిమైళ్ళ స్పీడున డ్రైవ్ చేస్తున్నాను. నడిరోడ్ మీద అడ్డంగా నిలబడి నా వైపు చూస్తూ, చేతులు ఎత్తి కారు ఆపమని ఎవడో సంజ్ఞ చేశాడు. స్పీడు తగ్గించాను కానీ ఆగడం నాకు యిష్టంలేదు. ఎవడో, ఎందుకు ఆపమంటున్నాడో, నిర్మానుష్యమైన ప్రదేశం. దరిదాపుల్లో మనిషి మాత్రం వుండడు" అని చిన్నగా నవ్వి "నేను పిరికివాణ్ణికాను. కానీ యిటువంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా వుండమని భండార్కర్ చెప్పారు. అయినా కారు ఆపక తప్పలేదు, అతనెవడో రోడ్‌కి అడ్డం తొలగలేదు. నేను కారు ఆపనైనా ఆపాలి. లేదా అతనిమీదనుంచి పోనివ్వాలి. చూస్తూ చూస్తూ ఒక మనిషి మీదినుంచి కారు పోనివ్వడం నాచేతకాదు, ఆపాను" మాటలు ఆపి యింకో సిగిరెట్టు వెలిగించి, గట్టిగా పొగపీల్చి "దాదాపు నలభై ఏళ్ళుంటాయి అతనికి, ఫుల్‌సూటులో వున్నాడు. "ఎక్స్‌క్యూజ్‌మీ! నన్ను మద్రాసు వరకో, కనీసం ట్రంక్ రోడ్ వరకో తీసుకెళతారా?" అడిగాడు. చాలా నిర్దుష్టమైన యింగ్లీషులో అడిగాడు. నా అనుమానం యికా ఎక్కువైంది. 'ఈ అర్ధరాత్రి యీ రోడ్ మీద మీరు యేం చేస్తున్నారు?' అడిగాను, కారు తలుపు తెరవలేదు, అద్దం కూడా పూర్తిగా కిందకి దింపలేదు, అవసరమైతే కారుని పోనిచ్చేందుకు గేర్‌లో వేసి వుంచాను. ఆక్సిలేటర్ మీద కాలువేసి వుంచాను.

అతను నవ్వి "నేను కథలు రాస్తాను. ఆలోచించుకోడానికి ఒంటిగా షికారుకి వచ్చాను. బస్‌లో వచ్చి ట్రంక్‌రోడ్ మీద దిగి, నిర్మానుష్యంగా వుంది కదా అని యీ రోడ్ మీద నడిచి వచ్చి అక్కడ కూర్చున్నాను. నాకు తెలియకుండానే నిద్రపట్టింది. మెలుకువ వచ్చేటప్పటికి అర్ధరాత్రి అయింది. మీకు యిబ్బంది అయితే నేను నడిచే వెళతానులెండి" అన్నాడు నాకు జాలేసింది. చదువుకున్న వాడిలా వున్నాడు. పెద్ద మనిషిలా కనపడ్డాడు. 'రండి, అటు వచ్చి కారు ఎక్కండి' అన్నాను, అతను హెడ్‌లైట్స్ ముందునుంచి నడిచివచ్చి కారు ఎక్కాడు. నా పక్కన కూర్చున్నాడు. నేను కారు పోనిచ్చాను" అని ఆగాడు రామానుజం. నిమిషంపాటు మౌనంగా వుండి "నేను అతనితో ఏమీ మాట్లాడలేదు, అతనూ యేం మాట్లాడలేదు. కారు తోలుతున్నాను. ఓ మూడు మైళ్ళు వెళ్ళిన తరువాత 'మిమ్మల్ని ఎక్కడ దింపాలి?' అడిగాను. అతను జవాబు చెప్పలేదు. పక్కకి తిరిగి చూశాను. చేత్తో స్టీరింగ్ వీల్‌ని గట్టిగా పట్టుకున్నాను. నా గుండె ఆగిపోయినంత పనయింది. నా పక్కన కూర్చున్న మనిషికి తల లేదు, తల వుండవలసిన చోట పుర్రె వుంది. కళ్ళు వుండే కంతల్లో

మనిషి కళ్ళు కనిపిస్తున్నాయి. నా కళ్ళు చీకట్లు కమ్మాయి. నా తల తిరిగిపోయింది, ముచ్చెమటలు పోశాయి నాకు. స్పృహ పోయింది. స్టీరింగ్ వీల్ మీద తల వొంచేశాను" చెప్పాడు రామానుజం.

"తరువాత?" అడిగాడు యుగంధర్.

"మళ్ళీ నాకు స్పృహ వచ్చేటప్పటికి నా కారు నా యింటి గేటుముందు వుంది."

"మీరు?" అడిగాడు యుగంధర్.

"కారులో స్టీరింగ్ దగ్గర తల వీల్ మీద వాల్చి పడుకున్నాను."

"అప్పుడు టయిం ఎంత అయింది?"

"రెండు గంటలయింది."

"అంటే దాదాపు గంటసేపు మీకు స్పృహలేదన్నమాట."

"అవును."

"మీ జేబులో డబ్బు, తాళం చెవులు, కాగితాలు అన్నీ సరిగా వున్నాయేమో చూసుకున్నారా?"

"చూసుకున్నాను. ఏదీపోలేదు. అన్నీ అలాగే వున్నాయి."

"తలమీద దెబ్బ ఏదైనా తగిలిందా?" అడిగాడు రాజు.

"లేదు. బొప్పిలేదు, నెప్పీ లేదు."

"మీకు మత్తుమందు యేదైనా యిచ్చిన లక్షణాలు కనపడ్డాయా?"

"చాలా నీరసంగా వున్నట్లనిపించింది. అది మత్తుమందు లక్షణమేమో!" అన్నాడు రామానుజం.

"మీ అనుమానం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"మనుష్యులు చనిపోయిన తర్వాత దెయ్యాలవుతారని కాని, మళ్ళీ మనుష్య రూపంలో మనకి కనిపిస్తారని కానీ, కనిపించి మనతో మాట్లాడతారని కానీ నాకు నమ్మకం వుండేది కాదు."

"ఉండేది కాదు అంటున్నారే?" అన్నాడు రాజు.

రామానుజం నవ్వి "కారులో నా పక్కన ఓ మనిషి కూర్చున్నాడు. కాసేపటి తరవాత ఆ మనిషి తల మాయమై పుర్రె వుంది. నా పక్కన కూర్చున్నది దెయ్యమే అయి వుండాలి" అన్నాడు.

యుగంధర్ కూడా నవ్వి "ఆల్‌రైట్ దెయ్యమే అనుకుందాం. నా దగ్గరికి ఎందుకు వచ్చారు?" అడిగాడు.

"ఈ సంఘటన మొన్న జరిగింది. అసలు యిదంతా జరిగిందో లేదో నా భ్రమేనేమో అన్న అనుమానం కలిగింది నాకు. అందుకే ఎవరికీ, నా భార్యకి కూడా చెప్పలేదు. కావలసి మళ్ళీ నిన్న అదే సమయానికి రాత్రి ఒంటిగంటకి లాబరేటరీ నించి బయలుదేరాను."

"ఊఁ."

"సరిగా అదే చోట అతనే, అదే ఆకారం, ఫుల్ సూటులో రోడ్‌కి అడ్డంగా నిలబడి చెయ్యి వూపాడు. క్రితం రాత్రి యీ ఆకారం నా కారు ఆపడం నా భ్రమ కాదనీ, నిజంగానే జరిగిందనీ నిశ్చయంగా తెలియగానే నాకు ముచ్చెమటలు పోశాయి. కారు ఆపలేదు సరికదా యాభై మైళ్ళ స్పీడునతోలాను. కారు దగ్గరికి వచ్చేటంత వరకు అతను అక్కడే నిలబడి, దగ్గరికి రాగానే పక్కకి చీకట్లోకి ఒక్క గంతేశాడు. నేను వెనక్కి చూడలేదు. స్పీడు తగ్గించలేదు. ట్రంక్‌రోడ్ మీద కూడా అంత స్పీడుగా వెళ్ళి యిల్లు చేరుకున్నాను" అన్నాడు రామానుజం.

యుగంధర్ కూడా సిగిరెట్ వెలిగించి "ఇంతకీ నా దగ్గరికి ఎందుకు వచ్చినదీ చెప్పలేదు" అన్నాడు.

"పోలీసులకి కంప్లెయింట్ ఇచ్చి ప్రయోజనం లేదు. ఇది పీనల్ కోడ్‌కి సంబంధించిన విషయం కాదుగా!" అన్నాడు రామానుజం నవ్వుతూ.

"యస్" అన్నాడు యుగంధర్.

"నేను ఏదైనా భ్రమలో పడి ఇదంతా వూహించుకున్నానా! నిజంగా ఆ రోడ్ మీద దెయ్యం వుందా! దెయ్యమే వున్న పక్షంలో నా లాబరేటరీ అక్కణ్ణించి మార్చమని అధికారులకి చెపుతాను. మీరు యివాళ రాత్రి నాతో రాగలరా?"

"ఎక్కడికి?"

"లాబరేటరీనించి యీ రాత్రి ఒంటిగంటకి బయలుదేరుతాను. ఆ మనిషి మళ్ళీ కనిపిస్తాడేమో చూద్దాం. " అడిగాడు రామానుజం.

"ఆల్‌రైట్, సరిగా రాత్రి పన్నెండున్నరకి మీ లాబరేటరీకి వస్తాము నేనూ, రాజూ, నాకు క్యూరియస్‌గా వుంది" అన్నాడు యుగంధర్.

"థాంక్ యు, సో లాంగ్" అని రామానుజం వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల తరువాత యుగంధర్ భండార్కర్‌కి ట్రంకాల్ బుక్ చేశాడు.

"భండార్కర్‌కి ఇదంతా చెబుతారా?" అడిగాడు రాజు.

"ఉహూ! రామానుజం లాబరేటరీ తాళం వెంటనే మార్చించమని చెప్పాలి."

"ఎందుకు?"

"రామానుజం చెప్పినట్లు ఆ ఆకారం యేదో మానవాతీతమైన శక్తి కావచ్చు. లేక రామానుజం చేస్తున్న పరిశోధన గురించి తెలుసుకునేందుకు ఎవరో తెలివైన పన్నాగం పన్ని వుండవచ్చు. రామానుజానికి స్పృహ పోయిన తరువాత అతని దగ్గర వున్న తాళం చెవి తీసుకుని మారుతాళం చెవి చేయించుకునేందుకు వాక్సు యింప్రెషన్ (మైనంలో ముద్ర) తీసుకుని మళ్ళీ ఆ తాళం చెవి అతని జేబులో పెట్టి వుండవచ్చు" చెప్పాడు యుగంధర్.

## 2

రాత్రి పన్నెండు ముప్పావు అయింది. డిటెక్టివ్ యుగంధర్, అతని అసిస్టెంటు రాజు మెడికల్ ప్రొడక్ట్సు ఆఫీసు రిసెప్షన్ రూంలో కూర్చునున్నారు. రిసెప్షన్ కౌంటర్ వెనక కూర్చున్న రిసెప్షన్ క్లర్కు కునికిపాట్లు పడుతున్నాడు.

రాజు చేతి గడియారం చూసుకుని "రామానుజం ఇంకా రాడేం" అన్నాడు.

యుగంధర్ జవాబు చెప్పేలోగా రామానుజం వచ్చేశాడు. "థాంక్యూ, వచ్చారన్నమాట, ఐయామ్ రెడీ. బయలుదేరుదామా?" అడిగాడు.

యుగంధర్, రాజు లేచారు. ముగ్గురూ పోర్టికోలోకి వెళ్ళారు.

"మీ కారు ఏదీ?" అడిగాడు రామానుజం.

"మేము టాక్సీలో వచ్చాము, టాక్సీని పంపించేశాను" చెప్పాడు యుగంధర్.

"దటీజ్ వెరీ గుడ్! రండి" అంటూ రామానుజం తన ఎంబాసిడర్ తలుపు తెరిచాడు. అతనే డ్రైవ్ చేస్తున్నాడు. యుగంధర్, రాజు వెనక సీటులో కూర్చున్నారు. ముప్పయి మైళ్ళ స్పీడున వెళుతోంది కారు. ఎవరూ మాట్లాడడం లేదు. ఎవరికి వాళ్ళు వాళ్ళ ఆలోచనల్లో వున్నారు. యుగంధర్, రాజూ రోడ్‌ని చెరొక వైపు చూస్తున్నారు. చీకటి, కటిక చీకటి. చెట్లే వున్నాయో గుట్టలే వున్నాయో యేమీ కనిపించడం లేదు. రోడ్ మీద మాత్రం కారు హెడ్‌లైట్స్ వున్నాయో యేమీ కనిపించడం లేదు. రోడ్ మీద మాత్రం కారు హెడ్‌లైట్స్ కాంతి పడుతోంది. ఒంపులు తిరిగిన నల్లతాచులా వుంది రోడ్

"యుగంధర్!" అన్నాడు రామానుజం.

"చూశాను. కొంచెం స్పీడు తగ్గించి వెళ్ళండి. భయపడకండి" అన్నాడు యుగంధర్.

రాజు జేబులోంచి పిస్టల్ తీసి చేతిలో పట్టుకున్నాడు.

అతను కదలడం లేదు.

"చూశారా! రోడ్‌కి అడ్డంగా నిలుచున్నాడు. కారు ఆపమంటారా?" అడిగాడు రామానుజం.

"దగ్గరికి వెళ్ళి ఆపండి" చెప్పాడు యుగంధర్.

రామానుజం చేతిలో స్టీరింగ్ వీల్ స్థిమితంగా లేదు. అతను భయంతో వణుకుతున్నాడని యుగంధర్ గ్రహించాడు. "భయపడకండి, మా చేతుల్లో పిస్తోళ్ళున్నాయి" ధైర్యం చెప్పాడు రామానుజానికి.

"నో, భయపడడంలేదు" అన్నాడు రామనుజం నవ్వు తెచ్చి పెట్టుకుని, రోడ్‌కి అడ్డంగా నిలబడి వున్న ఆ మనిషి - ఆ ఆకారం - రెండు చేతులూ పైకెత్తిపెట్టి, కదలకుండా అక్కడే నిలుచునున్నాడు. అతనికి పది అడుగుల దూరంలో రామానుజం కారు ఆపాడు. కారు ఆగగానే ఒక వైపు నుంచి యుగంధర్, యింకోవైపు నుంచి రాజు కారులోంచి దిగారు.

"ఎవరు మీరు?" అంటూ యుగంధర్ ఒక అడుగు ముందుకి వెయ్యగానే ఆ ఆకారం ఒక్క గంతేసి రోడ్ పక్కకి చీకట్లోకి వెళ్ళిపోయింది. నడిచే వెళ్ళిందో, పరుగెత్తుకు వెళ్ళిందో, ఎగిరి వెళ్ళిందో యుగంధర్ గమనించలేకపోయాడు. కన్ను మూసి తెరిచేలోపున చీకట్లోకి వెళ్ళిపోయింది ఆ ఆకారం. యుగంధర్ సందేహించలేదు. తటపటాయించలేదు. ఆ ఆకారం ఎటు వెళ్ళిందో అటు చీకట్లోకి పరిగెత్తాడు.

రాజు కూడా ఆ ఆకారం చీకట్లోకి వెళ్ళిపోవడం చూశాడు. యుగంధర్ అడుగుల చప్పుడును బట్టి ఆ ఆకారాన్ని తరుముకుంటూ వెళుతున్నాడని గ్రహించాడు. యుగంధర్ వెనకే తనూ వెళదామని తిరిగాడో లేదో తను నిలుచున్న వైపు రోడ్‌కి అవతల చీకట్లో యెవరో పరిగెత్తిన అదుగుల చప్పుడు వినిపించి రాజు అటు పరిగెత్తాడు.

రామానుజానికి ముచ్చెమటలు పోస్తున్నాయి. కారు యింజన్ హోరుమని చప్పుడు చేస్తోంది. క్లచ్ మీదనుంచి కాలు తీసేస్తే కారు ముందుకు పోతుంది. క్షణం పాటు అనిపించింది తను వెళ్ళిపోదామని. అటువంటి ఆలోచన వచ్చినందుకు మరుక్షణం తనని తను తిట్టుకున్నాడు. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని, పళ్ళు బిగించి, వూపిరి బిగపట్టి కూర్చున్నాడు కదలకుండా.

పరిగెత్తుతూనే యుగంధర్ జేబులోకి చెయ్యిపోనిచ్చాడు, జేబులోంచి టార్చిలైటు తీద్దామని. అడుగుల చప్పుడు కాని, యింకే చప్పుడు కానీ వినిపించడంలేదు. ఆ ఆకారం ఎక్కడున్నది, యెటు వెళుతున్నదీ తెలియడం లేదు. యుగంధర్ ఆగి టార్చి వెలిగించాడు. ఆ కాంతిలో చూశాడు చెట్లు, చెట్ల వెనక చీకటి. చిన్న చిన్న దిబ్బలు, దిబ్బల వెనక చీకటి. మనిషి కాని, మరే యితర ప్రాణి కానీ కనిపించలేదు. టార్చి వెలిగించి పట్టుకుని వెనక్కి తిరుగుతున్నాడు. అప్పుడు, రెండు చేతులు వెనకనుంచి యుగంధర్ని బలంగా బంధించాయి. యుగంధర్ ఛాతీ మీద నుంచి ఆ రెండు చేతులూ యుగంధర్ చేతులు కదలకుండా పట్టుకున్నాయి. రెండు చేతులూ

విదిలించి, వెన్ను విరిచి, కాళ్ళు నేలకి అదిమిపెట్టి వెనకవున్న మనిషిని ఎత్తి కింద పడెయ్యడానికి ప్రయత్నించాడు యుగంధర్, ప్రయోజనం లేకపోయింది. తనని వుక్కు కడ్డీలతో బిగించినట్లనిపించింది. యుగంధర్ ఆరు అడుగుల మూడంగుళాల పొడుగు మనిషి, కండలు తిరిగిన ఒళ్ళు. తరచూ వృత్తి గతంగా రకరకాల పరిస్థితుల్లో మల్ల యుద్ధమూ, బాక్సింగు చేసి వొంటినీ, కండలనీ సాన పెడుతుంటాడు. నలుగురితో ఒకేసారి పోట్లాడి నెగ్గగల సమర్థుడు. బలశాలి, బలానికి తోడు కిటుకులూ, పట్లు క్షుణ్ణంగా తెలుసున్న మనిషి యుగంధర్. తన చేతిలో వున్న టార్చిని తన్నినట్లయింది. అది కిందపడి పగిలింది. అయినా నేలమీద కొద్దిగా వెలుగు పడుతోంది. ఆ భల్లూకపు పట్టునించి ఎలా తప్పించుకోవడం? యుగంధర్ రెండు కాళ్ళూ నేలమీద నించి పైకెత్తాడు. తన బరువంతా తనని పట్టుకున్న మనిషి మీద వేస్తే మొయ్యలేక తనతోపాటు కిందపడతాడని అనుకున్నాడు.

అలా జరగలేదు. ఆశ్చర్యపోయాడు యుగంధర్. తన బరువంతా చేతుల్తో మొయ్యగలవాడు తనకన్నా యెంతో బలవంతుడు అయివుండాలి. ఇంకా బరువు వెయ్యాలని పూర్తిగా వెనక్కి వాలాడు. చెట్టు బోదెకి ఆనుకున్నట్లున్నది కాని వెనక కదలిక లేదు.

మొదటిసారి అప్పుడు అనుమానం కలిగింది యుగంధర్‌కి తను పోట్లాడుతున్నదీ, తనని బంధించినదీ మనిషేనా అని. తల వెనక్కి వొంచాడు.

టార్చిలైటు కాంతి మసకగా వుంది. ఆ మనిషి తనకన్నా పొడుగైవుండాలనుకున్నాడు యుగంధర్. తన తలకి వెనకవున్న తల తన తలకి పైన వున్నది. తల పూర్తిగా వెనక్కి వొంచాడు.

ముందు కనిపించినవి తెల్లని పళ్ళు. పళ్ళపైన చిగుళ్ళుకానీ, పెదిమలు కానీ లేవు. కళ్ళు వున్నాయి. అవి మెరుస్తున్నాయి. అది తలకాదు. మనిషి పుర్రె. అదేమిటో ఆలోచించడానికీ, పూర్తిగా చూడడానికీ వ్యవధిలేకపోయింది యుగంధర్‌కి. తలమీద బరువైనదేదో పడ్డది. మరుక్షణం కళ్ళు చీకట్లు కమ్మయి. తనకి స్పృహపోతోందనీ, కింద పడిపోతున్నాననీ తెలుసు యుగంధర్‌కి.

కళ్ళు తెరిచేటప్పటికి అంతా చీకటిగా వుంది. తల బద్దలవుతున్నట్లు నెప్పి, మెడ, జబ్బలు అమితంగా పీకుతున్నాయి. లేచి కూర్చున్నాడు యుగంధర్, ఎక్కడా చడీ చప్పుడూ లేదు. రోడ్ యెటున్నది? రామానుజం, అతని కారు ఏమయ్యాయి? రాజు ఏమయ్యాడు.

చేతులతో చుట్టూ తడిమి చూశాడు టార్చిలైటు దొరుకుతుందేమోనని. దొరకలేదు. నెమ్మదిగా లేచి నిలుచున్నాడు. ఒకసారి కాళ్ళూ, చేతులూ విదిలించుకుని చుట్టూ చీకట్లోకి చూశాడు. రామానుజం కారు హెడ్‌లైట్సు యెందుకు ఆర్పేశాడు? ఇంజన్ ఎందుకు ఆఫ్ చేశాడు? తను యెంతసేపు స్పృహలేకుండా పడివున్నాడు? చేతి గడియారం చూసుకున్నాడు. రెండుంపావు అయింది. గుడ్‌గాడ్! గంటసేపు స్పృహలేకుండా వున్నాడన్నమాట. అడుగులో అడుగు వేసుకుంటూ నడిచాడు. రెండుసార్లు కాలికి ఏదో తగిలి పడబోయాడు. కొంచెం దూరం నడిచి ఆగిపోయాడు. చీకట్లో దారీ తెన్నూ కనిపించడంలేదు. రోడ్ వేపు నడుస్తున్నాడో, రోడ్‌కి దూరంగా వెళుతున్నాడో తెలియదు. అంతేకాదు – తనకి స్పృహపోయిన చోటే మళ్ళీ స్పృహ వచ్చిందని ఏమిటి నిదర్శనం. తనని ఎత్తుకు వెళ్ళి యింకెక్కడయినా పడేశారేమో!

జేబులు తడుముకున్నాడు యుగంధర్. సిగిరెట్ పాకెట్, లైటర్ జేబులోనే వున్నాయి. సిగిరెట్ వెలిగించాడు.

తనని బంధించినది ఎవరు? మనిషికాదు అన్న ఆలోచన మనసులోకి రానివ్వలేదు యుగంధర్. కాదని తోస్తే భయం అనికాదు. ఆలోచించి ప్రయోజనం వుండదు. ముందు రాజునీ, రామానుజాన్నీ చూడాలి. ఏమయ్యారు? ఎక్కడున్నారు?

ఆకాశం వైపు చూశాడు. అక్కడక్కడ నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయి. నక్షత్రాలని బట్టి తను ఎక్కడున్నదీ అంటే రోడ్‌కి ఎటు వున్నదీ తెలుసుకోవాలి. అదొకటే మార్గం ఆ చీకట్లో తను రోడ్ చేరుకునేందుకు.

ముందుకు కాదు, వెనక్కి కాదు. కుడివైపు నడిచాడు. దాదాపు వందగజాలు నడిచి ఆగాడు. రోడ్ యింకా కనపడదేం? రోడ్‌కి అంతదూరం వెళ్ళలేదే తను. బూట్సు కింద ఎండుటాకులు, పుడకలు టపటపమంటున్నాయి. గాలి వీచినపుడూ ఏవో రకరకాల కూతలు వినిపిస్తున్నాయి. నక్షత్రాలని బట్టి దారి తెలుసుకోలేకపోయాడు. వెనక్కి తిరిగి మళ్ళా వచ్చిన వైపు వెళ్ళాడు ఉజ్జాయింపుగా తను పడిపోయిన చోటుకి వెళ్ళాడు. అక్కడ ఆగి నేలమీద నించి చిన్న చిన్న రాళ్ళు కొన్ని ఏరాడు. వాటిని చీకట్లోకి, దూరానికి విసిరి వెయ్యడం ప్రారంభించాడు. ఒక వైపు కొన్ని రాళ్ళు విసిరి, తరువాత పక్కకి జరిగి యింకో వైపుకి రాళ్ళు విసిరాడు. అలా యాభై అరవై సార్లు విసిరాడు.

ఒక రాయి దేనికో తగిలి టంగ్‌మని చప్పుడయింది. మళ్ళా యింకో రాయి అటువైపే విసిరాడు. మళ్ళీ టంగ్‌మని చప్పుడయింది. ఆ రాళ్ళు కారుకి తగిలి టంగ్‌మని చప్పుడయిందని యుగంధర్ గ్రహించాడు. అటువైపు పదిగజాలు నడిచి మళ్ళీ రాయి విసిరాడు. మళ్ళీ టంగ్‌మని కొంచెం దగ్గరగా చప్పుడు వినిపించింది. ఇంకో పది అడుగులు నడిచాక రోడ్ కనిపించింది.

రామానుజం కారు అక్కడే వుంది. రామానుజం డ్రయివర్ సీటులో, స్టీరింగు వీల్‌మీద తలవాల్చి పడుకున్నాడు. హెడ్‌లైట్సు, కారు రూఫ్ లైటు వెలిగించాడు యుగంధర్. రామానుజానికి స్పృహలేదు. అంతకన్నా అతనికి ప్రమాదమేమీ జరగలేదని నిశ్చయంగా తెలుసుకుని, తరవాత రాజుకోసం చూశాడు. కారులో లేడు. "రాజూ! అని కేకవేశాడు. జవాబు లేదు.

ఆ చీకట్లో ఎక్కడని వెతకడం. రామానుజాన్ని నెమ్మదిగా జరిపి డ్రైవర్ సీటులో కూర్చుని కారు స్టార్టు చేశాడు యుగంధర్. కారుని కొద్దిగా పక్కకి తిప్పాడు. హెడ్‌లైట్స్ వెలుగు దాదాపు రెండువందల గజాల దూరంం వరకూ పడుతోంది. ఆ కాంతిలో రాజు కనిపిస్తాడేమోనని చూశాడు. చెట్లు, గుట్టలు, దిబ్బలు తప్ప యింకేమీ కనిపించలేదు. కారుని కొంచెం కొంచెంగా పక్కకి తిప్పుతూ రాజుకోసం చూస్తూ పూర్తిగా వెనక్కి తిప్పాడు. కారు వెనక వైపు యాభై గజాల దూరంలో, రోడ్‌కి పక్కన మట్టిలో పడున్నాడు రాజు.

కారు ఇంజన్ ఆఫ్ చేసి, తాళం చెవులు జేబులో వేసుకుని హెడ్‌లైట్సు వెలిగించే వుంచి హెడ్‌లైట్సు వెలిగించే వుంచి. యుగంధర్ రాజు దగ్గరికి పరిగెత్తి "రాజూ! రాజూ!" అన్నాడు రాజుని తట్టుతూ. "ఆఁ" అంటూ మూలిగాడు రాజు.

రాజు తల తడిమి చూశాడు. తల వెనకవైపున బొప్పి కట్టింది. పెద్ద దెబ్బే తగిలింది. ఎప్పుడూ స్పృహ వస్తుందో. రాజుని ఎత్తుకు వెళ్ళి కారు వెనక సీటులో పడుకోబెట్టాడు. రామానుజానికి ఇంకా స్పృహ రాలేదు. తను అక్కడ వుండి చెయ్యగలిగిందేమీ లేదు. ఆ చీకట్లో పరిశోధన ఏం చెయ్యగలడు? రాజుకీ, రామానుజానికీ వెంటనే చికిత్స చేయడం అవసరం కావచ్చు అనుకుని యుగంధర్ కారు స్టార్టు చేశాడు. ఇంజన్ చప్పుడులోంచి ఎవరో నవ్వడం వినిపించింది. నిజంగా ఎవరైనా నవ్వారో, అది తన భ్రమో యుగంధర్‌కి తెలియలేదు. కారుపోనిచ్చాడు.

## 3

"**ముందు యిది తాగండి.** తరువాత మాట్లాడుకోవచ్చు" అన్నాడు యుగంధర్ రాజుకీ, రామానుజానికీ కాఫీ కప్పులు అందిస్తూ.

వాళ్ళిద్దరికీ అయిదు నిమిషాల తేడాలో స్పృహ వచ్చింది. స్పృహ పోవడం తప్ప, పెద్ద గాయాలేమీ తగలలేదని నిశ్చయించుకున్న తరువాత కాఫీ తెప్పించాడు.

రాజు కాఫీ తాగి, ఖాళీ కప్పు బల్లమీద పెట్టి "చెప్పడానికి ఏమీలేదు. మీరు వెళ్ళిన వైపు కాక యింకోవైపు ఎవరో పరిగెత్తినట్లయి అటు వెళ్ళాను. చీకటిగా వుంది. ఎక్కడా చడీచప్పుడూ లేదు. ఇరవై గజాలు వెళ్ళి ఆగి చెవులు రిక్కించుకుని వింటున్నాను. అడుగుల చప్పుడు వినిపించింది. వెనక్కి తిరిగే లోపున ఎవడో వెనకనుంచి నన్ను రెండు చేతులతో బంధించాడు. ఆ పట్టు విడిపించుకునేందుకు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. అతికష్టం మీద వెనక్కి తిరిగి చూశాను. పుర్రె మాత్రం కనిపించింది. విచిత్రమేమంటే ఆ పుర్రెకి కళ్ళున్నాయి. కనుపాపలు కూడా కనిపించాయి. అంతే! ఆ తరువాత నాకు యేమీ జ్ఞాపకం లేదు. యిక్కడ లేచి కూర్చోవడం తప్ప" చెప్పాడు రాజు.

యుగంధర్ తల వూపి "నాకూ దాదాపు అలాగే జరిగింది" అని రామానుజం వేపు చూశాడు.

"నిజం చెప్పాలంటే, మీలా ధైర్యం చేసి నేను కారులోంచి దిగలేదు. మీరు ఒక వైపుకీ, మిష్టర్ రాజు మరొక వైపుకీ వెళ్ళిపోయారు. కారు ఇంజన్ రన్ చేస్తూనే వున్నాను. ఏ క్షణాన కారు పోనివ్వవలసి వస్తుందోనని. అంతలో నా వెనక యేదో చప్పుడయింది. వెనక్కి తిరిగి చూశాను. పుర్రె మాత్రం కనిపించింది. ఆ వేళ నేను చూసిన దృశ్యమే. నా పంచప్రాణాలు ఎగిరిపోయినంత పని అయింది. కేక పెడదామనుకున్నాను, అరుద్దామనుకున్నాను. కానీ నా గొంతు పెగలలేదు భయంవల్ల. నాకు స్పృహపోయింది. మళ్ళీ స్పృహ వచ్చేటప్పటికి యిక్కడ వున్నాను" చెప్పాడు రామానుజం.

"దాదాపు ఒకే సమయంలో, రెండు మూడు నిమిషాల తేడాలో నాకూ, రాజుకీ, మీకూ ఆ పుర్రె కనిపించింది. దెయ్యమే అనుకుంటే ఒక దెయ్యమే కాదన్నమాట" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"నో. సర్! మీకు నవ్వు ఎందుకు వస్తుందో తెలియడంలేదు. మనలా నడిచో, పరిగెత్తో వెళ్ళవలసిన అవసరం లేదేమో దెయ్యాలకి. క్షణంలో మీ దగ్గర్నించి రాజు దగ్గరికి, రాజు దగ్గర్నించి నా దగ్గరికీ వచ్చిందేమో? లేకపోతే ఒకే దెయ్యం మీకూ, రాజుకీ, నాకూ ఒకే సమయంలో కనిపించగలదేమో" అన్నాడు రామానుజం.

"ఆల్‌రైట్ అలాగే అనుకోండి అయితే మీ అభిప్రాయం దెయ్యమేననా?" అడిగాడు రాజు.

"ఇతమిద్ధమని ఇప్పుడు ఏమీ చెప్పలేరు ఎవరూ. తెల్లారిన తర్వాత మళ్ళీ అక్కడికి వెళ్ళాలి. మనం ఇన్వెస్టిగేట్ చెయ్యాలి" అన్నాడు యుగంధర్.

## 4

"యస్. యుగంధర్ స్పీకింగ్" అన్నాడు యుగంధర్ టెలిఫోను రిసీవర్ తీసుకుని.

"నేను రామానుజాన్ని. ఏమైంది? ఇన్వెస్టిగేషన్ చేశారా?" అడిగాడు అవతలనించి.

"నేనూ, రాజూ అక్కడికి వెళ్ళి జాగ్రత్తగా పరీక్ష చేశాము. ఏమీ తెలియలేదు."

"అంటే?" అన్నాడు రామానుజం.

"నిన్న రాత్రి మనల్ని ఆటకాయించిన వాళ్ళెవరో తెలిపే సూచన ఒకటికూడా లేదు" చెప్పాడు యుగంధర్.

"సూచన ఏదీలేదు కనుక అదేదో మానవాతీతమైన శక్తి అనుకోవచ్చా?"

యుగంధర్ నవ్వి "అదేదో నిశ్చయంగా చెప్పలేను. మానవాతీతమైన శక్తి అనుకునేందుకూ నిదర్శనం లేదు. ప్రస్తుతానికి ఓపెన్ మైండ్‌తో వుంటున్నాను" అన్నాడు.

"అంతేనా! ఇంకా ఏమైనా దర్యాప్తు చేస్తున్నారా?"

"ఇవాళ రాత్రి అదే సమయానికి అక్కడికి వెళతాను" చెప్పాడు యుగంధర్.

రామానుజం నిమిషం పాటు మౌనంగా వుండి "మీరేమీ అనుకోకపోతే యివాళ సాయంకాలం నాలుగు గంటలకే లాబరేటరీ నించి యింటికి వచ్చేద్దామనుకుంటున్నాను. మీతో రాత్రి అక్కడికి రావడానికి వీలుండదు" అన్నాడు.

"దటీజ్ ఆల్‌రైట్. మీరు అవసరంలేదు."

"ఇంకొక విషయం. యివాళ బండార్కర్ కి ట్రంకాల్ చేసి లాబరేటరీ యింకోచోటికి మార్పించమని చెప్పాను."

"భండార్కర్ కారణం అడిగారా!?"

"అడిగారు. మీరు చెపుతారని చెప్పాను. మళ్ళీ రేపు మీకు ఫోన్ చేస్తాను" అన్నాడు రామానుజం.

యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు.

"రామానుజం చాలా భయపడిపోయినట్లున్నాడు" అని నవ్వాడు రాజు.

"రామానుజం భయపడడంలో అసహజమేమీ లేదు. ఈ రాత్రి మనం చాలా జాగ్రత్తగా వుండాలి. నిన్న జరిగినట్లు జరగకూడదు. అదేమిటో తెలుసుకోవాలి" అన్నాడు యుగంధర్ రాజుతో.

రాత్రి సరిగా పన్నెండు ముప్పావుకి యుగంధర్, రాజు ట్రంక్ రోడ్డు మీద అదే స్థలానికి వెళ్ళారు క్రిజ్లర్ కారులో. ఆ కారుకి నాలుగు హెడ్‌లైట్స్ కాక, రెండు స్పాట్‌లైట్స్, రియర్ లైట్, వెనక తలుపుల దగ్గర రెండు స్పాట్‌లైట్లు ఏర్పాటు చేసి, యింకొక బాటరీ కూడా పెట్టుకున్నారు. స్విచ్ వెయ్యగానే అన్ని దీపాలు ఒక్కసారిగా వెలిగే ఏర్పాటు చేశారు. అంటే కారు చుట్టూ దీపాలు వెలుగుతాయి. రోడ్‌కి అన్ని వేపులా వందగజాల దూరం వరకూ దేదీప్యమానంగా వెలుగు పడుతుంది.

క్రితం రాత్రి సంఘటన జరిగిన స్థలానికి వెళ్ళగానే కారు ఆపాడు రాజు. ఇంజన్ ఆపలేదు. డ్రైవింగ్ సీటులో వున్న రాజు పక్కన కూర్చున్నాడు యుగంధర్.

"రాజూ! ఆ మనిషి, మనిషి కాకపోతే దెయ్యం - మన కారు ప్రాంతాలకి రాగానే నువ్వు స్విచ్ వెయ్యి. అప్పుడు ఆ ఆకారం చీకట్లోకి వెళ్ళడానికి అవకాశం వుండదు. చీకట్లోకి వెళ్ళడానికి ఆ ఆకారం పరిగెత్తనయినా పరిగెత్తాలి లేదా అదృశ్యం కావాలి, లేదా మనకి చిక్కాలి" అన్నాడు యుగంధర్ పిస్తోలు తీసి పట్టుకుని.

"పిస్తోలు ఎందుకు?" అడిగాడు రాజు.

"ఏమో! అవసరం కావచ్చు, చిక్కకుండా పరిగెత్తితే ఏ కాలిమీదో కాలుస్తాను" అన్నాడు యుగంధర్.

ఇద్దరూ కాచుకున్నారు. క్షణాలు నిమిషాలవుతున్నాయి. ఒంటిగంట దాటి పదినిమిషాలయింది.

"ఏం జరగదేం?" అన్నాడు రాజు.

"చూద్దాం" అన్నాడు యుగంధర్.

"డార్లింగ్ సినిమా బాగానే వుంది కానీ యింతసేపు మరీ మూడున్నర గంటల సినిమా చూడడం కష్టం" అన్నది ఎలైస్.

రామానుజం నవ్వి "నా కోసం సినిమా బావుందంటున్నావా! నీకు కథ ఏమైనా తెలిసిందా! మా సినిమాలకి చాంతాడంత కథ వుంటుంది" అన్నాడు.

భార్యాభర్తల సంభాషణ అంతా యింగ్లీషులోనే సాగుతోంది. రాత్రి ఆట సినిమా చూసి యింటికి వెళుతున్నారు. రామానుజం కారు డ్రైవ్ చేస్తున్నాడు. వాళ్ళలా రాత్రి సినిమా చూసి యిళ్ళకి వెళ్ళే వాళ్ళు కార్లు, బీచ్‌నించి యిళ్ళకి వెళ్ళే కార్లు, అప్పుడప్పుడు ఒక సైకిలు రిక్షా తప్ప రోడ్ మీద రద్దీ లేదు. కాసేపు యిద్దరూ మౌనంగా వుండిపోయారు.

"అమెరికా వదిలి నాతో యిక్కడికి వచ్చినందుకు విచారిస్తున్నావా?" అడిగాడు రామానుజం.

"నో! డెఫినెట్లీ నాట్, డార్లింగ్ ఎన్నిసార్లు చెప్పాను? ఐ లవ్ యు. నువ్వెక్కడ వుంటే అక్కడ నాకు శాంతీ, సంతోషం వుంటాయి. నాకు యీ దేశం, యిక్కడి మనుష్యులు నచ్చారు. ఏ మాత్రం బెంగలేదు" అన్నది అతని చేతిమీద తన చెయ్యివేసి.

"నిజం చెప్పొద్దూ నాకు బెంగగా వుంది. మళ్ళీ అమెరికా వెళ్ళిపోవాలని వుంది."

"ఎందుకు?" అడిగింది ఎలైస్.

"అమెరికాలో చాలాకాలం వుండడం వల్ల ఆ దేశం అలవాటయిపోయిందనుకుంటాను. అదీకాక పరిశోధనకి అక్కడవున్న సదుపాయాలు ఇక్కడ లేవు. అది యింకో కారణం."

"అయితే యిక్కడికి ఎందుకు వచ్చేశావు?" అడిగింది నవ్వుతూ.

"ఇది నా దేశం కనుక."

బొటానికల్ గార్డెన్సు దగ్గరికి వచ్చారు. కారు పక్కగా ఆపి, ఒక చెయ్యి భార్య భుజం మీద వేసి దగ్గరికి లాక్కుని, ముద్దుపెట్టుకుని "నేను ఒక పరిశోధన చేస్తున్నాను. ఆ పరిశోధన ఫలిస్తే - ఆ రహస్యం భారత ప్రభుత్వం చేతిలో వుంటేనే మంచిదని యిక్కడికి వచ్చేశాను" అన్నాడు.

ఎలైస్ నవ్వి "తన స్వదేశాన్ని గురించి ప్రతి మనిషీ అలానే అనుకుంటాడు. అయినా నాకేమిటి సంబంధం.. ఐ లవ్‌యు" అన్నది అతని భుజం మీద వాలిపోతూ.

రామానుజం కళ్ళార్పకుండా ఆమెనే చూస్తున్నాడు.

"ఎందుకలా చూస్తున్నావు?" అడిగింది.

"నువ్వెంత అందమైన దానివో నీకు తెలుసా!"

"ఎంత అందంగా వుంటే నాకేం. నీ కళ్ళకి అందంగా కనబడితే అదే నాకు అందం."

గులాబీ రంగు ఒళ్ళు. మంచి పొడుగు, ఎత్తయిన వక్షస్థలం. నిగనిగలాడే కత్తిరింపు జుట్టు భుజాలవరకూ పడుతోంది. ఎర్రని పెదిమలకి ఎర్ర రంగు. అందమైన పళ్ళ వరస. నీలం కళ్ళు.

"ఎలైస్! నువ్వు నాతో భారతదేశం రానంటే నేనేమయ్యేవాణ్ణి?" అన్నాడు.

ఎలైస్ నవ్వింది. "వెర్రివాడా! నువ్వు రావద్దన్నా నీ నీడలా వెంటాడి నీతో వచ్చేదాన్ని."

రామానుజం కారు స్టార్టు చేశాడు. అతని యిల్లు నుంగం బాకంలో వుంది. అది శ్రీమంతులు వుండే ప్రాంతం.

ఇళ్ళు దూరదూరంగా వుంటాయి. రామానుజం యిల్లు గేటు నించి అర ఫర్లాంగు వుంటుంది.

రామానుజం గేటు ముందు కారు ఆపాడు. గేటు మూసి వుంది. ఎలైస్ కారు దిగి గేటు తెరిచింది. గేటు దాటగానే అతను కారు ఆపాడు. గేటు మూసి ఎలైస్ కారు యెక్కింది.

"ఇంట్లో దీపాలు లేవేం? నౌకరు యేమయ్యాడు?" అడిగాడు రామానుజం.

"మనం వచ్చేటప్పటికి ఆలస్యం అవుతుందని పడుకోమన్నాను. ఇల్లు తాళం పెట్టి వచ్చాను" చెప్పింది ఎలైస్.

అతడు కారుని షెడ్ ముందు ఆపాడు. ఎలైస్ కారు దిగి షెడ్ తలుపు తెరిచింది. అతను కారు లోపలికి పోనిచ్చి, దీపాలు ఆర్పి, యింజన్ కొంచెం రెయిజ్ చేసి ఆఫ్ చేశాడు.

కారు దిగి తలుపు మూసి, బయటికి వచ్చాడు. చాలా చీకటిగా వుంది. వీధి దీపాల వెలుగు షెడ్ వరకూ పడడం లేదు. గేటు తలుపు ముయ్యడానికి చెయ్యి తలుపు మీద వేసి "ఎలైస్! డార్లింగ్" అని పిలిచాడు.

ఎలైస్ జవాబు యివ్వలేదు.

"డియర్! మైడియర్! వేర్ ఆర్ యు?" పిలిచాడు మళ్ళీ.

ఓ చిన్న నవ్వు వినిపించింది. అది ఎలైస్ గొంతులా లేదు.

"ఎలైస్! ఎలైస్" పిలిచాడు మళ్ళీ.

తలుపు వెనకనించి ఎవరో కదిలిన చప్పుడయింది. చటుక్కున వెనక్కి తిరిగాడు. గుండె ఆగినంత పనయింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. భయంతో వణికిపోతున్నాడు. మనిషి ఎత్తున ముందుకు కదులుతూ వచ్చింది ఒక పుర్రె. ఆ పుర్రె కళ్ళు మెరుస్తున్నాయి.

ఎలైస్‌కి యేదో ఆపద కలిగిందనే భయంవల్లో, అప్పటికే రెండుసార్లు ఆ భీకర రూపం చూడడం వల్లో మాట్లాడడానికి ధైర్యం వచ్చింది.

"ఎవరు నువ్వు? ఎలైస్ ఏది? ఏం చేశావు? నన్నెందుకు యిలా వేధిస్తావు?" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు. అంతలో తలమీద పెద్దరాయి పడినట్లయింది. తరవాత అతనికేమీ తెలియదు. స్పృహ పోతున్నప్పుడు ఎక్కడో దూరాన చర్చి గడియారం ఒంటిగంట కొట్టడం వినిపించింది.

రాజు చేతి గడియారం చూసుకుని "రెండు గంటలు అయింది" అన్నాడు.

"మనం యింకా యిక్కడ కాచుకుని ప్రయోజనం లేదు. ఈ రాత్రి యేమీ జరిగేట్టులేదు. పోదాం పద" అన్నాడు యుగంధర్.

అరగంట పట్టింది యింటికి చేరుకునేందుకు. యుగంధర్ లోపలికి అడుగు పెట్టాడో లేదో టెలిఫోన్ మోగింది.

రిసీవర్ తీసుకుని "యస్. యుగంధర్ హియర్" అన్నాడు.

"నేను రామానుజం. మీరు వెంటనే రావాలి."

"ఎందుకంత ఖంగారు. ఏం జరిగింది?" అడిగాడు యుగంధర్.

"రండి చెపుతాను. ఆలస్యం చెయ్యవద్దు. వెంటనే రండి."

"సరే. వెంటనే వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేసి, కారు షెడ్‌లో పెట్టేసి వొస్తున్న రాజును చూసి "సారీ! కారు మళ్ళీ బయటికి తీసుకురావాలి. వెంటనే రమ్మని రామానుజం ఫోన్ చేశాడు" చెప్పాడు యుగంధర్.

నుంగంబాకంలో పై క్రాఫ్టు రోడ్‌లోకి కారు తిప్పాడు రాజు.

"అదే అయుండాలి రామానుజం యిల్లు. దీపాలన్నీ వెలుగుతున్నాయి" అన్నాడు యుగంధర్.

గేటు తెరిచే వుంది. తిన్నగా పోర్టికోలోకి కారు డ్రైవ్ చేశాడు రాజు.

రామానుజం, అతని పనివాడు పోర్టికోలో నిలబడి వున్నారు.

"ఏమిటి మిస్టర్ రామానుజం ఏమిటి జరిగింది?" అడిగాడు యుగంధర్.

"యుగంధర్! ఆ దెయ్యం ఎలైస్‌ని ఎత్తుకుపోయింది" చెప్పాడు రామానుజం. అతని కంఠస్వరం వణుకుతోంది. అతని జుట్టు చెదిరిపోయింది. బట్టలు నలిగి ముడతలు పడ్డాయి.

"మనిషిని దెయ్యం ఎత్తుకుపోవడమేమిటి? వివరంగా, స్పష్టంగా చెప్పండి."

"పోలీసులకి రిపోర్టు చేద్దామనుకున్నాను. దెయ్యం ఎత్తుకు పోయిందంటే నాకు పిచ్చి పట్టిందనుకుంటారని మీకు ఫోన్ చేశాను. మీరు కూడా -"

"ప్లీజ్ నేనేమీ అనలేదు. వివరంగా జరిగిందంతా చెప్పమంటున్నాను." అన్నాడు యుగంధర్ రామానుజం భుజం మీద చెయ్యివేసి.

"చంపివేసిందేమో యుగంధర్. ఆ దెయ్యం ఎలైస్‌ని చంపి, తినేసిందేమో" అంటూ రామానుజం ఏడ్వడం ప్రారంభించాడు.

"మిస్టర్ రామానుజం దయచేసి దుఃఖం అణచుకుని జరిగిందేమిటో వివరంగా చెప్పండి" అన్నాడు యుగంధర్.

"సారీ! సారీ యుగంధర్ కంట్రోల్ చేసుకోలేకపోయాను" అని యుగంధర్‌కి చెప్పాడు. తను, ఎలైస్ సినిమాకి వెళ్ళడం, సినిమానించి వచ్చి, తను షెడ్లో కారు పెట్టి బయటికి వచ్చి ఎలైస్‌ని పిలవడం, ఎలైస్ పలకకపోవడం తనకి ఆ పుర్రె కనిపించడం, తరవాత తల మీద ఏదో తగిలి స్పృహపోవడం.

"నాకు మళ్ళీ స్పృహ వచ్చేటప్పటికి షెడ్ బయట తలుపు దగ్గర పడివున్నాను. తెలివిరాగానే ఎలైస్ జ్ఞాపకం వచ్చింది. బిగ్గరగా పిలిచాను, జవాబు లేదు. ఆ పుర్రెని చూసి భయపడి యింట్లోకి వెళ్ళిందేమోనని ఇంటివైపు వెళ్ళాను. తలుపు తాళం వేసి వుంది. వెనకవైపు పనివాడు పడుకుంటాడు. అక్కడికి వెళ్ళి అతన్ని లేపాను. అతని దగ్గర వునన్ టార్చిలైటు తీసుకుని, యిద్దరం షెడ్ వైపు వెళ్ళాము. ఆ చుట్టుపక్కలంతా వెతికాము. గొంతు నెప్పి పుట్టేటట్లు 'ఎలైస్! ఎలైస్' అని అరిచాను. ఎక్కడా లేదు. ఆమె హేండ్ బాగ్ షెడ్ బయట పడున్నది. ఆ బాగ్‌లో వున్న తాళం చెవి తీసుకుని తలుపు తెరిచి మీకు ఫోన్ చేశాను" చెప్పాడు రామానుజం.

"షెడ్‌లోకి వెళ్ళి చూడలేదా?" అడిగాడు యుగంధర్.

"లేదు."

"మీలా స్పృహ లేకుండా ఆమె షెడ్లో పడున్నదేమో!"

"ఎలైస్ అసలు షెడ్‌లోకి రాలేదు. షెడ్ తలుపు తెరవడానికి షెడ్ బయటే కారు దిగేసింది."

"అయివుండవచ్చు. అయినా షెడ్‌లోకి వెళ్ళి చూడవద్దూ! రండి వెళదాం" అన్నాడు యుగంధర్.

పనివాడితో సహా నలుగురూ షెడ్‌వైపు వెళుతున్నారు.

"షెడ్లో దీపం వుందా?" అడిగాడు యుగంధర్.

"లేదు. ఎందువల్లో ఇంటివాళ్ళు షెడ్లో దీపం పెట్టించలేదు. దీపం పెట్టించాలని నేను అనుకుంటూనే వున్నాను. కానీ యెప్పటికప్పుడు మరిచిపోతున్నాను" చెప్పాడు రామానుజం.

రాజు వెనక్కి వెళ్ళి క్రిజ్లర్ కారు గ్లవ్ బాక్స్‌లోంచి రెండు టార్చిలైట్లు తీసుకు వచ్చాడు.

షెడ్ తలుపు బార్లా తెరిచి వుంది. యుగంధర్ మాత్రం షెడ్లోకి వెళ్ళాడు. చుట్టూ టార్చి వెలుగు వేసి చూశాడు. ఎలైస్ కారులోకానీ, షెడ్లో కాని లేదు. నేలమీద టార్చి వెలుగు వేశాడు. అడుగు జాడలు కనిపించాయి.

"ఈ అడుగు జాడలు యెవరెవరివో తెలుసుకునేందుకు యీ టార్చి వెలుగు చాలదు" అంటూ వెలుగు అటూ యిటూ వేశాడు. తలుపు వెనక యేదో కనిపించింది. తలుపు లాగాడు. కీచుమన్నది.

తలుపు వెనక మట్టిలో రక్తమూ, ఒక ఎముకా వున్నాయి.

# 5

రామానుజం సోఫాలో పడుకున్నాడు. యుగంధర్, రాజు కిటికీ దగ్గర నిలబడి షెడ్‌వైపు చూస్తున్నారు.

షెడ్ దగ్గర ఆర్క్‌లైట్స్‌తో పోలీసులు హడావిడిగా వున్నారు. గేటు ముందు రెండు పోలీస్‌వాన్‌లు, ఒకజీపు ఆగి వున్నాయి.

"పోలీసులు మాత్రం యేం చెయ్యగలరు యుగంధర్? మనిషి చేసిన పని అయితేగా!" అన్నాడు రామానుజం.

యుగంధర్ జవాబు చెప్పలేదు. చెప్పాలనీలేదు. యుగంధర్‌కి అంతా అయోమయంగా వుంది. దెయ్యాలున్నాయా, లేవా అనే విషయం గురించి ఒక అభిప్రాయానికి రాలేకపోయాడు యింతవరకూ.

"ఎలైస్ బతికి వుందంటారా యుగంధర్. పోనీ ట్రంక్ రోడ్ మీద మనకి దెయ్యం కనిపించిన చోటికి వెళ్ళి చూస్తే" అడిగాడు రామానుజం.

"అట్లాగే వెళ్ళి చూద్దాం. పోలీసుల పని కానివ్వండి" చెప్పాడు యుగంధర్ ఓదార్పుకి. రామానుజం ఎంత మనోవ్యధ పడుతున్నాడో యుగంధర్ అర్థం చేసుకోగలిగాడు.

అంతలో పోర్టికోలో బూట్సుల చప్పుడు వినిపించింది.

"రండి యిన్‌స్పెక్టర్ రండి" అని రామానుజాన్ని యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుకి పరిచయం చేశాడు యుగంధర్.

"చాలా విచిత్రమైన కేసు యుగంధర్. ఆ షెడ్ ప్రాంతాల వున్న అడుగుజాడలన్నీ పరీక్ష చేశాము. మీవీ, రాజువీ, రామానుజం గారివీ, ఆయన పనిమనిషివీ తప్ప యింకెవరి అడుగుజాడలూ లేవు. ఎలైస్ అడుగుజాడలు ఎక్కడా లేవు" అన్నాడు స్వరాజ్యరావు

"కారు షెడ్ బయట రెండడుగుల మేర సిమెంటు చేసి వుందిగా! ఎలైస్ ఆ సిమెంటు చప్టా మీద నడిచిందేమో? మట్టిలో అడుగుపెట్టలేదేమో" అన్నాడు యుగంధర్.

స్వరాజ్యరావు తల వూపి "అలా అనుకున్నా ఎలైస్‌ని ఎత్తుకుపోయిన మనిషి షెడ్‌లో దాక్కుని వుండాలిగా! గాలిలో యెగిరి వచ్చి, గాలిలో యెగిరిపోలేడుగా" అన్నాడు స్వరాజ్యరావు.

"ఆ రక్తమూ, ఎముకా విషయం?" అడిగాడు యుగంధర్.

"లాబ్‌కి పంపాను. ఏ క్షణాన్నయినా ఫోన్‌కాల్ వస్తుంది. మీ అభిప్రాయం ఏమిటి యుగంధర్?" అడిగాడు స్వరాజ్యరావు.

"సారీ యిన్‌స్పెక్టర్ నేనింకా ఏ అభిప్రాయానికి రాలేదు. తరువాత మీ కార్యక్రమం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు యిబ్బందిగా చూశాడు.

"మీరు చెపుతారనుకున్నాను. మా రొటీన్ ప్రకారం చుట్టుపక్కల వాళ్ళని విచారిస్తాను" అన్నాడు.

అంతలో టెలిఫోన్ మోగింది. రామానుజం రిసీవర్ తీసుకుని "ఆ౦ వున్నారు" అని యిన్‌స్పెక్టర్‌ని పిలిచి "మీకోసం" అన్నాడు.

అయిదు నిమిషాలు టెలిఫోన్‌లో మాట్లాడి, రిసీవర్ పెట్టేసి "లాబ్ నించి రిపోర్టు యుగంధర్. ఆ రక్తం మనిషి రక్తమేనట. గ్రూప్ O, ఆ ఎముక కూడా మనిషి ఎముకేనట" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"ఆ రక్తం కారి ఎంతకాలం అయిందిట? ఆ ఎముక ఎంత పాతది? ఇవేమైనా చెప్పారా?" అడిగాడు యుగంధర్.

"లేదు."

"ప్లీజ్! ఆ రక్తం స్పెసిమన్, ఆ ఎముక నా ఆఫీసుకి పంపమని చెపుతారా?"

"ఓ యస్. పొద్దున్నే ఏర్పాటు చేస్తాను" అన్నాడు స్వరాజ్యరావు.

''ఎలైస్ విషయం ఏమిటి? ఎవరైనా కనుక్కుంటారా. లేదా?'' అడిగాడు రామానుజం.

''ప్లీజ్ మిష్టర్ రామానుజం'' అన్నాడు యుగంధర్.

''దిసీజ్ హారిబుల్. బుద్ధిలేక, మతిచెడి, రోజులు బాగా లేక యీ దేశానికి వచ్చాం'' అరిచాడు రామానుజం.

## 6

''లాబరేటరీ తలుపు తాళం మార్చారు. లాబరేటరీ తాళం చెవులు నా దగ్గర వుండకుండా చేశారు. లాబరేటరీ దగ్గరా, నా యింటి దగ్గరా స్పెషల్ బ్రాంచి ఏజంట్లని కాపలా పెట్టారు. నేను ఒంటిగా ఎక్కడికీ వెళ్ళకుండా నాకు తోడు స్పెషల్ బ్రాంచి ఏజంట్లు వుంటున్నారు. ఈ ఏర్పాట్లన్నీ మీరేనా చేయించింది యుగంధర్?'' అడిగాడు రామానుజం చాలా కోపంగా.

''శాంతించండి మిష్టర్ రామానుజం. ఈ ఏర్పాట్లు చేశారన్న విషయం నాకు తెలుసు. మీ శ్రేయస్సు మీదే యీ ఏర్పాట్లు చేయబడ్డాయి'' చెప్పాడు యుగంధర్.

''ఎందుకు? ఏమిటా శ్రేయస్సు?''

''మీ భార్య ఏలైస్ అదృశ్యమైంది. ఎవరు, యెందుకు, యెక్కడికి యెత్తుకుపోయారో తెలియదు.''

''యుగంధర్ నాకు మూఢనమ్మకాలు లేవు. నేను సైంటిస్టుని. విదేశాలలో వుండి వచ్చాను. ఎలైస్ యింకా బతికి వున్నదని నన్ను నమ్మించడానికి ప్రయత్నించకండి. ఎవరో, ఏదో వుద్దేశంతో ఎలైస్‌ని యెత్తుకుపోయారని చెప్పకండి. ఎలైస్‌న్ని ఆ..'' అని యిక మాట్లాడలేక మొహం తిప్పేసుకున్నాడు రామానుజం. ''రామానుజంగారూ! మీ షెడ్ దగ్గర కనపడిన రక్తం మనిషి రక్తమే. మీ భార్య ఎలైస్ రక్తం గ్రూప్‌కి చెందినదే కానీ అది అప్పుడు కారిన రక్తం కాదని తేలింది. ఆ ఎముక కూడా ఏ శ్మశానంలోనో ఏరి తెచ్చిన ఎముక. కనుక ఆ రెండింటినీ బట్టి ఎలైస్ మరణించిందనుకోవలసిన అవసరం లేదు.''

''పోనీ బతికి వుందనేందుకు ఒక నిదర్శనం చెప్పండి.''

యుగంధర్ పెదిమ విరిచాడు. ''ఏమీలేదు. మీరు చేస్తున్న పరిశోధన ప్రాముఖ్యం మీకు బాగా తెలుసు. మీకు ఎటువంటి ఆపదా కలగకుండా యీ రక్షణ ఏర్పాట్లు చెయ్యబడ్డాయి'' అన్నాడు యుగంధర్.

''ఎలైస్‌ని యెత్తుకుపోయిన దెయ్యం నన్ను యెత్తుకు పోకుండా మీరూ, యీ స్పెషల్ బ్రాంచి ఏజంట్లూ ఆపగలరా? ఎలైస్ బతికే వుందని మీరు అభిప్రాయపడుతుంటే నాకు రక్షణ ఏర్పాట్లు చేయించడం కన్నా మీ శక్తి సామర్థ్యాలని ఎలైస్‌ని వెతకడంలో వినియోగిస్తే బావుంటుంది'' అని విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు రామానుజం.

''రామానుజాన్ని చూస్తే జాలేస్తుంది'' అన్నాడు రాజు.

''ఎందుకు?'' అడిగాడు యుగంధర్.

''ఎలైస్ అదృశ్యమై యిప్పటికి ఆరురోజులైంది. మనం కానీ, పోలీసులు కానీ ఏం చేశాం. ఎలైస్ జాడలు ఏం తెలిశాయి?'' అన్నాడు రాజు.

''ఏం చెయ్యాలి? ఏం చెయ్యగలం?'' అడిగాడు యుగంధర్.

"నీ ఎలైస్‌ని దెయ్యం యెత్తుకుపోయింది. మేము ఏమీ చెయ్యలేమని అతనికి చెపితే కొంతకాలం ఏడ్చి వూరుకుంటాడు. ఏదీ తేలని సందిగ్ధంలో పడి చిత్రవధ అనుభవిస్తున్నాడు" అన్నాడు రాజు.

"దెయ్యమే అతని భార్యని ఎత్తుకుపోయిందని మనకి నిశ్చయంగా తెలియనపుడు యెలా చెప్పడం?"

"పోనీ అతనికి చెప్పనవసరంలేదు. ఈ కేసులో మనం ఏం చెయ్యలేకపోతున్నాము. కనుక యీ కేసు ఫైలు మూసెయ్యనా! మనం అపజయం పొందిన మొదటి కేసు అని రాసి లోపల పెట్టెయ్యనా?" అడిగాడు రాజు.

"నీ యిష్టం" అన్నాడు యుగంధర్.

## 7

లావుపాటి అక్కౌంటు పుస్తకం మూసి, బల్లమీద ఒక పక్కన పెట్టి, ఒకసారి వెనక్కి ఆనుకుని, వొళ్ళు విరుచుకుని యింకో లావుపాటి అక్కౌంటు పుస్తకం తీసుకున్నాడు అగర్ చంద్ హీరాలాల్.

అతనికి నలభై ఆరేళ్ళు. మూడు బాంకులకి డైరెక్టర్. రెండు బ్యాంకులకి ఛైర్‌మన్. రెండు స్వంత ఫాక్టరీలు వున్నాయి ఇవికాక పది పెద్ద వ్యాపార సంస్థల అధినేత. ఆ క్షణాన అతని ఆస్థి ఎంతో చెప్పమంటే చెప్పడానికి అతనికే తెలియదు. ఒక కోటో, రెండు కోట్లో చెప్పలేడు. అంత డబ్బున్నా అంత సంపన్నుడయినా రోజూ అర్ధరాత్రి వరకూ డబ్బులు చూసుకుంటూ కూర్చుంటాడు. ఇంత డబ్బుండగా తను యెందుకిలా కష్టపడాలని యెన్నోసార్లు అనిపించిందతనికి. కానీ డబ్బు సంపాదించడం, కష్టపడటం అతనికి బాగా అలవాటైంది. ఆ అలవాటు మానుకోవడం కష్టంగా తోచింది.

హీరాలాల్‌కి ఒక్కడే ఒక్క కొడుకు. అయిదేళ్ళవాడు. సంతానం కోసం దేవుళ్ళకి మొక్కుకున్నాడు. ఎన్నో పుణ్యక్షేత్రాలకి వెళ్ళాడు. ఎన్నో పూజాపునస్కారాలు చేశాడు. పెళ్ళయిన పదేళ్ళకి పుట్టాడు కొడుకు. హీరాలాల్ ఆస్థికి వారసుడు, హీరాలాల్ బతుక్కి వెలుగు, హీరాలాల్ ప్రాణం ఆ అయిదేళ్ళ పిల్లాడు శోభన్.

భోజనం చేసి శోభన్ నిద్రపోయేవరకూ అతని పక్కన కూర్చుని, కథలు చెప్పి, ముద్దుచేసి నిద్రపోయాక తన ఆఫీసు గదిలోకి వచ్చాడు హీరాలాల్, బల్లమీద అక్కౌంటు పుస్తకాల దొంతర వుంది. ఆ పుస్తకాలన్నీ చూసి, లెక్కలు తనిఖీ చేసి తను సంతకాలు పెట్టాలి. గోడకి వున్న గడియారం వైపు చూశాడు. పన్నెండు దాటి పది నిమిషాలయింది. ఎంతలేదన్నా అరగంట పైన పడుతుంది. ఓ అక్కౌంటు పుస్తకం తెరిచాడు. అంకెలు, లక్షలలో వున్న అంకెలు తనిఖీ చేస్తున్నాడు.

గడియారం టకటక చప్పుడు తప్ప వేరే ఏ చప్పుడూ వినిపించడంలేదు. అది ఏర్ కండిషన్డ్ గది. సౌండ్ ప్రూఫ్ గది. అతని యిల్లు మింట్ స్ట్రీట్‌లో వుంది. పగలూ, రాత్రిళ్ళు చాలా రద్దీగా వుంటుంది. వచ్చిపోయే మోటారుకార్లు, సైకిలు రిక్షాలు యిన్నీ అన్నీకావు. జనసమ్మర్దం చాలా ఎక్కువ. రాత్రుళ్ళు కూడా ఆ వీధిలో జనం తిరుగుతుంటారు. కార్లు, సైకిలు రిక్షాలు అర్ధరాత్రికూడా వెళుతుంటాయి. అందుకే హీరాలాల్ తన ఆఫీస్ గదీ, పడక గదీ సౌండ్ ప్రూఫ్ చేయించుకున్నాడు.

హీరాలాల్ చేతిలో వున్న పుస్తకం మూసేసి యింకో అక్కౌంట్ పుస్తకం తీసుకున్నాడు. అలా అన్ని పుస్తకాలూ తనిఖీ చేసి, సంతకాలు పెట్టాడు. పనంతా పూర్తిచేసి గడియారం వేపు చూశాడు. పన్నెండు గంటల యాభైనిమిషాలయింది. పుస్తకాలు బల్లమీద ఒక పక్కగా పెట్టి కుర్చీలోంచి లేచాడు. ఆఫీసు గదికీ, పడకగదికీ మధ్య వున్న తలుపు దగ్గరికి వెళ్ళి, పడక గది తలుపు తెరిచాడు.

గది చీకటిగా వుంది. బెడ్‌రూం లైట్ ఏమైంది? బల్బు ఫ్యూజ్ పోయిందా! ఎందుకవుతుంది. ఫ్యూజ్ కాని బల్బు అమెరికానించి తను తెప్పించాడు కదా! తన భార్య బెడ్‌రూం లైట్ వెలిగించడం మరిచిపోయి వుంటుంది. తను వెళ్ళి ఆఫీసు గది దీపం వెలిగిస్తే, ఆ

వెలుతురులో బెడ్‌రూం స్విచ్ వెయ్యవచ్చు. వెనక్కి తిరిగి తను అప్పుడే మూసి వచ్చిన ఆఫీసు గదికీ, పడక గదికీ మధ్య వున్న తలుపులాగాడు. అయినా రాలేదు, తాళం చెడిపోయిందేమో? తాళం చెవి తిప్పకుండానే లాక్ అయి వుంటుంది. పొద్దున్న చూడాలి అనుకుంటూ చీకట్లో తడుముకుంటూ పడక గదిలో బెడ్‌రూం లైట్ స్విచ్ వెయ్యడానికి వెళ్ళాడు. తలుపుకి ఎదురుగా గోడకి వుంది ఆ స్విచ్ మంచం తల దగ్గర. చప్పుడు చెయ్యకుండా వెళ్ళాడు, చప్పుడయితే కొడుకు నిద్రలేస్తాడని.

స్విచ్ వేశాడు. నీలం రంగు వెలుగు పడింది గదిలో. మంచం వైపు తిరిగాడు హీరాలాల్.

అతని గుండె ఆగిపోయినంత పనయింది. క్షణం పాటు స్థంభించి పోయాడు.

మంచం దగ్గర తన కొడుకు శోభన్ పడుకున్న వైపు, ఎవరో నేలమీద కూర్చునున్నాడు. చేతులూ, కాళ్ళూ ఏమీ కనిపించలేదు. అంతా నల్లగా వుంది. కానీ తల, అది తలకాదు పుర్రె. ఆ పుర్రెకి కళ్ళు మాత్రం వున్నాయి.

తను చూడగానే ఆ పుర్రె తనవైపు తిరిగి తనని కళ్ళల్లోకి చూసింది.

కేక పెట్టాలని నోరు తెరిచాడు కానీ గొంతు పెగలలేదు. తన కొడుక్కి ఏ ఆపద కలుగుతుందోనన్న భయంతో ముందుకు పురకబోయాడు. కాళ్ళు కదలలేదు. తలమీద ఏదో బరువుగా పడినట్లయింది. అక్కడే హీరాలాల్ కుప్పగా కూలిపోయాడు.

## 8

"రండి యుగంధర్. కారణముండే మిమ్మల్ని రమ్మన్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు హీరాలాల్ యింటిముందు యుగంధర్ కారు దిగగానే.

కింద హాల్లో కూర్చునున్నారు హీరాలాల్, అతని భార్య ఇందుమతి. ఆమె కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. పైకి ఏడవకపోయినా హీరాలాల్ దుఃఖాన్ని ఎంతో కష్టం మీద దిగమింగుతున్నాడని తెలుస్తూనే వుంది.

యుగంధర్‌ని యిన్‌స్పెక్టర్ హీరాలాల్‌కి పరిచయం చేశాడు. "మీరే చెప్పండి విపులంగా" అన్నాడు హీరాలాల్‌తో.

తలమీద ఏదో తగలడం, తను స్పృహలేకుండా పడిపోవడం వరకు చెప్పాడు హీరాలాల్. "తరువాత ఎప్పుడో నాకు స్పృహ వచ్చింది. దీపం స్విచ్ వేశాను. తలుపు బార్లా తెరిచి వుంది. మంచం మీద ఒకవైపున నా భార్య పడుకునున్నది. పక్కన శోభన్, నా కొడుకు లేడు. నా కళ్ళముందు ఇంకా ఆ వికృత రూపం - ఆ పుర్రె - కదులుతున్నట్లే వుంది. నా భార్యని లేపడానికి కేకపెట్టాను. లేవలేదు. గదిలోంచి బయటికి వెళ్ళి నౌఖర్లని కేకలు పెట్టి పిలిచాను. వంట మనిషి మహరాజ్, యింటి పనివాడు గోవింద్, నా సెక్రెటరీ మోహన్‌దాస్ కింద పడుకుంటారు. నా కేకలకి ముగ్గురూ పరిగెత్తుకుని మేడమీదకి వచ్చారు. క్లుప్తంగా చెప్పాను జరిగింది. నేను డాక్టర్‌కి ఫోను చేశాను వెంటనే రమ్మని నా భార్యకి ఏమైందో చూడడానికి. నా నౌఖర్లు, సెక్రటరీ యిల్లంతా వెతికి వచ్చి శోభన్ యింట్లో ఎక్కడా లేడని చెప్పారు. నేనూ వెళ్ళి వెతికాను. ఎక్కడా లేడు. వెంటనే పోలీసులకి ఫోన్ చేశాను. ఇదీ జరిగింది. నా కొడుకు యేమయ్యాడు? యుగంధర్. మీరు మహా మేధావులనీ అపరాధ పరిశోధనలో మిమ్మల్ని మించిన వాళ్ళు లేరనీ అంటారు. మీ కాళ్ళుపట్టుకుంటాను. ఎన్ని లక్షలు యివ్వమంటే యిస్తాను. నా కొడుకు -" ఇక దుఃఖం అణచుకోలేక వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించాడు హీరాలాల్.

తను ఏం చెప్పి హీరాలాల్‌ని ఓదార్చగలడు?

యుగంధర్ ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగి "మీరు ఎంతవరకు దర్యాప్తు చేశారు?" అడిగాడు.

"పడక గదిలో నేలమీద అడుగుజాడలు ఏవీ కనిపించలేదు, తలుపుల మీదకాని, బల్లల మీద కానీ యింకెక్కడా వేలిముద్రలు లేవు. ఈ యింటికి వీధిలోకి ఒకే ఒక గుమ్మం వుంది. ఆ తలుపు రెండు రెక్కల తలుపు. తలుపుకి అడ్డంగా ఓ పెద్ద ఇనుప బద్దీ వుంది.

ఆ బద్దీ తలుపుకి అడ్డంగా పెట్టి తాళం వేస్తారు. అదిగాక తలుపుకి పైన, కింద గడియలు వేసినవి వేసినట్లే వున్నాయట. అడ్డంగా బిగించిన బద్దీ అలా అడ్డంగానే వుందిట. తాళం కూడా వేసినది వేసినట్లే వుందిట. తరువాత హీరాలాల్‌గారు వెళ్ళి తాళం తీశారట'' చెప్పాడు ఇన్‌స్పెక్టరు.

''హీరాలాల్‌గారు తాళం ఎందుకు తీశారు? తాళం చెవి ఆయన దగ్గరే వుంటుందా?'' అడిగాడు యుగంధర్.

''ఉహూ! సెక్రటరీ మోహన్‌దాస్ దగ్గర వుంటుది. డాక్టర్‌కి ఫోన్ చేసిన తరువాత తలుపు తెరవమని సెక్రటరీకి చెప్పి, అతనితో హీరాలాల్‌గారు కూడా వీధి గుమ్మం దగ్గరికి వెళ్ళారుట'' చెప్పాడు ఇన్ స్పెక్టర్.

యుగంధర్ తల వూపి ''వీధిలో వాకబు చేశారా?'' అడిగాడు.

''ఆ అర్ధరాత్రి వీధిలో ఎవరుంటారు? సినిమాలు చూసి వచ్చేవాళ్ళు, దుకాణాలు ఆలస్యంగా మూసి ఇళ్ళకి వెళ్ళే వాళ్ళు తప్ప. రాత్రి ఒంటిగంటకి ఎవరు ఇటు వెళ్ళారో, యేం చూశారో యెలా తెలుస్తుంది యిప్పుడు? రేపు దర్యాప్తు చెయ్యాలి'' అని ''ఏమిటి ఆలోచిస్తున్నారు యుగంధర్'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''వీధి తలుపు తెరవకుండానే యింట్లోకి వచ్చిన మనిషి పడక గది తలుపు బార్లా తెరుచుకుని వెళ్ళవలసిన అవసరం ఏమిటి?'' అన్నాడు యుగంధర్.

ఎవరూ ఏమి అనలేదు. రెండు నిమిషాలు అందరూ నిశ్శబ్ధంగా వున్నారు.

''ఏది ఎలా జరిగినా నాకనవసరం. నాకు నా పిల్లవాడు కావాలి. వెంటనే వెతికి తీసుకురండి'' అన్నాడు హీరాలాల్.

''మా శాయశక్తులా ప్రయత్నిస్తాము'' చెప్పాడు స్వరాజ్యరావు.

## 9

అందమైన ఆడవాళ్ళనీ, చిన్నపిల్లవాళ్ళనీ ఎత్తుకుపోతున్నది. దెయ్యమా!

గత గురువారం నాడు ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు రామానుజం భార్య -అమెరికన్ యువతి, అదృశ్యమైది. సినిమానించి ఒంటిగంటకి యింటికి రాగానే మోటార్ షెడ్ వద్ద చీకట్లో ఆకారం లేని ఒక పుర్రె మాత్రం కనిపించిందట. రామానుజానికి తలమీద ఏదో పడి స్పృహ పోయిందిట. ఆయనకి స్పృహ వచ్చిన తరువాత చూస్తే ఆయన భార్య ఎలైస్ యెక్కడా కనపడలేదుట. తలుపు దగ్గర రక్తమూ, ఎముకా వున్నాయట.

అది దెయ్యమా! మనుష్యులని పీక్కుతినే దెయ్యమా! తన భార్య అదృశ్యమైందని రామానుజం పోలీస్‌కి రిపోర్టు చేశారు.

పోలీస్ వాళ్ళు దర్యాప్తు చేస్తున్నారు. కానీ యింతవరకూ రామానుజం భార్య ఎలైస్ ఆచూకీ యేమీ తెలియలేదు.

పోలీసులే కాక ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్ కూడా దర్యాప్తు చేస్తున్నాడు. ఆయనకి యింతవరకూ అంతుపట్టలేదు. దెయ్యమా, మనిషా అన్న విషయం యుగంధర్ ఇంతవరకూ తేల్చకుండా వున్నాడు.

''*గతరాత్రి కోటీశ్వరుడు హీరాలాల్ కుమారుడు శోభన్ అదృశ్యం.*

*మళ్ళీ దెయ్యం కనిపించిందిట.*

*పారిశ్రామిక వేత్త, వ్యాపారస్తుడు, కోటీశ్వరుడు అయిన హీరాలాల్‌కి ఒక్కడే ఒక కుమారుడు. అయిదేళ్ళవాడు. పేరు శోభన్.*

*నిన్న రాత్రి ఒంటిగంట ప్రాంతాల హీరాలాల్ పడక గదిలోకి వెళ్ళాడు. అప్పుడాయనకి ఓ భయంకర దృశ్యం కనిపించింది. పుర్రె, పుర్రెకి కళ్ళు, తలమీద ఏదో తగలడం వల్ల హీరాలాల్‌కి స్పృహపోయింది. ఆయనకి స్పృహవచ్చి చూస్తే కొడుకు మంచం మీద లేడు. ఇల్లంతా వెతికారు గాని యింట్లో యెక్కడా లేడు.*

*మూసిన తలుపులు మూసే వున్నాయి. వీధి గుమ్మానికి లోపల వేసిన తాళం, తలుపులకి అడ్డంగా బిగించిన యినప బద్దీ అలాగే వున్నాయి.*

*హీరాలాల్ కుమారుడు శోభన్ యేమయ్యాడు? దెయ్యం యెత్తుకుపోయిందా? దెయ్యం కాక మనిషే అయితే మూసిన తలుపులు మూసి వుండగా పిల్లవాణ్ణి ఎలా యెత్తుకుపోయాడు?*

*డిటెక్టివ్ యుగంధర్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు యీ ప్రశ్నలకి జవాబు చెపుతారా?"*

రాజు పత్రిక చదివి మడిచి "ఈ పత్రికల వాళ్ళకి ఎవరు చెప్పారో?" అన్నాడు.

"అవును. ఈ వార్త పత్రికల వాళ్ళకి ఎలా తెలిసిందో కనుక్కోవాలి" అంటూ యుగంధర్ టెలిఫోన్‌లో అయిదు నిమిషాలు మాట్లాడి "నిన్నరాత్రి మూడు గంటలకి ఎవరో టెలిఫోన్ చేసి చెప్పారట రామానుజం భార్య విషయం హీరాలాల్ కొడుకు విషయం వెంటనే ఒకర్ని రామానుజం యింటికీ, యింకొకర్ని హీరాలాల్ యింటికీ పంపించారంట" చెప్పాడు యుగంధర్.

"అంటే యీ వార్త బయట పెట్టడానికి ఎవరో ప్రయత్నించారన్నమాట" అన్నాడు రాజు.

"అట్లాగే అనుకోవాలి. వీళ్ళిద్దర్నీ దెయ్యం ఎత్తుకుపోయిందని అందరికీ తెలియడంతో ఆ మనిషికి యేమిటి లాభం? దెయ్యం టెలిఫోన్ చేసి ఆ పత్రిక సంపాదకుడికి చెప్పిందని నేను నమ్మను" అన్నాడు యుగంధర్.

"అసలు రామానుజం భార్య ఎలైస్‌నీ, హీరాలాల్ కొడుకు శోభన్నీ ఎత్తుకుపోవడంలో వుద్దేశం యేమిటి? వారం రోజులయింది ఎలైస్ అదృశ్యమై. ఏదో కారణం వుండి ఎత్తుకుపోతే యీపాటికి బయటపడాలి కదా!?" అన్నాడు రాజు.

"రాజూ! ఇప్పటివరకు నాలో ఒక మూల అనుమానం వుంటూనే వుంది. ఒకవేళ దెయ్యమేనేమో అని. ఇప్పుడా అనుమానం పోయింది. ఈ క్షణం నించీ ఎలైస్‌నీ, శోభన్నీ ఎత్తుకుపోయింది మనిషే అయి వుండాలనే కార్యక్రమంలోకి దిగుదాం" అన్నాడు యుగంధర్.

రాజు మొహం వికసించింది. "చెప్పండి కార్యక్రమం ఏమిటో! ఏం చేద్దాం?" అడిగాడు.

"నువ్వు చెయ్యవలసింది చెపుతాను విను. ముందు లాబ్‌లోకి వెళ్ళి నువ్వు ఒకటి తయారు చెయ్యాలి."

"ఏమిటిది?"

"కాస్త గట్టిగా వుండే పాలిథిన్‌తో తయారు చెయ్యి, మొహానికి ముసుగులాటిది - అంటే మాస్క్. పూర్తిగా తెల్లగా వుండకూడదు. రవ్వంత పసుపు రంగులో వుండాలి - అలాటి పుర్రె తయారు చెయ్యాలి. కళ్ళు వుండే చోట కాస్త పెద్ద కంతలు పెట్టు, తలమీద నించి తొడుక్కుంటే తలనీ, జుట్టునీ పూర్తిగా కప్పివేసేటట్లు, మొహాన్ని మూసివేసేటట్లు వుండాలి" చెప్పాడు యుగంధర్.

"అర్థమైంది. వెంటనే తయారు చేస్తాను" అని రాజు వెళ్ళిపోయాడు.

## 10

మేజర్ రమాకాంత్ కారు వీధి చివర ఆపి, రెండుసార్లు మోగించాడు హారన్. రియర్ వ్యూ అద్దం సరిచేసుకుని అందులోంచి చూస్తున్నాడు.

పావుగంట దాటింది. ఎంతకీ రాలేదు మాలిని. యింటి ముందునించి వస్తున్నప్పుడు చూశాడు మాలిని తనని కిటికీలోంచి చూడడము. చిన్న నవ్వు కూడా నవ్వింది. తను మళ్ళీ వెనక్కి వెళ్ళి చూడకూడదు. అయిదు నిమిషాలు పది నిమిషాలు గడిచిపోయాయి. మేజర్ రమాకాంత్ కారు స్టార్టు చేశాడు. వెనక నించి మాలిని రావడం అద్దంలో కనిపించింది. కారు ఆపి యింజన్ ఆఫ్ చెయ్యకుండా కాచుకున్నాడు.

"సారీ! ఆలస్యం  అయినందుకు" అన్నది మాలిని.

"ఎందుకు ఆలస్యం అయింది?" అడిగాడు.

"ఇవేళ నాన్నగారు, అమ్మగారు ఎక్కువ గొడవ చేశారు. ఇంట్లోంచి కదలడానికి వీల్లేదన్నారు."

"అయితే ఎట్లా వచ్చావు?"

"నేను వెళ్ళి తీర్తానన్నాను. వెళితే మళ్ళీ ఆ యింటి గుమ్మం తొక్కకూడదన్నారు."

"ఛ !ఛ మీ వాళ్ళకి నేనంటే ఎందుకు గిట్టదు. నేనేం తప్పు చేశాను?"

"నిజం చెప్పమంటావా!"

రమాకాంత్ చిన్న నవ్వు నవ్వి "నువ్వు నాతో ఎప్పుడూ నిజమే చెప్పాలి" అన్నాడు.

"నువ్వు నాలుగు రోజులు నాతో సరదాగా తిరిగి వెళ్ళిపోతావనీ, నన్ను పెళ్ళి చేసుకునే వుద్దేశం నీకు లేదనీ వాళ్ళ అభిప్రాయం" అన్నది మాలిని.

రమాకాంత్ ఒకసారి మాలినిని చూసి కారు యెక్కించుకుని మళ్ళీ వీధివైపు చూస్తూ కారు డ్రైవ్ చేస్తున్నాడు.

ఇరవై ఏళ్ళు వుంటాయి మాలినికి. ఆకర్షణీయమైన విగ్రహం. మంచి రంగు. చిలిపిగా నవ్వే కళ్ళు. నొక్కుల జుట్టు, అందమైన పళ్ళవరస. నిండు పెదిమలు. బి.ఏ చదివింది. ఉద్యోగం చేస్తోంది. నెలకి మూడు వందలు సంపాదిస్తోంది.

"మాట్లాడవేం? మౌనం యెందుకు? నువ్వు అడిగావు కనక మా వాళ్ళ విషయం చెప్పాను" అన్నది.

"అయితే నీకటువంటి ఆలోచనలేదా?" అడిగాడు నవ్వుతూ.

"నేను అంతవరకు ఆలోచించలేదు.ఏమో నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవనే అధైర్యం వల్లకావచ్చు" అన్నది రెప్పవాల్చకుండా అతన్ని చూస్తూ.

ముప్పయి ఏళ్ళవాడు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. చురుకైన మొహం, ఠీవీ, తెలివీ కనిపిస్తాయి అతని నడకలో, అతని మాటల్లో. అతను మేజర్. అతనికి జీతం యెంతో ఆమెకి తెలియదు. ఆమె అడగనులేదు. పెద్ద జీతమే వుండాలనుకున్నది. అతనంటే తనకి ప్రాణం. అతనంటే తనకి పిచ్చి. తన మీద అతనికి అంత యిష్టమూ ప్రేమా వున్నాయా? ఎందుకుంటాయి? తను సామాన్యురాలు. గొప్ప అందమైనదికాదు. తన తండ్రికి పెద్ద హోదా, డబ్బూలేవు.

అతనేం మాట్లాడలేదు. కారు డ్రైవ్ చేస్తున్నాడు. అతను మాట్లాడకపోయేసరికి మాలినికి యేం మాట్లాడాలో తోచక మౌనంగా వుండిపోయింది.

గిండీ రేస్ కోర్స్ వెనకవున్న వేలచ్చేరీ రోడ్లోకి కారు తిప్పాడు అతను.

"ఎక్కడికి?" అడిగింది.

"ఏమో! నాకే తెలియదు" అన్నాడు.

"సినిమాకి వెళదాం అన్నావు?"

"టిక్కట్లు కొన్నాను. సినిమా చూడాలని లేదు. నీకు అభ్యంతరమా?"

బలవంతంగా నవ్వు తెచ్చిపెట్టుకున్నది. "నీ యిష్టం. ఎక్కడికైనా సరే" అని వెనక్కి జారగిలబడింది.

నాలుగు మైళ్ళు వెళ్ళి రోడ్‌కి పక్కగా కారు ఆపాడు. చీకటి పడుతోంది. ఆ రోడ్ మీద యెప్పుడో ఒక లారీ వెళుతుంది. ఎప్పుడైనా ఓ మనిషి వెళతాడు.

"దిగుదామా?" అడిగాడు.

"ఊఁ!"

కారు దిగి రోడ్ పక్కన కొంచెం దూరం నడిచారు.

"ఇక్కడ కూర్చుందామా?" అడిగాడు.

"ఊఁ!" అని కూర్చున్నది.

"దూరంగా కూర్చున్నావేం?" అడిగాడతను.

"దగ్గరికి రా" అన్నది.

అతను దగ్గరికి జరిగాడు. ఆమె రెండు భుజాలూ పట్టుకుని వొళ్ళోకి లాక్కున్నాడు. లాక్కుని ఆమె మొహాన్ని తన పెదిమలతో తడిచేశాడు. ఆవేశంతో, ఆయాసంతో ఆమె రొప్పుతోంది.

"మాలినీ!"

"కాంత్"

"అడగవేం?"

"ఏమిటి?"

"పెళ్ళి."

"పెళ్ళి చేసుకున్నా, చేసుకోకపోయినా నీ ప్రేమకావాలి నాకు" అన్నది అతని మెడ చుట్టూ చేతులు వేసి, మీదికి లాక్కుంటూ.

గాలివీస్తోందా, రోడ్‌మీద లారీలు వెళుతున్నాయా, చందమామ ఆకాశంలోకి వచ్చాడా, యివేమీ తెలియవు వాళ్ళకి. బయట ప్రపంచం పూర్తిగా మరిచిపోయారు. పెదిమల అంచుల్లో, పెదిమల వెనక వుండే తడిలో, ఒంటి మెత్తదనంలో, ఆ మెత్తదనంలో వుండే గట్టితనాన్ని, ఒంపుల మీద వుండే గరగరలో, ప్రపంచాన్ని, ఈ ప్రపంచాన్నే మర్చిపోయారు. ఆ చీకట్లో వున్నకాంతిని, ఆ కాంతిలో వున్న రంగులనీ అనుభవిస్తున్నారు.

పెదిమలు మండిపోతున్నాయి. శరీరాలు అలసిపోయాయి.

"టైం ఎంత అయిందో తెలుసా?" అడిగాడు.

"ఎంత అయిందేమిటి?"

"ఒంటిగంట" అంటున్నాడు. అంటూ చూశాడు పక్కన ఎవరో కదలడం, చటుక్కున తల తిప్పి అటుచూశాడు.

చీకటి అయినా ఆ చీకట్లోనే కనిపించింది స్పష్టంగా. అది పుర్రె. ఆకారం కనిపించలేదు కానీ ఆ పుర్రె మనిషి ఎత్తున వుంది. ఆ పుర్రెకి కళ్ళున్నాయి.

"ఎవరు నువ్వు?" అంటూ లేచాడు మేజర్ రమాకాంత్. మాలిని కూడా అప్పుడు అటు చూసింది. చూడగానే కెవ్వున కేకపెట్టింది.

మేజర్ రమాకాంత్‌కి భయం అంటే ఏమిటో తెలియదు. అతనికి దెయ్యాలన్నా, భూతాలన్నా అసలు నమ్మకం లేదు. ఈ పుర్రె ఎలా వచ్చింది, ఎలా కదులుతోంది, పుర్రెకి కళ్ళేమిటి? ఆ ఆలోచనలేదు అతనికి. పట్టుకోవాలి అన్న ఆలోచన ఒకటే. ఒక్క గంతున లేచాడు.

పుర్రె కదిలినట్లయింది. వెళ్ళిపోతోంది. వెళ్ళిపోతున్న ఆ పుర్రెని వెంటాడాడు.

తనకి ప్రమాదమేమో! మాలినిని ఒంటిగా వదిలి వచ్చానే! తనకి తెలియని నిర్జన ప్రదేశమే. అర్ధరాత్రే. ఇటువంటి ఆలోచనలేవీ రాలేదు అతనికి.

పరిగెత్తుతున్నాడు. తనకన్నా వేగంగా పరిగెత్తుతున్నదా పుర్రె.

ఉన్నట్లుండి ఆ పుర్రె మాయమైంది. కనిపించడంలేదు. ఎటు వెళ్ళింది? ఏమైంది?

రమాకాంత్ ఆగిపోయాడు. సరిగా ఆ సమయానికి మాలిని కెవ్వున కేకపెట్టింది.

"మాలినీ, వస్తున్నాను" అంటూ ఆమె కూర్చున్న వేపు పరిగెత్తాడు రమాకాంత్. పరిగెత్తుతుండగా తలమీద ఏదో తగిలింది. ముందుకి పడ్డాడు.

## 11

"**క్షమించండి.** యింత రాత్రివేళ వచ్చినందుకు."

"రండి" అన్నాడు రాజు.

"డిటెక్టివ్ యుగంధర్?"

"నా పేరు రాజు. నేను యుగంధర్ అసిస్టెంటుని."

"నేను మేజర్ రమాకాంత్ - యుగంధర్‌గారిని కలుసుకోవాలి."

"అవసరమైతే పిలుస్తాను. కూర్చోండి. ఏమిటో చెప్పండి" అడిగాడు రాజు.

గడియారం మూడు గంటలు చూపిస్తోంది. కాలింగ్‌బెల్ రాజు గదిలో వుంది. అవసరమైతే తప్ప యుగంధర్‌ని లేపడు రాజు. "పత్రికలో చదివాను. దెయ్యం, మనుష్యులని ఎత్తుకుపోతోందనీ, పోలీసులతోపాటు యుగంధర్‌గారు కూడా దర్యాప్తు చేస్తున్నారనీ. ఇందాక అంటే రెండుగంటల క్రితం - అంటే ఒంటిగంటకి ఆ దెయ్యాన్ని నేను చూశాను" అన్నాడు రమాకాంత్.

"యుగంధర్‌గార్ని పిలుస్తాను. నాకొసారి, యుగంధర్‌కోసారి చెప్పడం దేనికి" అంటూ రాజు లోపలికి వెళ్ళి పది నిమిషాల్లో యుగంధర్‌తో తిరిగి వచ్చాడు కన్సల్టింగ్ గదిలోకి.

మేజర్ రమాకాంత్ జరిగినదంతా వివరంగా యుగంధర్‌కి చెప్పాడు. "నాకు స్పృహ వచ్చేటప్పటికి రాత్రి ఒంటి గంటన్నర అయింది. వెంటనే 'మాలినీ' అంటూ అయిదారుసార్లు పిలిచాను. మేము కూర్చున్న చోటికే వెళ్ళి చూశాను. మాలిని లేదు. కారు దగ్గరికి

వెళ్ళి, గ్లవ్ బాక్సులోంచి టార్చిలైటు తీసుకుని అక్కడంతా వెతికాను. మాలిని ఎక్కడాలేదు. కానీ మేము కూర్చున్నచోట యిది పడి వుంది'' అంటూ ఒక కాగితం పొట్లం బల్లమీద పెట్టాడు.

యుగంధర్ పొట్లం విప్పి చూశాడు. రోల్డుగోల్డు బొత్తాము. మధ్య తెల్లరాయి పొదగబడి వుంది.  షర్టు చేతులకి పెట్టుకునే గుండీ అది.

''ఈ కప్‌లింక్ ఎప్పుడో ఎవడో అక్కడ పారేసుకున్నది కాదు. మాలినిని ఎత్తుకుపోయిన మనిషిదే అందులో సందేహం లేదు'' చెప్పాడు రమాకాంత్.

''ఎవరో ఎప్పుడో అక్కడ పారేసుకున్నది యెందుకు కాకూడదు?'' అడిగాడు యుగంధర్.

''మేము అక్కడికి వెళ్ళినపుడు కాస్త వెలుగున్నది. అప్పుడు మాకు కనిపించలేదు.''

''ఏమో! ఇంతకన్నా గొప్పగా మెరుస్తున్న అందం మీ పక్కన వుండగా మీరు దీన్ని చూసి వుండకపోవచ్చు. ''

''అంతేకాదు యుగంధర్. ఈ కఫ్‌లింక్‌ని జాగ్రత్తగా పరీక్షించండి. ఎలా మెరుస్తున్నదో. ఎప్పుడో అక్కడ పడివుంటే దుమ్ము కొట్టుకుని వుంటుంది. ఇలా మెరవదు.''

''అవును. అది నిజమే. ఎప్పుడో అక్కడ పడలేదని నేనూ ఒప్పుకుంటాను. మాలినిని యెత్తుకుపోయింది దెయ్యం కాదనీ, మనిషే అనీ అనుకుందాం. అప్పుడు ఒకటి, రెండు సందేహాలు కలుగుతాయి. మీరు అక్కడికి - వేలచ్చేరి రోడ్‌మీద ఆ చోటుకి, అప్పుడు వెళుతున్నారని ఎవరికైనా తెలుసా! ఎవరైనా మిమ్మల్ని వెంటాడి వచ్చారా! మాలినిని యెత్తుకుపోవడానికి కారణం ఏమైనా వుందా? మీకు కానీ, ఆమెకి కానీ విరోధులు ఎవరైనా వున్నారా?'' అడిగాడు యుగంధర్.

''అక్కడికి వెళ్ళి కారు ఆపేటంతవరకూ అక్కడికి వెళుతున్నానని నాకే తెలియదు. ఎవరైనా వెంటాడారేమో నేను గమనించలేదు. నాకు విరోధులు ఎవరూ లేరు, మాలిని విషయం నాకు తెలియదు'' చెప్పాడు రమాకాంత్.

''ఇంకో ప్రశ్న. మీరు రాత్రి ఒంటిగంట వరకూ అక్కడ వుంటారని ఎవరికో ఎలా తెలుసు? రాత్రి ఒంటిగంటకే వస్తుందా దెయ్యం.''

రమాకాంత్ పెదిమ విరిచాడు ''మీరు డిటెక్టివ్. ఈ సందేహాలన్నిటికీ మీరే జవ్వాబు చెప్పాలి. లేదా మీరు తెలుసుకోవాలి'' అన్నాడు.

''ఆల్ రైట్. నాకు వచ్చి చెప్పినందుకు థాంక్స్. ఈ కప్‌లింక్ నా దగ్గరే వుండనివ్వండి. ఇది మీకు కనిపించినట్టుగాని, నాకు ఇచ్చినట్లుగాని ఎవరికీ చెప్పకండి. ఫార్మల్‌గా పోలీసులకి కంప్లైంటు ఇవ్వండి'' చెప్పాడు యుగంధర్.

మేజర్ రమాకాంత్ లేచి నిలబడ్డాడు. ''ఇంతరాత్రివేళ ఓపిగ్గా విన్నందుకు థాంక్సు. ఒక్క విషయం - మాలిని తల్లితండ్రులకి -''

''మీరే వెళ్ళి చెప్పాలి, తప్పదు. అది మీ బాధ్యత'' అన్నాడు యుగంధర్.

## 12

పత్రికలన్నీ ఘోష పెట్టడం మొదలు పెట్టాయి. ''దెయ్యమా? కాదా? పోలీసువారు యెందుకు తేల్చరు?'' అంటూ ఒక పత్రిక రాసింది.

''దెయ్యమని చెప్పి పోలీసువారు తమ అసమర్థతని కప్పి పుచ్చుతున్నారు'' ఇంకో పత్రిక.

''ప్రజలకి రక్షణ యేది? ప్రాణ భయంతో ప్రజలు గజగజలాడవలసిందేనా?'' -

''దెయ్యమో కాదో తేలేంతవరకూ ఎవరూ బయటికి వెళ్ళవద్దు'' ఇంకో పత్రిక సలహా.

"ఇంట్లో వున్నా, బయటికి వెళ్ళినా ఆపద తప్పదు. దెయ్యాన్ని ఎవరేం చెయ్యగలరు!?" - మరో పత్రిక.

"సాయంకాలం కాగానే తల్లులు పిల్లల్ని గట్టిగా కావలించుకుని కూర్చుంటున్నారు. పురుషులు ఆఫీసుల నుంచి తిన్నగా యింటికి వచ్చి తలుపులు మూసి, గడియలు పెట్టి కూర్చుంటున్నారు. చీకటి పడిన తర్వాత మద్రాసు మహాపట్నం వీధుల్లో జన సంచారమే వుండడం లేదు. సినిమా హాళ్ళు, హోటళ్ళు, షాపులు ఖాళీగా వుంటున్నాయి. తెగించిన వాళ్ళు ఏ కొద్దిమందో తప్ప ధైర్యం చేసి చీకటి పడిన తరువాత వీధుల్లోకి యెవరూ రావడంలేదు. మద్రాసు పట్నంలో వాణిజ్యం దెబ్బతింటోంది.

"మద్రాసు నగర పోలీసులు యీ విషయం దర్యాప్తు చేసి, వెంటనే ప్రజలలో భయం పోగొట్టి, నగరంలో పరిస్థితి చక్కబడేట్లు చెయ్యాలి" అని వాణిజ్యమండలి విజ్ఞప్తి చేసింది.

పత్రికల వాళ్ళు పోలీస్ కమీషనర్ ఆఫీసు ముందు గుమికూడుతున్నారు. చీకటవగానే ఇంకేమయినా జరిగిన వార్త వస్తుందేమోనని.

థియేటర్ల సంఘంవారు పోలీసు కమీషనర్‌కి, హోం మంత్రికీ నివేదికలు పంపారు. రెండు రోజులపాటు అన్ని పత్రికలూ దెయ్యం విషయాలే రాశాయి.

పత్రికల్లో పేరు పడితే చాలనుకునేవాళ్ళు దెయ్యాన్ని ఇక్కడ చూశామనీ, అక్కడ చూశామని కల్పించి పత్రికలకి రాస్తున్నారు. పత్రికలు ఆ వార్తలు ప్రకటిస్తున్నాయి, వీలున్నవాళ్ళు దెయ్యం భయంవల్ల మద్రాసు వదిలి తమసొంత వూళ్ళకి వెళ్ళిపోతున్నారు.

'దెయ్యం మళ్ళీ బలి తీసుకున్నది.'

'నిన్నరాత్రి ఒంటిగంటకి దెయ్యం మళ్ళీ వచ్చి ఓ పదహారేళ్ళ అమ్మాయిని యెత్తుకుపోయిందని పాఠకులకి తెలియజెయ్యడానికి చాలా విచారిస్తున్నాము.'

శ్రీ పార్థసారధి, ఆర్డినెన్సు ఫాక్టరీలో ఇంజనీరు. పెరంబూరులో రోజ్‌మేరీ రోడ్‌లో వుంటున్నారు. వారిది చిన్న బంగళా. ఒక గదిలో ఆయన, ఆయన భార్య, ఇంకో గదిలో ఆయన కుమార్తె సుజాత పడుకున్నారు.

ఒక రాత్రివేళ వంట యింట్లో ఏదో చప్పుడైతే శ్రీ పార్థసారధి భార్య, భర్తని నిద్రలేపింది. శ్రీ పార్థసారధి ఎలక్ట్రిక్ దీపం స్విచ్ నొక్కితే దీపం వెలగలేదు. ఫ్యూజు పోయిందేమో అనుకుని ఫ్యూజు వెయ్యడానికి నడవాలోకి వెళ్ళారు. ఆయన వెనకే ఆయన భార్య కూడా వెళ్ళింది. నడవాలో కటిక చీకటిగా వుంది. ఏమీ కనిపించడంలేదు. పార్థసారధి అగ్గిపుల్ల గీశాడు.

అప్పుడు చూశాడు తన కెదురుగా నల్లగా ఒక ఆకారం నిలుచునుండడం.

ఆ ఆకారానికి తల లేదు. తల వుండవలసిన చోట పుర్రె వుంది. ఆ పుర్రెకి కళ్ళున్నాయి. ఆ దృశ్యం చూడగానే పార్థసారధి భార్య ఒక కేక పెట్టి కిందపడిపోయింది. ఆ సమయానికి అగ్గిపుల్ల ఆరిపోయి మళ్ళీ అంతా చీకటి అయింది. పార్థసారధి ధైర్యస్తుడు. ఇంకో అగ్గిపుల్ల గియ్యడానికి ప్రయత్నిస్తుండగా తల మీద ఏదో బరువుగా పడింది. నేలకూలాడు. పార్థసారధికి స్పృహ వచ్చేటప్పటికి రాత్రి రెండు గంటలయింది. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. ఆయన భార్యకి ఇంకా స్పృహ రాలేదు. కుమార్తె సుజాత ఏమైందోనని ఆమె పడుకున్న గదిలోకి వెళ్ళాడు పార్థసారధి.

సుజాత లేదు. పరుపు మీద రక్తమూ, ఎముకలూ వున్నాయి. పెరటి గుమ్మం బార్లా తెరిచి వుంది. పార్థసారధికి స్పృహ వచ్చేటప్పటికి రాత్రి రెండు గంటలయింది. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. ఆయన భార్యకి ఇంకా స్పృహ రాలేదు. కుమార్తె సుజాత ఏమైందోనని ఆమె పడుకున్న గదిలోకి వెళ్ళాడు పార్థసారధి.

సుజాత లేదు. పరుపు మీద రక్తమూ, ఎముకలూ వున్నాయి. పెరటి గుమ్మం బాటిల్ తెరిచి వుంది. పార్థసారధి పోలీసులకి ఫోన్ చేశాడు.

"దుఃఖంతో కుమిలిపోతున్న ఆ దంపతుల్ని మా విలేఖరి వెళ్ళి కలుసుకున్నాడు. 'మనిషి చేసిన పనికాదు యిది. దెయ్యమే. సందేహం లేదు' అన్నారా దంపతులు. ఇంటి వాకిటి తలుపూ, పెరటి తలుపూ పడుకునే ముందు జాగ్రత్తగా గడియలు పెట్టాననీ, ఇంట్లోకి రావడానికి యింకో మార్గం లేదనీ, తలుపులు విరగ కొట్టినట్లు నిదర్శనాలు లేవనీ అన్నారు ఆయన.

మూసిన తలుపులు మూసినట్లు వుండగానే, తలుపులకి వేసిన తాళాలు వేసినట్లు వుండగానే శ్రీ హీరాలాల్ కుమారుడు శోభన్ అదృశ్యమైన విషయం పాఠకులకి తెలిసిన విషయమే. తలుపులు మూసి గడియలు పెట్టినా, వాటికి తాళాలు వేసినా యీ దెయ్యానికి అవి అడ్డురావు.

పోలీసులనీ, డిటెక్టివ్‌లనీ (ప్రఖ్యాత డిటెక్టివ్ శ్రీ యుగంధర్ పరిశోధన చేస్తున్నారని విన్నాము) నమ్ముకుని ఎంతకాలమీ పట్నం ప్రజలు భయంతో వణికిపోతూ బతకగలరు. ఇంకా ఎంత మంది బలి అవుతారో.

మాంత్రికులనీ, భూత వైద్యులనీ పిలిపించి దెయ్యాన్ని తరిమివేసే యేర్పాటు వెంటనే ఎందుకు చెయ్యకూడదు? మంత్రవేత్తలను పిలిపించి, హోమాలు చేయించి దెయ్యాన్ని వెళ్ళగొట్టే ప్రయత్నం ఎందుకు చెయ్యరు? అలాటిదేదో చేసి నగర ప్రజలలో భయం పోగొట్టి, శాంతి భద్రతలు నెలకొల్పాలి అని కొందరు విజ్ఞులు అంటున్నారు. ఈ పనికి అధికారులు పూనుకోకపోయినా, సంఘ సేవా సమాజాలూ, శ్రీమంతులూ పూనుకోవాలి" ఒక దినపత్రిక రాసింది.

## 13

ఇంకో యువతి అదృశ్యం.

దెయ్యం మళ్ళీ ఎత్తుకుపోయిందా!?

రెండు రోజుల తర్వాత యీ పతాక శీర్షికతో వెలువడింది ఓ దినపత్రిక. ఇటువంటి శీర్షికలే వేశాయి మిగతా పత్రికలన్నీ.

మద్రాసు - మార్చి 7 తేదీ.

(మా విలేఖరి)

నిన్న రాత్రి ఒంటిగంటకి దెయ్యం మళ్ళీ ఇంకొక యువతినిఎత్తుకు పోయిందన్న వార్త యిప్పుడే వచ్చింది.

రిజర్వుబాంక్ యిష్యూ డిపార్టుమెంటులో వున్నతోద్యోగి శ్రీ మీనన్. ఆయన వయస్సు ముప్పయి రెండు ఏళ్ళు. మీనన్ భార్య పేరు శకుంతల. ఆమె వయస్సు యిరవై నాలుగేళ్ళు. మీనన్ అన్నామలై నగరంలో స్వంత యింట్లో వుంటున్నాడు. సంవత్సరం క్రితమే పెళ్ళయింది. పిల్లలు లేరు. ఇంట్లో భార్యా, భర్త మాత్రమే వుంటున్నారు. నిన్న రాత్రి యింటి వెనక వైపు తలుపు ఎవరో తట్టిన చప్పుడయి మీనన్ దీపాలు వెలిగించి వెళ్ళి తలుపు తీశాడు. తలుపుకి అవతల ఓ ఆకారం నిలుచున్నది. మనిషి ఎత్తున పుర్రె మాత్రం వుంది. ఆ పుర్రెకి కళ్ళున్నాయి.

అప్పుడు జ్ఞాపకం వచ్చిందట మీనన్‌కి దెయ్యం విషయం. అప్పుడు గుర్తుకి వచ్చిందిట రాత్రి ఒంటిగంట అయిందని. వెంటనే మీనన్ తలుపు మూసెయ్యబోయాడట. ఏదో తెల్లటిది ఎముకలాటిది కళ్ళముందు కదిలింది. మరుక్షణం తలమీద దెబ్బ తగిలింది. వెంటనే స్పృహ పోయింది.

తెలివి వచ్చేటప్పటికి రాత్రి మూడుగంటలయింది. మీనన్ భార్య శకుంతల యింట్లో లేదు. అదృశ్యమైంది. మీనన్ వెంటనే పోలీసులకి ఫోన్ చేశాడు. పోలీసులు వెంటనే వచ్చారు.

ఇదివరలో రామానుజం భార్య ఎలైస్‌నీ, హీరాలాల్ కుమారుడూ శోభన్నీ, మేజర్ రమాకాంత్ ప్రియురాలు మాలినినీ, పార్థసారథి కుమార్తె సుజాతనీ ఎత్తుకుపోయినపుడు పోలీసులు వాళ్ళ ఆచూకీ తెలుసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఎంత ఫలించాయో యిప్పుడూ అంతే.

కాసేపు యిల్లంతా హడావిడిగా తిరిగి, కొన్నిఫోటోలు తీసి పోలీసులు వెళ్ళిపోయారు. తను భార్యని మళ్ళీ చూస్తాననే ఆశలేదు మీనన్‌కి.

అధికారులు యీ విధంగా తాత్సారం చెయ్యడం న్యాయం కాదు. మనుష్యులు మాయమవుతున్నారు. ఏమవుతున్నారు. గాలిలో కలిసిపోతున్నారా!

నిజంగా దెయ్యమనేది వుందా? దెయ్యమే వీళ్ళందరినీ ఎత్తుకుపోతోందా? ఎందుకు? ఆకలివేసి పీక్కు తినడానికా? రాత్రి ఒంటిగంటకే దెయ్యాలకి ఆకలేస్తుందా? ఎత్తుకుపోవడానికి, అందమైన ఆడవాళ్ళనీ, పసిపిల్లలనీ ఏరుకోడానికీ ఏదైనా కారణం వుందా? ఈ దెయ్యాన్నించి ప్రజలని కాపాడేందుకు అధికారులు యేం చెయ్యలేరా! అసలు యీ పనులు చేస్తున్నది దెయ్యమేనా?

ఎంతమందో దొంగలనీ, హంతకులనీ, దేశద్రోహులనీ అసమాన ప్రజ్ఞతో పట్టుకున్న డిటెక్టివ్ యుగంధర్ యేం చేస్తున్నాడు.?

మనం మనుషులం - అది మానవాతీతమైన శక్తి - మనం యేం చెయ్యలేము అని యుగంధర్ చెపితే యీ సందిగ్ధం, యీ బాధ వుండవు.

***హెచ్చరిక.***

రాత్రిళ్ళు ఎవరూ ఒంటిగా ఎక్కడికీ వెళ్ళవద్దు, ఎవరూ రాత్రిళ్ళు ఒంటిగా వెళ్ళి తెలుపు తెరవవద్దు. ముఖ్యంగా వయసులో వున్న ఆడవాళ్ళు. పిల్లలు వున్న యిళ్ళల్లో రాత్రిళ్ళు అందరూ ఒకే గదిలో వుండాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ మొగవాళ్ళు ఆడవాళ్ళనీ, పిల్లలనీ వొదిలి వెళ్ళకూడదు. వీలైతే యిరుగు పొరుగు యిళ్ళ వాళ్ళు ఒకే యింట్లో పడుకోవడం మంచిది యీ దెయ్యం విషయం తేలేంతవరకూ.

ప్రభుత్వం సైనిక సహాయం కోరి, ప్రతి వీధిలోనూ సైనికుల్ని కాపలా పెట్టడంలో తప్పేముంది.

"నగరంలో విపరీతమైన పరిస్థితి ఏర్పడింది కనుక సైనిక సహాయం కోరడంలో తప్పేమీ లేదని మా అభిప్రాయం" ఒక దిన పత్రిక.

## 14

"రండి యుగంధర్! మీ కోసమే కాచుకున్నాము" అన్నాడు ముఖ్యమంత్రి.

అది ఆఫీసు గది. హోం మంత్రి, హోం మినిస్టరీ ముఖ్య కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, చీఫ్ కమీషనర్ ఆఫ్ పోలీస్ వున్నారు ఆ గదిలో. రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి. యుగంధర్, రాజు వాటిలో కూర్చున్నారు.

"డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు యిచ్చిన రిపోర్ట్సు అన్నీ చదివాము. ఈ దెయ్యం గురించిన కేసులో మొదట్నించి మీరు కూడా పరిశోధన చేస్తున్నారని యిన్‌స్పెక్టర్ రాశారు. మీ అభిప్రాయం తెలుసుకోవడం చాలా అవసరమని యీ సమావేశానికి మిమ్మల్ని రమ్మన్నాను" అన్నాడు ముఖ్యమంత్రి.

"అవును. ఆ భీకర రూపాన్ని రామానుజం మొట్టమొదట రోడ్‌మీద చూసినప్పటినుంచీ యీ కేసుతో నాకు సంబంధం వుంది."

"మీ అభిప్రాయమేమిటి?" అడిగాడు ముఖ్యమంత్రి. అందరూ యుగంధర్నే చూస్తున్నారు.

"నా అభిప్రాయం చెప్పడానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. ముందు ఒక చిన్న ఎక్స్‌పెరిమెంటు చేస్తాను మీరందరూ అనుమతిస్తే" అన్నాడు యుగంధర్.

"ఏమిటది?" అడిగాడు హోం మంత్రి.

"ఏమిటో ముందుగా చెపితే నా ఎక్స్‌పెరిమెంటు ఫలించదు" చెప్పాడు యుగంధర్.

"ఆల్‌రైట్ కానివ్వండి" అన్నాడు ముఖ్యమంత్రి.

యుగంధర్ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. ఐ.జి.ని, కమీషనర్‌ని చూసి "దయచేసి మీ దగ్గర వున్న రివాల్వర్స్ నా చేతికి యిస్తారా?" అడిగాడు.

"ఎందుకు?"

"నా ఎక్స్‌పెరిమెంటుకి అవసరం. ఇంకెవరి దగ్గరైనా ఆయుధాలు వుంటే దయచేసి అవికూడా నాకు యివ్వండి."

"మమ్మల్ని నిరాయుధుల్ని చేసి మీరు చెయ్యబోయే ఎక్స్‌పెరిమెంటు ఏమిటో నాకు అర్థం కాలేదు" అన్నాడు ఐ.జి.

"ప్లీజ్!" అన్నాడు యుగంధర్.

ఇంకెవరయినా ఐ.జి.ని కమీషనర్‌ని రివాల్వర్స్ ఇవ్వమని అడిగివుంటే అందులో ముఖ్యమంత్రి, హోం మంత్రీ గదిలో వుండగా తక్షణం గదిలోంచి బయటికి పొమ్మనే వాళ్ళు కానీ యుగంధర్ అడగడం వేరు. న్యాయాన్ని ధర్మాన్నీ, నీతిని, నిజాయితీనీ, ఎటువంటి పరిస్థితుల్లోనూ విస్మరించడని అందరికీ తెలుసు.

"కమాన్! ఆయన్ని ఎక్స్‌పెరిమెంటు చెయ్యనివ్వండి" అన్నాడు ముఖ్యమంత్రి.

ఆ యిద్దరు వున్నత పోలీస్ వుద్యోగులూ రివాల్వర్స్ యుగంధర్‌కి యిచ్చేశారు.

యుగంధర్ వాటిని జేబులో పెట్టుకుని, తలుపు దగ్గరకు వెళ్ళి, తలుపు తెరిచాడు. రాజు గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు. యుగంధర్ తలుపుకి లోపల గడియపెట్టి వచ్చి కూర్చున్నాడు.

"మీరు కూర్చున్నారేం! ఎక్స్‌పెరిమెంటు చేస్తామన్నారుగా!" అన్నాడు ఐ.జి.

"కాసేపు పడుతుంది. ఆ విషయం అలా వుండనివ్వండి. అందమైన ఆడవాళ్ళనీ, పిల్లల్ని ఎత్తుకుపోతున్నది దెయ్యమా, కాదా! మనిషే యీ పనులు చేస్తున్నాడా! దెయ్యం అయితే, దెయ్యం ఆ పనులు చెయ్యడానికి కారణం ఏమిటి? మనిషి అయితే కారణం ఏమిటి?" అన్నాడు యుగంధర్.

"మేము వూహించలేకేగా మిమ్మల్ని అడుగుతున్నాము" అన్నాడు హోంమంత్రి.

"దెయ్యమే అనుకుందాం, ఇంతవరకు జరిగిన సంఘటనలలో ఒక పద్ధతి స్పష్టంగా తెలుస్తోంది. అందమైన యువతులు యీ నగరంలో వేలమంది వున్నారు. వాళ్ళనెవరినీ ఎత్తుకుపోలేదు. అలాగే అయిదేళ్ళ పిల్లలు ఎంతమందో వున్నారు. వాళ్ళనీ ఎత్తుకుపోలేదు."

"అంటే?" అడిగాడు ముఖ్యమంత్రి.

రామానుజానికి అతని భార్య ఎలైస్ ప్రాణం, హీరాలాల్‌కి ఒక్కడే కొడుకు. ఆ కొడుకే అతని సర్వస్వం. మేజర్ రమాకాంత్‌కి మాలిని ప్రియురాలు" యుగంధర్ మాట్లాడుతున్నాడు. గదిలో అందరూ యుగంధర్ మాటలు వింటూ అతన్నే చూస్తున్నారు.

తలుపు చప్పుడయింది. యుగంధర్ లేచాడు. మాట్లాడుతూనే "ఈ దెయ్యం ఒక చోటకాదు. ఒక ప్రాంతంలో కాదు. అన్ని ప్రాంతాల్లో కనిపించింది. ఎటొచ్చీ రాత్రి ఒంటిగంటకే -" అంటూ తలుపు గడియ తీస్తున్నాడు. తీస్తుండగా గదిలో దీపాలు ఆరిపోయాయి.

"వాటీజ్ దిస్?" అన్నాడు ముఖ్యమంత్రి.

"దీపాలు ఎలా ఆరిపోయాయి?" అన్నాడు ఐ.జి.

కుర్చీలు జరుపుతున్నారు కొందరు. కొందరు లేచి నిలబడుతున్నారు ఆ చీకటి గదిలో.

యుగంధర్ తలుపు తెరిచాడు. తెరుస్తూ ఒక రెక్క విసురుగా గోడకు కొట్టాడు.

చీకటి గదిలో కూర్చున్న వాళ్ళందరూ తలుపు వేపు చూశారు.

బయట వసారాలో కూడా దీపం లేదు. వెలుగులేదు. చీకటి, ఆ చీకట్లోంచి గదిలోకి వచ్చింది - ఓ రూపం. మనిషి ఎత్తున వుంది. తలలేదు. పుర్రె. ఆ పుర్రె కదిలి వచ్చింది గదిలోకి. ఆ పుర్రెకి కళ్ళున్నాయి.

"గుడ్ గాడ్!" అన్నారెవరో.

"జాగ్రత్త - దెయ్యం" అన్నారింకెవరో.

ఎవరో తలుపు వైపు పరిగెత్తారు.

"యుగంధర్, యుగంధర్!" కేకేశారు కొందరు. నిమిషం పాటు ఆ గదిలో అల్లకల్లోలం - అరుపులు. ఎవరో అగ్గిపుల్ల గీశారు.

ఆ వెలుగులో ఆ రూపం యింకా భీకరంగా కనిపించింది. అగ్గిపుల్ల ఆరిపోయింది.

"పట్టుకోండి. పోనివ్వకండి."

"తలుపు మూసెయ్యండి" అందరూ అరుస్తున్నారు. అంతలో దీపాలు వెలిగాయి. యుగంధర్ తలుపు దగ్గర వున్నాడు.

ముఖ్యమంత్రి కుర్చీలో కాళ్ళు పెట్టుకుని గొంతుక్కూర్చున్నాడు. హోం మంత్రి తనకేమీ కనిపించకుండా మొహానికి వుత్తరీయం కప్పుకున్నాడు. ఆయన సెక్రటరీ కుర్చీ ఎక్కి నిలుచున్నాడు.

దీపాలు వెలగ్గానే ఐ.జి, ఆఫ్ పోలీస్, కమీషనర్ తలుపువైపు పరిగెత్తారు.

తలుపుకి చెయ్యి అడ్డంగా పెట్టి "ఎక్కడికి?" అడిగాడు యుగంధర్.

"యుగంధర్! మీరేదో ఎక్స్‌పెరిమెంటు చేస్తామన్నారు. మా దగ్గర్నించి పిస్తోళ్ళు తీసుకున్నారు. లేకపోతే ఆ దెయ్యాన్ని తూట్లుపడేట్లు -" అన్నాడు కమీషనర్.

యుగంధర్ నవ్వి "అందుకే మీ పిస్తోళ్ళు తీసుకున్నాను. లేకపోతే నా అసిస్టెంటు రాజుని తూట్లు పడేట్లు కాల్చేవాళ్ళు" అంటుండగా రూపం నెమ్మదిగా గదిలోకి వచ్చింది.

పాదాలనుంచి తల వరకూ ఒంటికి అతుక్కుని వున్న నల్లని బట్ట. తల వుండవలసిన చోట తెల్లని పుర్రె. గదిలో దీపాలు వెలుగుతుండగా ఆ రూపం గదిలోకి రావడం వల్ల ఎవరూ కంగారు పడలేదు. సర్కస్‌లో హాస్యగాణ్ణి చూస్తున్నట్లున్నది.

గది మధ్యకి వచ్చి రాజు తలకి వున్న మాస్కు తీసేశాడు. తీసి బల్లమీద పెట్టాడు.

"మిమ్మల్ని ఫూల్ చేద్దామనే ఉద్దేశంతో చెయ్యలేదు, రాజుకి ఈ మాస్కు పెట్టి, గది చీకటి చేసి రాజుని ప్రవేశ పెడితే దెయ్యం వచ్చిందని మీరంతా భ్రమపడతారా పడరా అని తెలుసుకోవాలని చేశాను. మనిషి చేసి వుండవచ్చునని రుజువు చెయ్యడానికి, నాకు నేను రుజువు చేసుకునేందుకు" అన్నాడు యుగంధర్.

"ఆల్‌రైట్. రుజువైందిగా! తరువాత?" అడిగాడు ముఖ్యమంత్రి.

"ఇంతమందినీ ఎత్తుకుపోయింది దెయ్యం కాదనీ, మనిషేననీ అనుకుని మనం కార్యక్రమం ఆలోచిద్దాం. ఎవర్ని ఎందుకు ఎత్తుకుపోతున్నదీ మనకి తెలియదు కనుక యిక ముందు ఎత్తుకుపోకుండా రక్షణ యేర్పాట్లు చెయ్యడం సాధ్యం కాని పని. ఆ మనిషిని మనం ఎంత త్వరగా పట్టుకోగలిగితే ప్రజలకి అంత త్వరగా రక్షణ యివ్వగలం" అన్నాడు యుగంధర్.

"ఎలా పట్టుకోవడమో ఆలోచించారా?" అడిగాడు హోంమంత్రి.

"హీరాలాల్ కుమారుడు శోభన్ని ఎత్తుకుపోయిన కేసులో మనకి ఒక సూచన వుంది. మిగతా కేసుల్లో ఎలాటి సూచనాలేదు."

"హీరాలాల్ కొడుకుని ఎత్తుకుపోయింది మనిషేనని మనం అనుకునే పక్షంలో, వీధి తలుపు లోపల గడియపెట్టే వుండగా పిల్లాణ్ణి ఎలా ఎత్తుకుపోయాడన్న ప్రశ్న వస్తుంది. దానికి ఒక సమాధానం వుంది. హీరాలాల్ యింట్లో ఎవరో ఒకరు ఆ మనిషికి సహాయం చేసి వుండాలి. పిల్లవాణ్ణి ఎత్తుకుపోయిన తరువాత వీధి తలుపు మూసి గడియపెట్టి తాళం వేసి వుండాలి. తాళం చెవులు హీరాలాల్ సెక్రటరీ మోహన్‌దాస్ దగ్గర వున్నాయి. కనుక అతన్ని అనుమానించడానికి తగిన కారణం వుందంటాను."

కమీషనర్ చిన్నగా దగ్గాడు. "ఇన్ స్పెక్టర్ స్వరాజ్యరావు కూడా మోహన్‌దాస్‌ని అనుమానించి అతన్ని ఓ కంట కనిపెడుతూనే వున్నాడు యిన్ని రోజులూ. కానీ ఎటువంటి రుజువూ దొరకలేదు" చెప్పాడు.

"ఈ ఘోరాలన్నీ ఏదో దెయ్యం చేస్తున్నదన్న భ్రమ కలిగించగలిగిన ఘటికులు అంత సులభంగా పట్టుబడతారా? ఏదైనా పన్నాగం పన్ని పట్టుకోవాలి కానీ.." అన్నాడు యుగంధర్.

అంతలో టెలిఫోను మోగింది. ముఖ్యమంత్రి రెండు నిమిషాలు టెలిఫోనులో మాట్లాడి రిసీవరు పెట్టేసి, కుర్చీలోంచి లేచాడు. "థాంక్యు యుగంధర్! ఈ ఘోరాలు చేస్తున్నది దెయ్యం కాదని మీరు రుజువు చేసిన తరువాత నా తలమీది బరువు సగం తగ్గిపోయింది. ఆ దుర్మార్గులని పటుకునేందుకు మీరు, పోలీసు అధికారులు కలిసి పనిచేస్తారనీ, త్వరలో పట్టుకుంటారనీ నాకు పూర్తి నమ్మకం వుంది. ఎంత త్వరగా పట్టుకోగలిగితే అంత మంచిది. రేపే స్టేట్‌మెంట్ యిస్తాను - దెయ్యం కాదనీ, అనవసరంగా భయపడవద్దనీ" అన్నాడు.

"ప్లీజ్. ఇప్పుడు వద్దు. మనమందరమూ దెయ్యమే అనుకుంటున్నామన్న అభిప్రాయంతో వాళ్ళనుండనివ్వండి" చెప్పాడు యుగంధర్.

"ఆల్‌రైట్. మీ యిష్టం, కానీ త్వరగా -"

"నా సర్వశక్తులా ప్రయత్నిస్తాను."

**"ఈ టెలిఫోన్ కాల్ మీకు మిష్టర్ గిరి"** అన్నాడు యుగంధర్. కమీషనర్ ఐ.జి యుగంధర్ కన్సల్టింగ్ రూంలో కూర్చునున్నారు.

"హల్లో! కమీషనర్ హియర్. ఆఁ! ఆఁ దెయ్యం ఎత్తుకుపోయిందా? వస్తున్నాను. వెంటనే వస్తున్నాను" అని రిసీవర్ హుక్కుమీద పెట్టాడు కమీషనర్ వణుకుతున్న చేత్తో, అతని మొహం పాలిపోయింది.

"వాటీజ్ ది మేటర్! మళ్ళీ యింకెవరినైనా ఎత్తుకుపోయారా" అడిగాడు యుగంధర్.

తల వూపాడు కమీషనర్.

"ఎవరిని? ఎక్కడ?" అడిగాడు రాజు.

"నా కొడుకుని రమేష్‌ని - నా యింట్లోంచి" చెప్పాడు కమీషనర్ వొణుకుతున్న గొంతుతో.

యుగంధర్ క్రిజ్లర్ కారులోనే వెళ్ళారు కమీషనర్, ఐ.జి కూడా. వీధిలో రెండు పోలీసు వాన్‌లు ఆగి వున్నాయి. సాయుధ పోలీసులు గేటు దగ్గర కాపలా వున్నారు. ఇంటి వసారాలో పోలీసు ఉద్యోగులు నిలబడి వుండడం కనిపించింది.

"డామిట్! ఇక్కడ ఎందుకు యింతమంది సాయుధ పోలీసులు కాపలా అంతా జరిగిపోయాక" అన్నాడు ఐ.జి.

కారు తిన్నగా లోపలికి డ్రైవ్ చేశాడు రాజు. ఇంకా పూర్తిగా ఆగకముందే కమీషనర్ కారులోంచి దిగి లోపలికి పరిగెత్తాడు. "మీ మిసెస్ పడక గదిలో వున్నారు. డాక్టర్ కూడా అక్కడ వున్నాడు" అని అసిస్టెంటు కమీషనర్ చెపుతున్న మాటలు పూర్తిగా వినిపించుకోకుండా పరిగెత్తాడు కమీషనర్ గిరి.

డాక్టర్ మంచం పక్కన నిలుచుని వున్నాడు. గిరి భార్య కళ్ళు మూసుకుని మంచం మీద పడుకునున్నది.

"మంగళా!" పిలిచాడు గిరి.

"మిష్టర్ గిరి మీ భార్యకి యింజక్షన్ యిచ్చాను నిద్రపోయేందుకు. లేపకండి" చెప్పాడు డాక్టర్.

"నిద్రపోయేందుకు యింజక్షన్ యిచ్చారా! మీకు మతిపోయిందా? ఏం జరిగిందో నాకు చెప్పకుండా మత్తుమందు యిచ్చారా డామ్ యు" అరుస్తున్నాడు కమీషనర్.

"ఆమె హిస్టీరిక్ అయిపోయింది. స్మెల్లింగ్ సాల్ట్సు వాసన చూపిచింనా, యింకేం చేసినా హిస్టీరియా తగ్గలేదు. తప్పనిసరిగా పెథిడిన్ యివ్వవలసి వచ్చింది. ఆమెకి విశ్రాంతి కావాలి. ఇప్పుడు లేపితే మళ్ళీ హిస్టీరిక్ ఫిట్సు రావచ్చు. ఫిట్సు వచ్చి మతి చలించవచ్చు, చాలా పెద్ద షాక్ ఆమెకి. ప్లీజ్" అంటూ కమీషనర్‌ని చెయ్యి పట్టుకుని బయటికి తీసుకు వెళ్ళాడు.

గదిలోంచి బయటికి రాగానే అసిస్టెంట్ కమీషనర్‌ని చూసి "ఏం జరిగిందో మీకేమైనా తెలుసా?" అడిగాడు కమీషనర్.

"ఒంటిగంటా యిరవై నిమిషాలకి కంట్రోల్ రూంకి ఫోన్ చేశారుట మీ భార్య. స్పష్టంగా యేమీ చెప్పలేదుట. ఏడుస్తూ, అరుస్తూ తన కొడుకుని దెయ్యం ఎత్తుకు పోయిందన్నారుట. కంట్రోల్ రూంకి ఎవరు ఫోన్ చేస్తున్నది అని అడిగితే చెప్పలేదుట. నేనే - నేనే - నా కొడుకుని దెయ్యం ఎత్తుకు పోయింది" అంటూ ఏడుస్తూ రిసీవర్‌ని కిందపడేశారట. టెలిఫోన్ డిస్‌కనెక్ట్ చెయ్యకపోవడంవల్ల కాల్ ట్రేస్ చేశారుట. మీ యింటి నుంచి ఆ కాల్ వచ్చిందని తెలియగానే మీకు ఫోన్ చేసి, వెంటనే నేను యిక్కడికి వచ్చాను. ఏం జరిగిందో తెలుసుకుని మీకు తరవాత చెపుదామనుకున్నాను" అన్నాడు అసిస్టెంట్ కమీషనర్.

"ఆల్‌రైట్. తర్వాత?" అడిగాడు కమీషనర్.

"నేను వచ్చినపుడు గేటు దగ్గర సెంట్రీలు లేరు. మీ యింటి వాకిలి తలుపు బార్లా తెరిచి వుంది. గబగబా లోపలికి వెళ్ళాను. ఏడుపు వినిపించింది లోపల్నించి. పరిగెత్తాను. మీ భార్య టెలిఫోన్ దగ్గర కింద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. అరుస్తున్నారు."

"అమ్మా! ఏమిటి జరిగింది? అని అడిగాను. నా ప్రశ్న తనకి అర్థంకానట్లు, నేనెవరో తనకి తెలియనట్లు నన్ను చూశారు. అసలు యీ ప్రపంచంలో వున్నట్లు లేరు. "రమేష్! రమేష్" అంటూ ఏడుస్తున్నారు. వెంటనే డాక్టర్‌కి ఫోన్ చేశాను."

"అయితే యేం జరిగిందీ, పిల్లవాణ్ణి ఎవరు ఎలా యెత్తుకుపోయిందీ మీకు తెలియదన్నమాట"

"ఒకటి మాత్రం తెలుసు. సెంట్రీలు యిద్దరూ గేటు దగ్గర పడుకుని గాఢ నిద్రపోతున్నారు. నిజానికి అది నిద్రకాదు. ఇద్దరికీ స్పృహ లేదు. మత్తుమందు యివ్వడం వల్ల స్పృహపోయింది."

"నా యింటి గేటు దగ్గర వున్న సెంట్రీలకి మత్తు మందు యిచ్చారా! వాట్ షేమ్" అరిచాడు కమీషనర్.

"సెంట్రీలు ఎక్కడున్నారు యిప్పుడు?" అడిగాడు యుగంధర్.

''వసారాలో పడుకోబెట్టాము. అక్కడే వున్నారు'' చెప్పాడు అసిస్టెంట్ కమీషనర్.

యుగంధర్ వసారాలోకి వెళ్ళాడు. స్పృహ లేకుండా పడివున్న ఆ యిద్దర్ని పరీక్ష చేసి ''ఇంకో పావుగంటలో స్పృహ రావచ్చు'' అన్నాడు రాజుతో.

అందరూ హాల్లోకి వెళ్ళారు. కమీషనర్ రెండు చేతులతో మొహాన్ని కప్పుకున్నాడు. పొంగివస్తున్న దుఃఖం అణుచుకోడానికి ప్రయత్నిస్తున్నాడని అందరికీ తెలుసు, పోలీస్ వుద్యోగి తను. అందరి ముందరా చిన్నపిల్లవాడిలా ఏడవకూడదు. గుండెని ఏదో పట్టి నలుపుతున్నట్లు వుంది. తన కొడుకు రమేష్‌ని తలుచుకుంటే చాలు ఒళ్ళంతా వొణికిపోయేటంత దుఃఖం వస్తోంది. ఇక నిగ్రహించుకోలేక పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. ఐ.జి, ఎ.సి యిద్దరూ లేచారు కమీషనర్ కూడా వెళ్ళడానికి.

''ఒద్దు. కాసేపు ఆయన్ని ఒంటరిగా వుండనివ్వండి'' అన్నాడు యుగంధర్. పది నిమిషాల తర్వాత కమీషనర్ గిరి యుగంధర్‌ని పిలిచాడు.

యుగంధర్ ఒక్కడే వెళ్ళాడు.

కమీషనర్ గిరి కళ్ళు తుడుచుకుంటున్నాడు జేబురుమాలుతో. యుగంధర్ అతని భుజం మీద చెయ్యివేసి ''ధైర్యంగా వుండాలి మీరు. మీ భార్యకి ధైర్యం చెప్పవలసినవారు మీరు. మీరే యిలా అయిపోతే ఎలా?'' అన్నాడు.

''యుగంధర్ ఒక విషయం చెప్పండి. నా రమేష్‌ని నేను మళ్ళీ చూస్తానా?'' అడిగాడు గిరి.

''మిస్టర్ గిరి.. నా శక్తి, నా యుక్తి, నా అనుభవమూ అన్నీ వుపయోగిస్తాను. అధైర్యపడకండి.''

''హీరాలాల్ కొడుకు అదృశ్యమై వారం దాటింది. రామానుజం భార్య కనపడకుండా పోయి రెండు వారాలైంది. అదృశ్యమైన వాళ్ళ జాడ ఏమీ తెలియలేదు. రమేష్ మాత్రం -''

యుగంధర్‌కి ఏమని జవాబు చెప్పాలో తోచలేదు. గిరి సబ్‌ఇన్‌స్పెక్టరు వుద్యోగంనుంచి ప్రమోషన్లతో క్రమేపీ పైకి వచ్చిన పోలీస్ ఉద్యోగి. ఎంతో అనుబవం వుండి వుంటుంది. అటువంటివాడికి తనేం ధైర్యం చెప్పగలడు.

'' నాకు ఒక్కడే కొడుకు. వాడు లేకపోతే మా బతుకులు ఎందులు? నేనూ, మా ఆవిడా ఎలా బతకగలం చెప్పండి యుగంధర్.''

యుగంధర్ యేం చెప్పలేక కమీషనర్‌కి సిగరెట్ అందించాడు.

''పట్టుమని పదేళ్ళు లేవు. నన్నూ తల్లినీ వదిలి ఎలా వుండగలడు? ఒక గంటసేపు కూడా వుండలేడే? ఇప్పుడు -'' ఇక దుఃఖం ఆపుకోలేక యుగంధర్ వున్నాడనే విషయం మరిచిపోయి ఏడవడం ప్రారంభించాడు కమీషనర్ గిరి.

హాల్లో మాటలు వినిపించాయి. చాలామంది మాట్లాడుతున్నారు.

యుగంధర్ హాల్లోకి వెళ్ళాడు. కళ్ళు తుడుచుకుని యుగంధర్ వెనకే కమీషనర్ కూడా హాల్లోకి వెళ్ళాడు.

కమీషనర్ కుమారుడు రమేష్ అదృశ్యమైనాడని ఎలా తెలిసిందో - పత్రికలవాళ్ళు వచ్చారు. ఐ.జి.ని ప్రశ్నలడుగుతున్నారు.

''మీ అభిప్రాయం ఏమిటి? దెయ్యం చేసిన పనేనా?'' అడిగాడు ఒక విలేఖరి.

''ఆ ప్రశ్నకి జవాబు చెప్పండి. స్పష్టంగా తేల్చి చెప్పండి'' అడిగారు మిగతా విలేఖర్లు.

ఐ.జి వెంటనే జవాబు చెప్పలేదు. యుగంధర్ పత్రికా విలేఖరుల మధ్యకి వెళ్ళి ''నేనెవరో తెలుసా?'' అడిగాడు.

''డిటెక్టివ్ యుగంధర్ మిమ్మల్నీ అడుగుదామనుకుంటున్నాము'' అన్నారు అందరు విలేఖరులు.

"అడగండి. మీ ప్రశ్నలన్నిటికీ నేను సమాధానాలు చెపుతాను ఐ.జి. ఆఫ్ పోలీస్ తరపునా, పోలీస్ కమీషనర్ తరపునా" అన్నాడు యుగంధర్.

"ముందు యీ ప్రశ్నకి జవాబు చెప్పండి. ఈ అఘాయిత్యాలన్నీ చేస్తున్నది దెయ్యమేనా? దెయ్యమేనని మీరు నమ్ముతున్నారా?"

"అవును. దెయ్యమే. దెయ్యమే అని నా నమ్మకం."

యుగంధర్ యీ మాట చెప్పగానే అయిదు నిమిషాల పాటు నిశ్శబ్దం, ఎవరికీ యే ప్రశ్న అడగడానికీ తోచలేదు.

"దెయ్యమేనని మీకు ఎలా నమ్మకం కలిగింది?"

"మనిషి చేసి వుండడానికి అవకాశం లేదు కనుక" చెప్పాడు యుగంధర్.

## 15

*"దెయ్యమేనని డిటెక్టివ్ యుగంధర్ అభిప్రాయం."*

*"ఆ అఘాయిత్యాలు మనిషి చెయ్యడం సాధ్యం కాదు" అన్నారు యుగంధర్.*

ఈ పతాక శీర్షికతో వెలువడ్డాయి దినపత్రికలు మర్నాడు.

యుగంధర్ కన్సల్టింగ్ రూంలో విరామం లేకుండా టెలిఫోను మ్రోగుతూనే వుంది.

"వాటీస్ దిస్ యుగంధర్. మీరు కూడా అలా అనడం ఏమిటి?"

"మీకూ యిలాటి మూఢ నమ్మకాలున్నాయా?"

"ప్రజలని యిలా బయపెట్టడం న్యాయమా?"

"పెద్దవారయారు, మీరిక యీ వృత్తి మానెయ్యడం మంచిది."

ఇలా టెలిఫోను కాల్స్ వస్తూ వుంటే యుగంధర్, రాజు జవాబు చెప్పడంలేదు. అవసరమైనపుడు యీ డిటెక్టివ్‌లకి సహాయపడే కాత్యా కన్సల్టింగ్ రూంలో కూర్చుని టెలిఫోన్ మోగినప్పుడల్లా రిసీవరు తీసుకుని "యుగంధర్ లేరు. మీరు చెప్పిన విషయం ఆయన రాగానే చెపుతాను" అని జవాబు చెపుతోంది.

పత్రికలన్నీ చదివి, అవతల పెట్టి "ఈ ఘోరాలన్నీ దెయ్యమే చేస్తున్నదని మీరు ఎందుకు స్టేట్‌మెంట్ ఇచ్చారో నేను ఊహించలేకుండా వున్నాను" అన్నాడు రాజు.

"దెయ్యం చేస్తుందని నేను అనుకోవడం లేదు కనుక."

"ఏదో పొడుపు కథలా వుంది మీ జవాబు."

"ఆ ఘోరాలన్నీ దెయ్యం చేస్తున్నదని అందరూ అనుకోవాలని కదా ఆ ఘోరాలు చేస్తున్న వాళ్ళ వుద్దేశ్యం"

తల వూపాడు రాజు.

"వాళ్ళ పాచిక పారిందని వాళ్ళు అనుకునేందుకు."

అయిదు నిమిషాలు రాజు మౌనంగా వుండిపోయాడు.

"దెయ్యం చెయ్యలేదు, ఎవడో ఒకడో లేక కొందరు ఒక ముఠాగా యేర్పడిన వాళ్ళో చేస్తున్నారనుకుందాం. ఎందుకు చేస్తున్నారు? ఈ ఘోరాలు చెయ్యడంలో వాళ్ళ వుద్దేశ్యం ఏమిటి?" అడిగాడు రాజు.

యుగంధర్ గట్టిగా సిగరెట్ పీల్చి "అది తెలిస్తే కేసు సగం తేలినట్టే" అని రెండు నిమిషాలు ఆగి "ఎవడో వీళ్ళందరినీ ఎత్తుకుపోయాడని మనం అనుకున్న పక్షంలో రామానుజం భార్యతోగానీ, కమీషనర్ కొడుకుతోగానీ ఏదో పనుండి ఎత్తుకుపోయారని అనుకోవాలి. ఆరేళ్ళ పిల్లవాడితో వాళ్ళకి ఏం పనుంటుంది? కనుక హేతువాదంతో ఆలోచిస్తే ఎలైస్‌ని ఎత్తుకుపోయి రామానుజాన్ని, శోభన్ని ఎత్తుకుపోయి హీరాలాల్‌నీ, రమేష్‌ని ఎత్తుకుపోయి కమీషనర్ గిరిని తమ చేతుల్లో పెట్టుకోవాలని వాళ్ళ వుద్దేశ్యం అని అనుకోవాలి."

"అయితే యీపాటికి ఎవరో ఒకరు ఆ విషయం బయటపెట్టేవారుగా?" అడిగాడు రాజు.

"సామాన్య పరిస్థితుల్లో అయితే ఎవళ్ళో ఒకరు ఆ విషయం మనకో, పోలీసులకో చెప్పేవాళ్ళు, అలా చెప్పకుండా దెయ్యంలా కనబడుతూ భయపెడుతున్నారు."

"అంటే?" అడిగాడు రాజు.

"దెయ్యం ఎత్తుకుపోయింది. దెయ్యం తినేసిందేమో అనే భయం కలిగించారు. తన భార్యని మళ్ళీ చూస్తాననే నమ్మకం పూర్తిగా పోయింది రామానుజానికి. అలాగే హీరాలాల్ తన కొడుకుని యీ జన్మలో మళ్ళీ చూస్తాననే ఆశ పూర్తిగా నశించింది. నిస్పృహ, నిరాశ, దుఃఖం వాళ్ళలో పూర్తిగా నిండిపోయాయి. దెయ్యం కనుక పోలీసులు ఏమీ చెయ్యలేరన్న అధైర్యం ఏర్పడింది వాళ్ళలో. అటువంటి పరిస్థితిలో 'నీ భార్యని నువ్వు ప్రాణాలతో చూడాలని వుందా? మళ్ళీ నీ భార్య నీకు కావాలా? కావాలని వుంటే మేము చెప్పినట్లు చెయ్యి, ఈ విషయం అధికారులకి చెప్పావా మరుక్షణం నీ భార్య ప్రాణాలు ఎగిరిపోతాయి అని రామానుజానికి టెలిఫోన్ చేసో, వుత్తరం రాసో తెలియజేసి వుంటే అతనేం చేస్తాడు? మన దగ్గరికి వస్తాడా? అంత నిస్పృహలోంచి ఆశ అనేది కలిగినపుడు. అతనిలో మళ్ళీ ఆశ చిగురించినపుడు మంచీ చెడూ, న్యాయము, అన్యాయము ఆలోచించే స్థితిలో వుండడు. వాళ్ళు చెప్పిందల్లా ఒప్పుకుంటాడు. తన భార్య తిరిగి తనకి దక్కుతుందన్న ఆశతో. మిగతావాళ్ళూ అంతే."

"అయితే వాళ్ళందరినీ మనం ఓ కంట -" అంటున్నాడు రాజు.

యుగంధర్ రాజు మాటలకి అడ్డం వచ్చి "ప్రయోజనం లేదు. ఏమీ వుపకరించదు. శత్రువులు అంత అమాయకులు కారు. ఆ విధంగా మనం వాళ్ళ ఆచూకీ తెలుసుకోలేని కట్టుదిట్టాలు చేసుకుని వుంటారు. హీరాలాల్ సెక్రటరీ మోహన్‌దాస్ వాళ్ళ ముఠాలో మనిషి అయుండాలి. ఈ వారం రోజులూ పోలీసు సి.ఐ.డిలు అతన్ని ఓ కంట కనిపెడుతూనే వున్నారు. ఏమైనా తెలిసిందా?" అన్నాడు.

"అయితే వాళ్ళ ఆచూకీ తెలుసుకోవడం ఎలా?" అడిగాడు రాజు.

"ఎంత పటిష్టమైన పథకం వాళ్ళు వేసుకున్నా యేదో లోపం వుంటుంది. తాము చేస్తున్న ఘోరాలు నిర్విఘ్నంగా సాగినకొద్దీ ధైర్యమూ, ధిలాసా ఎక్కువ అవుతాయి. పోలీస్ కమీషనర్ గిరి కొడుకుని ఎత్తుకుపోవడం శత్రువులు చేసిన మొదటి పొరబాటనుకుంటాను."

"ఎలా?" అడిగాడు రాజు.

"నీ కొడుకు ప్రాణాలు మా చేతిలో వున్నాయి. నువ్వు మేము చెప్పింది చెయ్యాలి అని పోలీస్ కమీషనర్‌ని బెదిరించడం అంత సులభం కాదు. గిరి అంత సులభంగా బెదిరిపోయే మనిషికాడు."

"ఆయనకి తన కొడుకు మీద ప్రేమ తక్కువా? కొడుకుని బలి యిస్తాడా?" అన్నాడు రాజు.

"వృత్తిగతంగా తన ధర్మానికీ, తన కొడుకు మీద వున్న ప్రేమకీ మధ్య అతనిలో కొంత సంఘర్షణ జరుగుతుంది. అది మనం అవకాశంగా తీసుకోవాలి."

"ఎలా?" అడిగాడు రాజు.

"చెపుతాను" అన్నాడు యుగంధర్.

## 16

సరిగ్గా నాలుగు రోజులయింది ఆవేళకి తన కొడుకు అదృశ్యమై. ఆ నాలుగురోజులూ పోలీస్ కమీషనర్ గిరి శెలవులో వున్నాడు. ఇంకా ఎంత కాలం శెలవు మీద వుండాలో అతనికే తెలియదు. ఇంట్లో కూర్చుంటే మరీ దిగులుగా వుంది. ఇంట్లో ఎక్కడ చూసినా పిల్లవాడి ఆట వస్తువులు, బట్టలు, ఫోటోలు. ఎటు తిరిగినా వాడే జ్ఞాపకం వస్తున్నాడు. ఏం చెయ్యడానికీ తోచలేదు. ఏమీ చెయ్యకుండా వున్నాడు. గెడ్డం కూడా గీసుకోవాలని లేదు. అన్నం తినాలనిపించదు. అతని భార్య పడక గదిలోంచి బయటికి రావడం లేదు. ఆ నాలుగురోజులూ స్నానం చెయ్యలేదు. తల దువ్వుకోలేదు. ఏమీ తినదు. తాగదు. ఆమె చెల్లెలు వచ్చి అక్కకి తోడుగా వుంటోంది. బలవంతానా ఏదో అక్క నోట్లో పోస్తోంది. భార్య కుళ్ళి కుళ్ళి ఏడ్వడం గిరికి యింట్లో ఎక్కడున్నా వినిపిస్తూనే వుంది.

తన కొడుకు చచ్చిపోయాడు. ఏదో జబ్బు చేసి చచ్చిపోయాడు అని గుండె నిబ్బరం చేసుకుని బతుకు సాగించాలని తీర్మానించుకుంటాడు గిరి. మరుక్షణం చచ్చిపోలేదేమో, ఎక్కడో బతికే వున్నాడేమో, 'నాన్నా' అని ఏడుస్తున్నాడేమో అనిపిస్తుంది. ఆ సందేహం కలగగానే గుండె నలిగి, పిప్పయిపోతుంది.

ఇది దెయ్యం పనికాదు, ఎవరో చేశారు అంటాడు యుగంధర్. యుగంధర్ మాటల్లో గిరికి నమ్మకం పోయింది. ఎంత మేధావి అయితేనేం? యుగంధర్ పొరపాటు పడి వుండవచ్చు. యుగంధర్‌కి అపజయం కలగకూడదా! యుగంధర్ తన కొడుకుని తెచ్చి తనకి యిస్తాడని ఆశ పెట్టుకోవడం పొరపాటు.

ఒక కుర్చీలోంచి లేచి యింకో కుర్చీలో కూర్చుంటాడు. ఒక పత్రిక గిరాటేసి యింకో పత్రిక తీస్తాడు. అతని క్షోభ ఎవరికీ అర్థంకాదు. అటువంటి బాధ అనుభవించిన వారికి తప్ప. సెంట్రీ వుత్తరాలు తెచ్చి యిచ్చాడు. పరధ్యానంగా కవర్లు చూశాడు. ఏవో ఆహ్వానాలు, ఏవో శుభలేఖలు. ఎందుకివి తనకి ఏ ఒక కవరూ చింపకుండా అన్నీ బల్లమీద పడేశాడు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. భోజనానికి రమ్మని మరదలు పిలిచిది. "నాకు ఆకలి లేదు" అన్నాడు గిరి.

"ఆకలి లేకపోయినా తినాలి" అన్నదామె.

అంతలో టెలిఫోన్ మోగింది.

రిసీవర్ తీసుకుని "యస్. గిరి హియర్" అన్నాడు.

"మిష్టర్ గిరి. నీకు వచ్చిన వుత్తరాలలో ముఖ్యమైన వుత్తరం ఒకటి వుంది. మీ కొడుకు గురించి, చూడండి" అని అవతల మనిషి టెలిఫోన్ డిస్కనెక్టు చేశాడు. ఆ మాట్లాడిన మనిషి మొగాడో, ఆడదో గిరికి తెలియలేదు. తన పక్కనే బల్లమీద వున్న వుత్తరాలు తీశాడు. నాలుగు కవర్లు చింపాడు. ఏవో యిన్విటేషన్స్. అయిదో కవరు చింపుతుండగా దాంట్లోంచి ఓ ఫోటో బయట పడ్డది.

గిరి గుండె ఒక్కసారి వురుకులు వేసింది., అది తన కొడుకు ఫోటో. తన కొడుకు అదృశ్యమైన తరువాత తీసిన ఫోటో అయి వుండాలి. పిల్లవాడు అదృశ్యమైన రోజు సాయంకాలం తను కొన్నాడు ఆ రెడీమేడ్ డ్రస్. చారల షర్టు, నల్లని కాలర్, జేబు మీద గుర్రం బొమ్మ. హాయిగా నవ్వుతున్నాడు ఆ ఫోటోలో. కవరులో వుత్తరం లేదు. ఇంకేమీలేదు ఫోటో తప్ప. వెనక్కి తిప్పి చూశాడు.

"మీ అబ్బాయి బతికే వున్నాడు. హాయిగా వున్నాడు. అధైర్యపడకండి" అని విడి విడి అక్షరాలతో రాసి వుంది. ఒక్క గంతులో తన భార్య దగ్గరికి వెళ్ళి చెప్పాలనిపించింది 'మన బాబు బతికి వున్నాడని' కానీ అన్వేళ్ళ పోలీసు శిక్షణ వృధాకాలేదు.

తమాయించుకున్నాడు. ఆ ఫోటో జేబులో పెట్టుకుని నిట్టూర్చాడు. ఇప్పుడతనిలో నిస్పృహ పోయింది. కళ్ళలో ఆశ కనబడుతోంది. ఎవడో బ్లాక్ మెయిలర్ తన కొడుకుని ఎత్తుకుపోయాడు. డబ్బో, యింకేదో అడుగుతాడు అతను అడిగింది యిస్తే తన కొడుకు తనకి దక్కుతాడు.

పోలీస్ కమీషనర్ అయిన తననే బ్లాక్ మెయిల్ చేయడానికి పూనుకున్నాడంటే వాడెవడో బాగా తెగించిన మనిషి అయి వుండాలి. తను తప్పటడుగులు వేస్తే తన కొడుకుని తనే బలి యిచ్చుకుంటాడు.

తన కొడుకుని రక్షించాలి. తనే రక్షించాలి. ఎవరికీ చెప్పకూడదు. చెప్పాడా తన కొడుకు ప్రాణానికి మోసం కలుగుతుంది.

మళ్ళీ టెలిఫోన్ మోగింది. రిసీవర్ తీసుకుని "గిరి హియర్" అన్నాడు.

"ఫోటో చూశారా?"

"చూశాను."

"మీ అబ్బాయిని ఒకసారి చూస్తారా? "

"అంటే" అడిగాడు గిరి.

"మీ అబ్బాయిని మీరు ఒకసారి చూడదలచుకుంటే ఏర్పాటు చేస్తాను."

"చూడాలని వుంది."

"అయితే సాయంకాలం ఆరుగంటలకి మీరు ఒక్కరే మీ కారులో మౌంట్‌రోడ్‌కి వచ్చి పి.ఎం.జి ఆఫీసు ఆవరణలో ఆపి, పోస్టాఫీసులో వున్న ట్రంక్‌కాల్ బూత్‌లోకి వెళ్ళండి."

క్లిక్ మన్నది టెలిఫోన్.

పోలీస్ కమీషనర్ గిరి అరగంట కాచుకున్నాడు మౌంట్‌రోడ్ పోస్టాఫీస్ ట్రంకాల్ బూత్‌లో. ఎవరూ రాలేదు. ఎవరూ వచ్చి యేమీ చెప్పలేదు. తనేమైనా పొరబాటు చేశాడా! ఎందుకు రాలేదు? ఆలోచిస్తూ కారు దగ్గరకి వెళ్ళి తలుపు తెరిచాడు. ముందు సీటు మీద ఒక కవరు పడున్నది. ఆత్రుతతో కవరు చింపాడు.

"ఇప్పుడు ఆరున్నరయింది. ఇందిరా టాకీస్‌కి కారులో వెళ్ళి, వెనకవైపు వున్న కార్ పార్కింగ్ స్పేసులోకి వెళ్ళండి. అక్కడవున్న నల్లరంగు ఎంబాసిడర్ ఎం.ఎస్.ఎక్స్ 19999 నెంబరు కారు పక్కన మీ కారు ఆపండి. మీ కారు దిగి ఆ అంబాసిడర్ కారు ఎక్కండి. కారు తాళం చెవులు కారులోనే వుంటాయి. కారు స్టార్టు చేసి, ఆ కారులో గ్రాండ్ ట్రంక్ రోడ్ మీదకు రండి. కారులో పెట్రోల్ చాలా వుంది. ఎంత దూరం అని ఆలోచించకండి. ఇరవై అయిదు మైళ్ళ స్పీడున వెళ్ళండి. దోవలో ఎక్కడో మీకు ఒకరు తటస్థపడతారు. అతను మిమ్మల్ని మీ అబ్బాయి దగ్గరకు తీసుకువెళతాడు. మిమ్మల్ని, మమ్మల్ని వెంటాడేందుకు ఏర్పాటు చెయ్యరని నమ్ముతున్నాను. అటువంటి ఏర్పాటేదైనా చేస్తే మాకు తెలుస్తుంది. అటువంటి ఏర్పాటేదైనా చేస్తే మీ అబ్బాయి, పాపం. ఈ వుత్తరం చిన్న చిన్న ముక్కలుగా చింపి పారెయ్యండి. మేము చెప్పినట్లు చేస్తారో చెయ్యరో యిక్కడే వుండి మేము చూస్తూ వుంటాము."

నా కారు దగ్గిరికి ఎవరు వచ్చారు? ఆ మనిషి ఎలా వెళ్ళాడు? ఎటు వెళ్ళాడు? విజిల్ వూదితే పోలీసులు పరిగెత్తుకు వస్తారు. పోస్టాఫీస్ ఆవరణలోంచి ఎవరినీ బయటికి వెళ్ళనివ్వరు. ఆ మనిషి దొరికిపోతాడు. ఏం చేస్తే బావుంటుందని ఆలోచించాడు గిరి.

ఆ వుత్తరం తెచ్చి కారులో పడేసినవాడు ఎవడో అనామకుడై వుండవచ్చు. వాణ్ణి పట్టుకుంటే తన కొడుకు విషయం కాని, ఆ దుర్మార్గుల విషయం కానీ ఏమీ తెలియకపోవచ్చు. నో... రిస్కు తీసుకోకూడదు. తనకొడుకు ప్రాణాలతో చెలగాటం ఆడకూడదు.

ఆ వుత్తరంలో చెప్పినట్లు తు.చ తప్పకుండా చేశాడు పోలీస్ కమీషనర్ గిరి.

**విశాలమైన ట్రంక్** రోడ్ మీద యిరవై నాలుగుమైళ్ళు ప్రయాణం చేశాడు కమీషనర్ గిరి. చీకటి పడింది. ఇంకా ఎంతదూరం వెళ్ళాలి? కార్లు, లారీలు, బస్సులు రోడ్‌మీద యిటూ అటూ వెళుతూనే వున్నాయి. రియర్‌వ్యూ మిర్రర్‌లో చూస్తూనే వున్నాడు తన వెనక ఎవరైనా వస్తున్నారా అని. ఎవరూ రావడం లేదు.

ఉత్తరంలో రాసినట్లు యిరవై అయిదు మైళ్ళు స్పీడులో వెళుతున్నాడు.

ఎదురుగా, రోడ్ పక్కన ఒక కారు ఆగి వుంది. ఆ కారు పక్కన యిద్దరు, ఒక ఆడదీ, ఒక మొగాడూ నిలుచునున్నారు. ఆ స్త్రీ చెయ్యి చూపించింది ఆగమని. వాళ్ళ కారు వెనకే ఆగాడు గిరి. తన కారు హెడ్‌లైట్స్ కాంతిలో వాళ్ళ మొహాలు కనిపించకుండా ముందున్న కారు బానెట్ వెనక నిలుచున్నారు వాళ్ళు. గిరి కారు దిగుతున్నాడు.

"లైట్లు ఆర్పేయండి" కేక వేసింది ఆమె.

గిరి కారు దీపాలు ఆర్పేశాడు. బాగా చీకటిగా వుంది. ఎదురుగా వున్న కారు దగ్గరికి వెళ్ళాడు.

"కారు ఎక్కి కూర్చోండి" అన్నదామె.

గిరి కారు ఎక్కాడు.

ఆమె గిరి పక్కన కూర్చున్నది. ఆ మొగతను డ్రైవర్ సీటులో కూర్చున్నాడు. అప్పుడు కూడా వాళ్ళ మొహాలు గిరికి కనిపించలేదు.

"దయచేసి చెయ్యి జాపండి" అన్నదామె.

"ఎందుకు?"

"ఇంజక్షన్ ఇవ్వాలి."

"ఇంజక్షనా! డామ్ యు ఎంత ధైర్యం?" అన్నాడు గిరి.

"క్షమించండి. మీకు మార్ఫియా యింజక్షన్ యివ్వమని నాకు ఆదేశం వచ్చింది. మీరు యింజక్షన్ తీసుకోని పక్షంలో మిమ్మల్ని తీసుకు వెళ్ళడానికి వీలులేదు."

"నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా! ఈ క్షణాన మీ యిద్దరినీ అరెస్టు చేసి -"

"తెలుసు. మమ్మల్ని అరెస్టు చెయ్యవచ్చు. కానీ మీ అబ్బాయి విషయం ఆలోచించారా?" అడిగిందామె

గిరి కోపం దిగమింగాడు. ఇంతవరకూ వచ్చాక యిప్పుడు యెదురు తిరగడం దేనికి అనుకుని చెయ్యి జాపాడు.

ఇంజక్షన్ యిచ్చింది. కారు వెళుతోంది. కమీషనర్ గిరికి నిద్ర వస్తోంది. వెనక్కి ఆనుకున్నాడు.

అతనికి మెలుకువ వచ్చేరికి అంతా చీకటిగా వుంది. కారులో లేడు. మంచం మీద పడుకునున్నాడు. బద్ధకంగా లేచి కూర్చున్నాడు. కన్ను పొడుచుకున్నా యేమీ కనిపించని చీకటి.

"హల్లో, హల్లో" అరిచాడు.

"లేచారా! వెరీగుడ్ మీ పక్కనున్న బల్లమీద ఓ ఫ్లాస్కు, ఓ గ్లాసు వున్నాయి. ఫ్లాస్కులో వేడి కాఫీ వుంది. తాగండి."

"నేను కాఫీ తాగడానికి రాలేదు యిక్కడికి."

"మిష్టర్ గిరి ప్లీజ్. కొంచెం కాఫీ తాగండి. కాఫీ తాగిన తరవాత మీ కళ్ళకి గంతలు కడతాను, తరవాత మిమ్మల్ని నడిపించుకు తీసుకు వెళతాను మీ అబ్బాయి వున్న గది ముందుకి. అక్కడ గంతలు తీసేస్తాను. మీరు గదిలోకి వెళ్ళి మీ అబ్బాయిని చూడవచ్చు.

మీరూ, మీ భార్యా వూరికి వెళ్ళారనీ, మీరు తిరిగి వచ్చేటంతవరకూ తనని స్నేహితుల దగ్గర వొదిలారనీ అనుకుంటున్నాడు మీ అబ్బాయి. మీరు కూడా అలాగే మాట్లాడండి."

కమీషనర్ గిరి కాఫీ తాగాడు. గ్లాసు బల్లమీద పెట్టాడో లేదో వెనక నించి రెండు చేతులు అతని మొహం మీదికి వచ్చాయి. "స్టెడీ మిస్టర్ కళ్ళకి గంతలు కడుతున్నాను" అన్నాడు వెనక నించి. అతను గంతలు బిగించాడు, గిరికి సిగిరెట్ యిచ్చి "సిగిరెట్ తాగండి. నర్వస్ స్టెడీ అవుతాయి" అన్నాడు.

చెయ్యి పట్టుకుని నడిపించాడు కుడివైపు. ఎడం వైపు మళ్ళీ ఎడం వైపు, కుడివైపు వెళ్ళి వెనక్కి రెండు మెట్లు దిగారు. మళ్ళీ రెండు మెట్లు ఎక్కరు. జ్ఞాపకం పెట్టుకోడానికి చాలా ప్రయత్నించాడు గిరి. ప్రయోజనం లేకపోయింది.

"సర్ వచ్చేశాము. ఇప్పుడు మీ కళ్ళ గంతలు తీసేస్తాను. వెనక్కి తిరగకండి. తలుపు తట్టగానే తలుపు తీస్తారు. లోపలికి వెళ్ళి అరగంట వుండండి. అరగంట తరవాత నేను వచ్చి తలుపు తడతాను. బయటికి రండి" అంటూ కళ్ళగంతలు తీసేసి తలుపు తట్టాడు ఆ మనిషి.

"రండి కమీషనర్" అన్నది ఓ స్త్రీ కంఠం.

క్షణంలో తలుపు తెరుచుకుంది. గిరి గదిలోపల అడుగు పెట్టాడు.

"నాన్నా! నాన్నా! ఎప్పుడు వచ్చావు?" అంటూ రమేష్ ఒక్క వురుకున వచ్చి తండ్రి మెడని చుట్టేశాడు. "అమ్మ యేదీ? రాలేదేం" అడిగాడు.

"ఇంకా వూరినుంచి రాలేదు. నేను మళ్ళీ వూరికి వెళ్ళాలి. ఇంకో వారం పది రోజుల్లో యిద్దరం వచ్చి నిన్ను తీసుకు వెళతాం" అంటూ గదంతా పరీక్షగా చూశాడు గిరి.

ఒక చిన్న మంచం, ఒక పెద్ద మంచం, వాటిమీద పరుపులు, పరుపుల మీద తెల్లటి దుప్పట్లు, కింద తివాసీ, ఆ తివాసీ మీద ఆట వస్తువులు. బొమ్మలు పుస్తకాలు, ఓ పక్కన రేడియో, పైన సీలింగ్ ఫాన్. రమేష్ చిక్కిపోయినట్లుగాని, బెంగపెట్టుకున్నట్లుగాని కనిపించలేదు.

"ఎలా వున్నావు?" అడిగాడు కొడుకుని.

"బావుంది నాన్నా యిక్కడ. ఈ ఆంటీ ఎప్పుడూ నా దగ్గరే వుంటుంది. నాకు నిద్రపట్టేంత వరకూ కథలు చెపుతుంది. నాతో బలే ఆటలు ఆడుతుంది. శోభన్ అనే ఇంకో అబ్బాయి వున్నాడు. వాడూ, నేనూ రోజూ టేబుల్ టెన్నిస్ ఆడతాము నాన్నా!"

"నీ పేరేమిటమ్మా?" అడిగాడు గిరి ఆమెని.

"పేరెందుకు రమేష్ ఆంటీని" అన్నది నవ్వుతూ.

ఇరవై ఏళ్ళుంటాయి. మంచి రంగు, చక్కని మొహం, తెలివైన కళ్ళు.

"వాణ్ణి మేము తీసుకు వెళ్ళేంతవరకు జాగ్రత్తగా చూడమ్మా."

"ఆ విషయంలో మీరు దిగులుపడకండి. రమేష్ కులాసాగా వుంటాడు" అన్నదామె.

అరగంట యిట్టే గడిచిపోయింది. తలుపు చప్పుడయింది.

"వస్తాను రమేష్. మళ్ళీ యివాళ వూరికి వెళ్ళాలి. ఇంకో వారం రోజుల్లో నేనూ, అమ్మా వస్తాము" అన్నాడు గిరి.

"నేను నీతో స్టేషన్‌కి రానా?" అడిగాడు రమేష్.

"నేను కారులో వెళుతున్నాను. నువ్వు ఆంటీ దగ్గర వుండు. కథలు చెపుతుంది" అని చటుక్కున కొడుకుని ఎత్తుకుని, ముద్దు పెట్టుకుని, దింపి తెలుపు తెరుచుకుని బయటికి వెళ్ళిపోయాడు గిరి.

ఎవరో గది తలుపు మూసేశారు. బయట నడవాలో అంతా చీకటిగా వుంది.

"మళ్ళీ గంతలు కట్టాలి" అన్నాడు ఎవడో వెనకనించి.

గంతలు కట్టి కొంచెం దూరం నడిపించాడు "కూర్చోండి" అన్నాడతను.

గిరి కూర్చున్నాడు. కళ్ళకి కట్టిన గంతలు తీసేశాడు. అతనికి యెదురుగా విశాలమైన బల్ల. బల్ల వెన్క యెవరో కూర్చుని వున్నారు. అతని మొహం కనిపించడంలేదు. బల్లమీద వున్న టేబుల్ లైటు వెలుగు గిరి మొహం మీద పడుతోంది.

"మీ అబ్బాయికి ఎటువంటి హానీ జరగలేదనీ, కులాసాగా వున్నాడనీ తెలుసుకున్నారు గదా" అన్నాడు అతను స్వచ్ఛమైన యింగ్లీషులో.

"థాంక్ యు" అన్నాడు గిరి.

"మీ అబ్బాయి మళ్ళీ మీ దగ్గరికి వచ్చేంతవరకూ యింత జాగ్రత్తగానూ, యింత ఆపేక్షతోనూ చూసుకుంటామని హామీ యిస్తున్నాను."

"వెరీగుడ్, అసలు విషయం చెప్పండి, ఎంత కావాలి?" అడిగాడు కమీషనర్ గిరి.

ఆ మనిషి నవ్వాడు. "డబ్బు కాదు మిష్టర్ గిరీ! పొరబడుతున్నారు. డబ్బు కోసం అయితే కొన్ని వందల జీతగాడి పిల్లవాణ్ణి ఎత్తుకు రావడం దేనికి కోటీశ్వరుడు హీరాలాల్ పిల్లవాడు వున్నాడుగా! నొ నొ. మాకు డబ్బు అవసరం లేదు."

"అయితే ఏం కావాలో చెప్పండి" అడిగాడు గిరి.

"చెపుతాను జాగ్రత్తగా వినండి. మాతో సహకరిస్తారనీ, మీ కొడుకు త్వరలో మీ దగ్గరికి వస్తాడనీ ఆశిస్తున్నాను" అని చెప్పడం ప్రారంభించాడు అతను.

## 17

పొద్దున్న పదిగంటలయింది. క్రితం రాత్రి తను రమేష్‌ని చూసి వచ్చినట్లు భార్యకి చెప్పలేదు గిరి. చెపుదమా వద్దా అని యింకా ఆలోచిస్తున్నాడు. చెపితే ఆమె మొహంలో, ఆమె ప్రవర్తనలో కలిగే మార్పుని బట్టి అందరికీ తెలిసిపోతుంది. చెప్పకపోతే దిగులుతో యింకా కృశించిపోతుంది. ఏం చెయ్యాలి? ఆలోచిస్తున్నాడు.

అంతలో జవాను వచ్చి ఓ విజిటింగ్ కార్డు యిచ్చాడు. 'కమీషనర్ గిరికి. వై.ఆర్.రామయ్య' అని వుంది ఆ కార్డు మీద.

"ఎవరు? ఎందుకు?" అడిగాడు జవాన్ని విసుగ్గా.

"చెప్పలేదు సార్. మీకు యివ్వమన్నారు. మీతో అనవసరంగా మాట్లాడాలిట" చెప్పాడు జవాన్.

"సరే పిలుచుకురా" అని వసారావైపు చూశాడు గిరి.

నిమిషం తర్వాత ఒకాయన్ని వెంటబెట్టుకుని వచ్చాడు జవాన్.

మంచి పొడుగు, వయస్సు మీరడం వల్ల ఒంగి నడుస్తున్నాడు. తెల్లని జుట్టు, చెవులమీద కూడా తెల్లని వెంట్రుకలు. కళ్ళకి అద్దాలు, చేతిలో కర్ర, సంచీ. లాల్చీ తొడుక్కుని, పైన వుత్తరీయం వేసుకున్నాడు. "గుడ్ మార్నింగ్ సర్!" అన్నాడు గిరిని చూసి.

"కూర్చోండి" అని నిమిషం ఆగి 'యస్' అన్నాడు గిరి.

''మీతో విడిగా మాట్లాడాలి'' అన్నాడాయన.

''ఇక్కడ మీరూ, నేను తప్ప యింకెవరూ లేరుగా! చెప్పండి.''

''క్షమించండి. ఇంతకన్నా ప్రయివసీ కావాలి, మీ ఆఫీసు గదిలోకి వెళదాం'' అన్నాడాయన.

కమీషనర్ గిరి చాలా విసుగ్గా చూశాడు. ''విషయమేమిటో సూచనగానైనా చెప్పండి'' అన్నాడు.

''థవుజండ్ అపాలజీస్, శ్రమ అనుకోకండి. మీ ఆఫీసుగదిలోకి'' అంటూ లేచాడు ఆ వృద్ధుడు.

వయస్సులో అంత పెద్దవాడైన మనిషిని కసురుకోవడంగాని వెళ్ళిపొమ్మనడం గాని యిష్టం లేక కమీషనర్ గిరి లేచి ''ఆల్‌రైట్'' అని పక్కనే వున్న ఆఫీసు గదిలోకి దారి తీడాడు. గిరి వెనకే వెళ్ళాడు ఆ వృద్ధుడు.

తలుపు మూసి ''చెప్పండి'' అన్నాడు గిరి.

''ఇలా మారువేషంలో మీ దగ్గరికి వచ్చినందుకు క్షమించాలి'' అన్నాడు యుగంధర్ తన అసలు కంఠస్వరంతో. అంతసేపు గొంతు మార్చి మాట్లాడాడు.

''డిటెక్టివ్ యుగంధరా! వాటీస్ దిస్. నన్ను కలుసుకోవడానికి మారువేషమూ, యింత రహస్యమూ అవసరమయ్యాయా'' అన్నాడు గిరి ఆశ్చర్యంతో.

''అవును. అవసరమైంది.''

''ఎందుకు?'' అడిగాడు గిరి.

''ఏం జరిగింది? ఏం కావాలన్నారు'' అడిగాడు యుగంధర్.

గిరి మొహం చిట్లించాడు. ''అంతా అయోమయంగా వుంది నాకు. మీరు యిలా మారువేషంలో రావడం ఏమిటి? ఏం జరిగింది? ఏం కావాలన్నారు అని అడగడం ఏమిటి? నాకేమీ అర్థం కావడం లేదు'' అన్నాడు.

''మిస్టర్ గిరి. నాకు తెలిసిన విషయాలు చెపుతాను వినండి. నిన్న సాయంకాలం మీరు ఒంటరిగా యింటినించి బయలుదేరారు. మౌంట్ రోడ్ పోస్టాఫీసులో వున్న ట్రంక్ కాల్ టెలిఫోను బూత్‌లో అరగంట నిలుచున్నారు. మీరు అక్కడ వుండగా ఒక కుర్రవాడు బహుశా న్యూస్ పేపర్లు అమ్మే కుర్రాడు మీ కారు డ్రయివింగ్ సీటులో ఒక కవరు పడేశాడు. మీరు ఆ కవరు తీసుకుని చదివి అక్కణ్ణించి ఇందిరా థియేటర్లోకి వెళ్ళి, కారు పార్కింగ్ స్పేస్‌లో ఆపి, పక్కన వున్న అంబాసిడర్ కారు ఎక్కి, మీరే డ్రయివ్ చేసుకుంటూ గ్రాండ్ ట్రంక్ రోడ్ మీదికి వెళ్ళారు. సాయంకాలం ఆట అయిపోయిన తరవాత యెవరో యూనిఫాంలో వున్న డ్రయివర్ మీ కారు యెక్కి న్యూ పాలెస్ థియేటర్‌కి వెళ్ళి ఆపాడు. రాత్రి ఒంటి గంటకి పది నిమిషాల ముందు అంటే సినిమా పూర్తి అయ్యేలోగా మీరు వెళ్ళిన అంబాసిడర్‌లో మీరు న్యూపాలెస్ థియేటర్‌కి వచ్చి, ఆ అంబాసిడర్ కారు అక్కడ వదిలి, మీ కారు ఎక్కి మీ యింటికి వెళ్ళిపోయారు. ఆ అంబాసిడర్ కారుని యూనిఫాంలో వున్న డ్రయివరు టి.నగర్ ఆటోమొబైల్ వర్కుషాపుకి తీసుకు వెళ్ళిపోయాడు'' అని యుగంధర్ అయిదు నిమిషాలు మౌనంగా వుండి, ''మీరు నాకు టెలిఫోన్ చేసి రాత్రి ఏం జరిగినదీ బ్లాక్‌మెయిలర్స్ మిమ్మల్ని ఏం అడిగినదీ చెపుతారని అనుకున్నాను. తొమ్మిది గంటలయినా మీరు ఫోన్ చెయ్యకపోయేసరికి మారువేషం వేసుకుని వచ్చాను. నిన్న రాత్రి ట్రంక్ రోడ్ మీద మీ కారుని వెంబడించి మీరు ఎక్కడికి వెళుతున్నదీ కనుక్కోవడానికి కారణమూ, యిప్పుడు మారువేషంలో రావడానికి కారణమూ చెపుతాను. రాత్రి నేను మిమ్మల్ని వెంబడించి వుంటే ఆ బ్లాక్ మెయిలర్సని మీరు కలుసుకునే అవకాశం వుండేది కాదేమో! ఇప్పుడు నేను మారువేషంలో కాక మామూలుగా మీ యింటికి వచ్చి వుంటే మీరు నాతో నిజం చెప్పేశారని ఆ బ్లాక్ మెయిలర్స్ అనుకుని మీ అబ్బాయికి ఏదైనా హానిచేయవచ్చు'' అన్నాడు యుగంధర్.

కమీషనర్ గిరి చాలా కోపంగా చూశాడు యుగంధర్‌ని.

"మీరు ఛీఫ్ కమీషనర్ ఆఫ్ పోలీస్‌ని వెంటాడారా? ఎంత అహంకారం" అన్నాడు.

"ప్లీజ్ శాంతించండి. మీరు యిప్పుడు నన్ను ఏమన్నా నేను పట్టించుకోను, మీరు ఎంతో చిత్తక్షోభలో వున్నారు కనుక."

"మిస్టర్ యుగంధర్! ప్లీజ్. వెళ్ళిపొండి. మీతో మాట్లాడవలసింది యేమీ లేదు."

యుగంధర్ కుర్చీలోంచి లేవలేదు. కమీషనర్‌ని జాలిగా చూశాడు. "మిస్టర్ గిరి మీరూ నేను పధ్నాలుగేళ్ళ నించి స్నేహితులం. మీ సర్వీస్ రికార్డు నాకు తెలుసు. ధర్మము, నాయమూ అతిక్రమించకుండా యిన్నేళ్ళు మీరు పోలీసు సర్వీసులో వున్నారు. అటువంటి మీరే మీ అబ్బాయి రమేష్ మీద వున్న ప్రేమ వల్ల ఏదో నేరం చెయ్యడానికి పూనుకుంటున్నారంటే నమ్మలేకుండా వున్నాను. మీ స్నేహితుణ్ణి నేను. మిమ్మల్ని నేరం  చెయ్యనివ్వను" అన్నాడు.

పోలీస్ కమీషనర్ గిరి ఏమీ జవాబు చెప్పలేక తల రెండు చేతుల్లో పట్టుకుని బల్లమీదికి వాల్చాడు.

"మిస్టర్ గిరి ఒక మీ అబ్బాయినే కాదు యింకా ఎంత మందినో యెత్తుకుపోయారు. వాళ్ళవాళ్ళనందర్నీ ఈ బ్లాక్ మెయిలర్ యీపాటికి కలుసుకుని తనకి కావలసిందేమిటో చెప్పి వుంటాడు. కానీ వాళ్ళెవరికీ నాకు కాని, పోలీసులకి కాని నిజం చెప్పే ధైర్యం వుండదు. నిజం చెప్పి తాము ప్రేమించిన వాళ్ళ ప్రాణాలకి హాని కలిగించలేరు. మీ విషయం వేరు, మీరు పోలీస్ ఆఫీసర్, ఉన్నతోద్యోగి. నేరాలు జరగకుండా చూడడం మీ బాధ్యత. నేరం చేసిన వాళ్ళని పట్టుకోవడం మీ డ్యూటీ. మీకు ధైర్యం ఎక్కువ. మీ విద్యుక్త ధర్మం మీద మీకు భక్తి వుంది. అటువంటి మీరే.."

గిరి తల విదిలిస్తున్నాడు.

"నాలో నమ్మకముంచండి. మీ అబ్బాయికి యెటువంటి హానీ జరగనివ్వను. మీరు నాకు నిజం చెప్పితే పొరబాటునైనా బయటపడనివ్వను. బయటపడనివ్వకుండా ఆ దుర్మార్గుల్ని పట్టుకుంటాను."

కమీషనర్ గిరి తల యెత్తాడు.

"అందుకే మిమ్మల్ని యీ గదిలోకి, మనం మాట్లాడే రహస్యం ఎవరికీ తెలియకుండా వుండేందుకు తీసుకు వచ్చాను. యుగంధర్ మిమ్మల్ని కలుసుకున్నట్లు ఎవరికీ తెలియదు. నాకు మీరు చెప్పినట్లూ ఎవరికీ తెలియదు. ఎవరో వై.వి రామయ్య యేదో పనిమీద వచ్చి మీతో మాట్లాడి వెళ్ళాడనుకుంటారు."

పోలీస్ కమీషనర్ కళ్ళల్లో ఆశ వెలిగింది.

అంతలో టెలిఫోన్ మోగింది. గిరి రిసీవర్ తీసుకుని "యస్. గిరి హియర్. ఎవరు? డిటెక్టివ్ యుగంధరా! ఆఁ అవును" అని రిసీవర్ యుగంధర్‌కి అందించాడు.

ఆశ్చర్యంతో యుగంధర్ రిసీవర్ తీసుకున్నాడు.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ యుగంధర్ అనవసరమైన శ్రమ. తిరిగి వెళ్ళేటప్పుడైనా అతికించుకున్న మీసాలు తీసెయ్యండి. దయచేసి రిసీవర్ మిస్టర్ గిరికి యివ్వండి" అవతలనించి మాట్లాడడం వినిపించింది.

"మీరెవరు?" అడిగాడు యుగంధర్.

చిన్న నవ్వు. "రిసీవర్ మిస్టర్ గిరికి యివ్వండి."

యుగంధర్ రిసీవర్ గిరికి యిచ్చాడు.

"లేదు. నాకు తెలియదు చెప్పలేదు. చెప్పను" అని గిరి రిసీవర్ పెట్టేసి లేచి నిలుచున్నాడు. "మీరు నా దగ్గరికి వచ్చినట్లు యెవరికీ తెలియదన్నారు. మిస్టర్ యుగంధర్ యింకైనా దయచేసి వెళ్ళండి. మీతో మాట్లాడవలసిందేమీ లేదు" అని గదిలోంచి వెళ్ళిపోయాడు.

## 18

"పోలీస్ కమీషనర్ గిరి కూడా వాళ్ళకి బెదిరిపోతాడని అనుకోలేదు" అన్నాడు రాజు.

"కన్న కొడుకు కదా! ప్రేమ అలాంటిది. ఆయని తప్పు పట్టడానికి వీల్లేదు. పూర్తిగా వాళ్ళకి లొంగిపోయాడో లొంగిపోయినట్లు నటించి వాళ్ళని పట్టుకునేందుకు ఏదైనా పన్నాగం పన్నుతున్నాడో మనకి తెలియదు. ఏదైనా గిరి ద్వారా మనకి యేమీ తెలియదు" అన్నాడు యుగంధర్.

"ఇవాళ కమీషనర్ డ్యూటీలో చేరాడట. మీకు తెలుసా?"

"తెలుసు"

"మనం యీ విషయం ఐ.జి.తో మాట్లాడితే" అన్నాడు రాజు.

"ప్రయోజనం లేదు. కమీషనర్ ఐ.జి.కి మాత్రం చెపుతాడా!"

"గిరిని ఓ కంట కనిపెడుతూ వుంటారుగా" అన్నాడు రాజు.

"ఇన్నేళ్ళ పోలీసు శిక్షణ వున్న గిరి అంత సులభంగా బయటపడతాడా! మనం వేరే ఇంకో పథకం ఆలోచించాలి" అన్నాడు యుగంధర్.

హీరాలాల్ సెక్రటరీ మోహన్‌దాస్ ది గ్రేట్ నేషనల్ బాంకికి వెళ్ళి హీరాలాల్ చెప్పిన పని ముగించుకుని కారు దగ్గరికి వచ్చాడు సాయంకాలం నాలుగు గంటలకి.

"మిస్టర్ మోహన్‌దాస్" అన్నాడు వెనకనించి ఎవరో.

"యస్" అని వెనక్కి తిరగబోయాడు మోహన్‌దాస్. అంతలో అతని వీపు మీద చెయ్యి పడింది. వీపులో యేదో గట్టిగా తగిలింది.

"చెప్పినట్లు చెయ్యి. లేకపోతే పిస్తోలుతో వీపు తూట్లు పడేట్లు కాలుస్తాను" అన్నాడు వెనకనించి.

"ఏమిటిది?" అని యింకా ఏదో అనబోతుండగా, "ఆఖరుసారి చెపుతున్నాను. ప్రాణం మీద ఆశవుంటే చెప్పినట్లు చెయ్యి" అన్నాడు వెనక నిలబడ్డ మనిషి.

ఇక మోహన్‌దాస్ ఎదురు తిరగలేదు.

"డ్రైవర్ సీట్లో కూర్చో."

మోహన్‌దాస్ కిక్కురుమనకుండా డ్రైవింగ్ సీటులో కూర్చుని "పోనీ" అన్నాడు.

"ఎక్కడికి?"

"తిన్నగా పోనియ్యి."

"నువ్వు ఎవరివో, నన్ను ఎందుకిలా బెదిరిస్తున్నావో నాకు తెలియడం లేదు."

"తెలుస్తుంది. డ్రైవ్ చెయ్యి."

చింతాద్రి పేటలో ఓక్ గేటు తెరిచి వుంది. కారుని తిన్నగా లోపలికి తీసుకు వెళ్ళమని చెప్పాడు మోహన్‌దాస్‌కి. అతను ఆ ఆజ్ఞ పాటించక తప్పలేదు. కారు దిగి యింట్లోకి వెళ్ళగానే ఎవరో తలుపు మూసేశారు. మరుక్షణం మోహన్‌దాస్ దవడ మీద పెద్ద దెబ్బ పడింది. ఆ దెబ్బకి అతను కిందపడ్డాడు. "మీరెవరు? నన్నెందుకిలా కొడుతున్నారు?" అడిగాడు తనని బెదిరించి అక్కడికి తీసుకు వచ్చిన మనిషినీ, ఆ యింట్లో వున్న మనిషినీ పరీక్షగా చూస్తూ. వాళ్ళని యిదివరకు తను చూసిన గుర్తులేదు.

"మేము ఎవళ్ళమైతేనేం నీ పాలిటి యముళ్ళం" అరిచాడు వాళ్ళల్లో ఒకడు.

"మీకేం కావాలి? నన్నెందుకు యిక్కడికి తీసుకు వచ్చారు?" బెదురుతూ అడిగాడు మోహన్‌దాస్.

"హీరాలాల్ కొడుకు శోభన్ని ఎక్కడ దాచావో చెప్పు."

మోహన్‌దాస్ ఒక్క నిట్టూర్పు విడిచి "నాకేం తెలుసు?" అన్నాడు.

అతనా మాట పూర్తిగా అనక ముందే ఛెళ్ళుమని అతని నోటి మీద దెబ్బ తగిలింది. "మేము పోలీసులం కాము. మాకు ఎవిడెన్స్ ఆక్టు వర్తించదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌తో మాకు సంబంధం లేదు. నీనించి నిజం బయట పడేటంతవరకూ నిన్ను నానా హింసలూ పెడతాము."

"మీరు ఎన్ని హింసలు పెట్టినా నాకు తెలియని విషయాలు ఎలా చెప్పగలను" అన్నాడు మోహన్‌దాస్.

"నీకు నిజంగా తెలియకపోతే నీ ఖర్మ. నరక బాధపడి మా చేతుల్లో చస్తావు."

మోహన్‌దాస్ వాళ్ళిద్దరి మొహాలు చూశాడు. చాలా క్రూరంగా వున్నాయి. దయాదాక్షిణ్యాలు ఏ కోశానా లేవు వాళ్ళల్లో.

"మీరేదో పొరబడుతున్నారు. నిజంగా నాకేమీ తెలియదు. కావలిస్తే హీరాలాల్‌గారిని అడిగి చూడండి. ఆయనకి నామీద ఎటువంటి అనుమానమూ లేదు" అన్నాడు మోహన్‌దాస్.

వాళ్ళలో ఒకడు విరగబడి నవ్వాడు. మోహన్‌దాస్ బెదిరిపోయాడు. "నీ ముఠావాళ్ళు చెప్పినట్లు చేస్తావన్నాడు. అదంతా మాకు తెలుసులే" అన్నాడు.

"మీకు తెలుసా! ఎలా తెలుసు? ఎవరు చెప్పారు? హీరాలాల్ చెప్పారా?" ఖంగారుగా అడిగాడు మోహన్‌దాస్. వెంటనే తను బయటపడిపోయానని తెలుసుకుని నాలిక కొరుక్కున్నాడు.

**"ఏమీ తెలియని** అమాయకుడివికదూ నువ్వు?" అంటూ ఫెడీమని దవడ పగిలేట్లు యింకో దెబ్బ కొట్టాడు.

ఆ దెబ్బకి మోహన్‌దాస్ చెవులు గింగురుమన్నాయి. ఒక నిమిషంపాటు కళ్ళు చీకట్లు కమ్మాయి. "శోభన్ని ఎక్కడ దాచినదీ నిజంగా నాకు తెలియదు" అన్నాడు.

"నీకు తెలిసిందేమిటో చెప్పు."

"మీకు తెలిసిందే నాకూ తెలుసు."

"మాకేం తెలుసో నీకనవసరం. నీకు తెలిసింది చెప్పు. నువ్వు నిజం చెపుతున్నావో లేదో మాకు తెలుస్తుంది."

మోహన్‌దాస్ దవడ రుద్దుకుంటూ "నేను నిజం చెబుతున్నాను. ఏమీదాచడం లేదు. వినండి. అయిదేళ్ళనించీ నేను హీరాలాల్ సెక్రటరీగా పనిచేస్తున్నాను. నా జీతం మూడువందలు. వారింట్లో నాకు ఓ గది యిచ్చారు. భోజనం అక్కడే నేను ఎం.ఏ ఎకనామిక్స్ పాసయ్యాను. హీరాలాల్ నోట్లలో మునిగిపోతున్నాడు. కానీ నా జీతం పదిరూపాయలు కూడా పెంచడు. హీరాలాల్ కాల్చే యింపోర్టెడ్

సిగిరెట్లు నెలకి నాలుగు వందల ఖరీదు చేస్తాయి. నా కడుపు మండిపోయేది. ఏమిటీ అన్యాయం. ఒక మనిషికి అంత డబ్బు ఎందుకు? ఇంతమంది డబ్బు లేకుండా బాధపడటమేమిటి? ఆ డబ్బంతా శ్రమపడి సంపాదించలేదు హీరాలాల్. తన తోటి మానవుల రక్తమాంసాలు పిండి –"

"ఆ సిద్ధాంతాలన్నీ మా కనవసరం. అసలు సంగతి చెప్పు."

"సమాన సంపదా, సమాన భోగం ఆదర్శంగా పెట్టుకున్న ఒక రాజకీయ పార్టీలో సభ్యుడిగా చేరాను రెండేళ్ళక్రితం."

"ఊఁ! తర్వాత?"

"ప్రజాస్వామ్య పద్ధతులలో తమ పార్టీ వ్యవహరిస్తుందని పైకి చెప్పేవాళ్ళు. వాళ్ళలో ఒక కూటం ఏర్పడింది. ఆ పక్షం వాళ్ళు ప్రజాస్వామ్య పద్ధతులు అవలంబిస్తే కొన్ని శతాబ్దాలు పట్టుతుందనీ, యితర విధానాలు అవలంబించి విప్లవం తీసుకురావాలనీ ప్రబోధించారు."

"ఊఁ! అసలు విషయం చెప్పు."

"నేను కూటంలో చేరాను. హీరాలాల్ కొడుకుని ఎత్తుకు పోవడానికీ, తర్వాత హీరాలాల్ డబ్బు కాజేసి బీదలకి పంచి పెట్టడానికీ ఒక పన్నాగం పన్నారు. అందుకు నన్ను సహాయం చెయ్యమన్నారు."

"ఏం చెయ్యమన్నారు?"

"రాత్రి వీధి తలుపు తెరిచి వుంచమన్నారు. తర్వాత తలుపు మూసి గడియపెట్టి తాళం వెయ్యమన్నారు."

"అంటే హీరాలాల్ కొడుకుని ఎత్తుకుపోయింది దెయ్యం కాదని నీకు తెలుసన్నమాట."

"తెలుసు. ఆ కూటంలో వాళ్ళే శోభన్ని ఎత్తుకుపోయారు. నేను చేసిన సహాయమల్లా తలుపు తెరిచి వుంచడం, తరువాత మూయ్యడం అంతే."

వాళ్ళిద్దరూ నవ్వారు. "చిన్న సహాయం చేశావన్నమాట. తరవాత?" అడిగారు.

"తరవాత మీకు తెలుసుగా హీరాలాల్ చెప్పారుగా?"

"షటప్! నువ్వు చెప్పు. నువ్వు చెపుతున్నది నిజం అవునో కాదో తెలుసుకోవాలి."

"వారం రోజుల తర్వాత నాకు టెలిఫోన్ చేసి చెప్పాదు. ఒక యువతి వచ్చి నాకు ఒక తోలు పెట్టె యిస్తుందనీ, నేను ఆ తోలుపెట్టె హీరాలాల్‌కిచ్చి, ఆయన యిచ్చే తోలు పెట్టె నా గదిలో పెట్టుకోవాలనీ, ఆ యువతి మళ్ళీ వచ్చి యింకో తోలుపెట్టె నాకు ఇస్తుందనీ, అది తీసుకుని హీరాలాల్ యిచ్చిన తోలు పెట్టె ఆమెకి యివ్వమనీ."

"అలా ఎన్నిసార్లు తోలు పెట్టెలు మార్చావు?"

"ఇప్పటికి ఎనిమిదిసార్లు."

"ఆ తోలు పెట్టెలో ఏమున్నాయి?"

"నోట్లు" అన్నాడు మోహన్‌దాస్.

"హీరాలాల్ యిచ్చిన తోలు పెట్టెల్లో నోట్లున్నాయి. ఆ యువతి తెచ్చి యిచ్చిన తోలుపెట్టెల్లో?"

"నోట్లే" అన్నాడు మోహన్‌దాస్.

"వెరీగుడ్ ఇప్పుడు అసలు విషయం చెప్పు. ఒక కూటం తయారయిందన్నావు. ఆ కూటంలో సభ్యులు ఎవరు? ఎక్కడ సమావేశమయ్యేవారు?" అడిగాడు వాళ్ళల్లో ఒకతను.

"నాకు తెలియదు"

ఫెళీమని యింకో దెబ్బ పడింది.

"నిజంగా నాకు తెలియదు. ఆ కూటం సమావేశానికి నన్ను మొదటిసారి తీసుకుని వెళ్ళినపుడు కారు ఎక్కగానే నా కళ్ళకి గంతులు కట్టారు. అది అర్ధరాత్రి. ఎక్కడికో తీసుకువెళ్ళారు. సమావేశంలో సభ్యులందరూ మొహాలకి నల్లని ముసుగులు వేసుకున్నారు."

"శోభన్ని ఎత్తుకుపోయిన తరువాత మీ కూటం సమావేశం మళ్ళీ జరిగిందా?"

"లేదనుకుంటాను. నన్ను పిలవలేదు."

"ఆ కూటానికి నాయకుడు ఎవరో తెలుసా?"

"తెలియదు. ఒక విషయం మాత్రం చెప్పగలను. భారతీయుడు కాడు. ఇంగ్లీషులోనే మాట్లాడేవాడు. కానీ ఆ యింగ్లీషు అదో విధంగా వుండేది."

"తోలు పెట్టెలు తెచ్చే యువతి కూడా ముసుగు వేసుకుని వచ్చే?"

"లేదు. రోజూ పొద్దున తొమ్మిదిగంటలకి వస్తుంది. చాలా అందంగా వుంటుంది."

"ఎవరీమె? ఎందుకు నీ దగ్గరికి వస్తోంది అని ఎవరూ నిన్ను అడగలేదా?"

"నా ప్రియురాలు అని చెప్పాను."

"మోహన్‌దాస్ కిడ్నాప్ పీనల్‌కోడ్ ప్రకారం ఎంత పెద్ద నేరమో తెలుసా? ఎన్నేళ్ళు జైలు శిక్ష పడుతుందో తెలుసా? ఏడేళ్ళు. కిడ్నాప్ చెయ్యడం ఎంత పెద్ద నేరమో, కిడ్నాప్ చెయ్యడానికి సహాయం చెయ్యడమూ అంత నేరమే."

మోహన్‌దాస్ తల వంచుకున్నాడు.

"దొంగనోట్లు తయారు చెయ్యడం ఎంత నేరమో, అవి మార్చడానికి సహాయపడడమూ అంత నేరమేనని నీకు తెలుసా? పదేళ్ళు జైలు శిక్ష. కుర్రతనపు ఆవేశంలో - ఏదో గొప్ప విప్లవం తీసుకురావడానికి సహాయపడుతున్నానన్న అపోహతో యిలా చేశావని అనుకుంటాను. అందుకే మా నిజ స్వరుపాలు నీకు చూపిస్తాము" అన్నాడు ఒకడు.

వాళ్ళిద్దరూ మొహానికి పూసుకున్న రంగు చెరిపేసి, అతికించుకున్న మీసాలూ, గెడ్డాలూ పీకి పారేసారు.

"డిటెక్టివ్ యుగంధర్! రాజు! మీరా" అన్నాడు మోహన్‌దాస్.

"మోహన్‌దాస్. నిన్ను పోలీసులకి అప్పగించి నీకు పదేళ్ళ శిక్ష పడేటట్లు చెయ్యవచ్చు. కాని నీ అమాయకత్వానికి జాలిపడి నీకు ఓ అవకాశం యిస్తున్నాను. వాళ్ళని పట్టుకునేందుకు నువ్వు మాకు సహాయపడాలి" అన్నాడు యుగంధర్.

## 19

"వసంత కుమార్‌గారా! గుడ్ యీవినింగ్! మీ వల్ల ఒక సహాయం కావాలి. మీరు తీరికగా వున్నారా? మీ సహాయం ఒక వారం రోజులపాటు కావాలి" అన్నాడు యుగంధర్ టెలిఫోన్‌లో.

"రెండు పిక్చర్లున్నాయి చేతిలో. ఈ వారంలో షూటింగు వుంటుందన్నారు. అయినా మీకు నా సహాయ అవసరమైతే కాన్సిలు చేస్తాను" అన్నాడు వసంతకుమార్.

"చెయ్యండి. చాలా ముఖ్యమైన పని. దయచేసి మీ మేకప్ బాక్స్ తీసుకురండి" చెప్పాడు యుగంధర్.

"ఎందుకు? వేషం వెయ్యాలా?" అడిగాడతను.

"అవును. హీరాలాల్ సెక్రటరీ మోహన్‌దాస్‌గా కొన్నాళ్ళు నటించాలి."

"ఎక్కడ?"

"హీరాలాల్ గారి దగ్గర ఆయన యింట్లో."

"గుడ్‌గాడ్! మోహన్‌దాస్ ఏమయ్యాడు?

"అతన్ని కొన్నాళ్ళపాటు దాచేస్తున్నాను. మీరు మోహన్‌దాస్ కారని బయటపడకూడదు. ఏదో జ్వరం వచ్చి గొంతు పూడుకుపోయిందని చెప్పాలి. మీరు నటించలరని నాకు తెలుసు. మీ మీద నాకు పూర్తి నమ్మకమున్నది" అన్నాడు యుగంధర్.

తలుపు చప్పుడయింది. మోహన్‌దాస్ వేషంలో వున్న వసంత్‌కుమార్ తలుపు తెరిచాడు.

"ఏం గదంతా యింత చీకటిగా వుందేం? మెడకి మఫ్లర్ చుట్టుకున్నారెందుకు?" అడిగింది గదిలోకి వచ్చిన యువతి. మంచి ఒంటి రంగు. అందమైన విగ్రహం, తెల్లచీర కట్టుకుంది.

బొంగురుపోయిన కంఠస్వరంతో, మధ్య మధ్య దగ్గుతూ చెప్పాడు "ఫ్లూ జ్వరం. గొంతు పూడుకుపోయింది."

"సారీ" అని చేతిలో వున్న తోలుపెట్టెని బల్లమీద పెట్టి బల్లమీద వున్న అదే రకం తోలు పెట్టెని తీసుకుని "వస్తాను. మళ్ళీ రేపు యిదే టయింకి" అన్నదామె.

అతను తల వూపాడు. ఆమె గదిలోంచి బయటికి వెళ్ళగానే అతను కిటికీ దగ్గరికి వెళ్ళి, జేబు రుమాలు తీసి మొహం తుడుచుకున్నాడు. కిటికీకి ఎదురుగా రోడ్డుమీద నిలుచుని యిద్దరు మాట్లాడుకుంటున్నారు.

"వెయ్యిరూపాయలకి తక్కువ యివ్వడానికి వీల్లేదు" అన్నాడు యుగంధర్.

"వెయ్యి అయితే మాకేం గిడుతుంది?" అన్నాడు రాజు.

మోహన్‌దాస్ వేషంలో వున్న అతను కిటికీ దగ్గరికి రావడం గమనించారు యిద్దరూ.

ఆమె హీరాలాల్ యింట్లోంచి బయటికి వచ్చి, ఒకసారి యిటూ అటూ చూసి, చేతిలో తోలుపెట్టె పట్టుకుని చకచకా నడవడం ప్రారంభించింది.

"రాజూ! నువ్వు వెళ్ళు" అన్నాడు యుగంధర్.

రాజు ఆమెని కొంచెం వెనకాలే వెంబడించాడు. కొంచెం దూరంలో ఆగి వున్న పాత ఫోర్డుకారు దగ్గరికెళ్ళాడు యుగంధర్. డ్రయివింగ్ సీటులో ఓ యువతి కూర్చునున్నది.

"కాత్యా! మనం వెంటాడవలసిన స్త్రీ అదిగో, నువ్వు కారులో వెంటాడు. నేను మోటార్ సైకిల్ మీద వస్తాను. జాగ్రత్త సుమా! మన కళ్ళల్లో కారం కొట్టి తప్పించుకోకూడదు యీమె" హెచ్చరించాడు యుగంధర్.

కాత్యా తల వూపి కారు స్టార్టు చేసింది.

తోలు పెట్టె పట్టుకుని వెళుతున్న యువతి బస్‌స్టాప్ దగ్గర ఆగింది. రాజు కొంచెం దూరంలో ఆగాడు. బస్ కోసం చాలామంది కాచుకున్నారు. వాళ్ళలో కలిసిపోయాడు రాజు.

ఆమె బస్సు ఎక్కింది. రాజు ఎక్కాడు. ఆమె సెంట్రల్ స్టేషన్ దగ్గర బస్ దిగింది. రాజూ దిగాడు. ఆమె యిటూ అటూ చూడడం లేదు. తనని ఎవరన్నా వెంబడిస్తున్నారేమో అని అనుమానిస్తున్నట్లు లేదు. తిన్నగా పార్కు స్టేషన్‌కి వెళ్ళి తాంబరానికి టిక్కట్టుకొన్నది.

రాజు మూడు టిక్కట్లు కొన్నాడు తాంబరానికి. ఆమె మెట్లు ఎక్కి ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళిపోయింది. అప్పుడు వచ్చాడు యుగంధర్.

"తాంబరానికి టిక్కట్లు కొన్నాను - మీకూ, కాత్యాకీ కూడా" అని రెండు టిక్కట్లు యుగంధర్‌కి యిచ్చి రాజు మెట్లు ఎక్కాడు.

ఆమె ప్లాట్‌ఫాం మీద నిలుచున్నది. రాజు కాంటీన్ దగ్గర నిలబడ్డాడు. యుగంధర్ కిల్లీకొట్టు దగ్గర ఆగాడు. కాత్యా ఆడవాళ్ళ బెంచీమీద కూర్చున్నది.

రైలు మాంబలం స్టేషన్‌లో ఆగగానే యుగంధర్, రాజు ఆడవాళ్ళ కంపార్టుమెంటునే చూస్తున్నారు. చాలామంది ఆడవాళ్ళు దిగుతున్నారు కానీ తోలు పెట్టెతో వచ్చిన ఆమె దిగలేదు. చటుక్కున యుగంధర్ ప్లాట్‌ఫాం మీదికి దిగాడు. ఆడవాళ్ళ పెట్టెలోంచి దిగిన వాళ్ళలో ఒకామె చేతిలో తోలు పెట్టెవున్నది. హీరాలాల్ యింటిలోంచి వచ్చిన యువతి చేతిలో తోలుపెట్టెలాంటిదే అది.

రైలు కదలబోతోంది. రాజుకి, కాత్యాకీ ఏమీ చెప్పే అవకాశం లేదు యుగంధర్‌కి. పచ్చ చీర కట్టుకున్న ఆ స్త్రీని వెంటాడుతూ వెళ్ళిపోయాడు.

ప్రతి స్టేషన్‌లోనూ రాజు తొంగి చూస్తూనే వున్నాడు. హీరాలాల్ యింట్లోంచి తోలు పెట్టెతో వచ్చిన స్త్రీ దిగలేదు. అటువంటితోలు పెట్టె పట్టుకుని ఒక స్త్రీ మాంబళంలో దిగడంకాని, యుగంధర్ ఆమెని వెంబడించడం కానీ రాజు చూడలేదు.

రైలు తాంబరం స్టేషన్లో ఆగింది. రాజు రైలు దిగి ఆడవాళ్ళ పెట్టె వైపే చూస్తున్నాడు. హీరాలాల్ యింట్లోంచి వచ్చిన యువతి తోలు పెట్టె పట్టుకుని దిగింది. ఒకసారి యిటూ అటూ చూసి మెట్ల వైపు నడుస్తోంది. ఆడవాళ్ళ పెట్టెలోంచి దిగిన కాత్యా రాజు పక్కకి వచ్చి "కోడంబాకంలో ఒకామె యెక్కింది. ఆమె చేతిలో యిదేరకం తోలు పెట్టె వున్నది. ఈమె తోలు పెట్టె పక్కన తన తోలు పెట్టె పెట్టింది. మాంబలంలో దిగింది. దిగుతున్నపుడు తను తెచ్చిన తోలు పెట్టెకి బదులు హీరోలాల్ యింట్లోంచి వచ్చిన ఆమె తెచ్చిన తోలు పెట్టె తీసుకుని వెళ్ళిపోయింది" అన్నది.

"అంటే తోలు పెట్టెలు మారుస్తున్నారన్న మాట" అన్నాడు రాజు.

"అయుండాలి. మాంబళంలో దిగిన స్త్రీని యుగంధర్ వెంబడించారు" చెప్పింది కాత్యా.

"ఆల్‌రైట్! ఈమె తోలు పెట్టెలో ఏముందో తెలుసుకుంటాను" అంటూ రాజు గబగబా మెట్లు ఎక్కాడు ఎక్కుతూ తోలు పెట్టె పట్టుకుని వెళుతున్న స్త్రీని వెనక నించి తోశాడు. ఆమె ముందుకి పడబోయేసరికి "సారీ! సారీ!" అంటూ పడకుండా ఆమెని పట్టుకున్నాడు. ఆమె పడలేదు కానీ ఆమె చేతిలో తోలు పెట్టె కిందపడి నాలుగు మెట్లు దొర్లింది. వెనక వస్తున్న కాత్యా త్వరగా వెళ్ళి ఆ పెట్టె తీసుకున్నది ఆమెకి యివ్వడానికి. కన్నుమూసి, కన్ను తెరిచే లోపున పెట్టె మూత తెరిచింది ."అయ్యో! మూత తెరుచుకున్నది" అన్నది. పెట్టెలో వున్న వస్తువులన్నీ కిందపడ్డాయి.

"థవుజండ్ ఎపాలజీస్" అంటున్నాదు రాజు.

"అయ్యో పాపం" అంటోంది కాత్యా.

"ఫర్వాలేదు. ఏం చేస్తాం. కావలసి చెయ్యలేదుగా" అన్నదామె.

కాత్యా, రాజూ కిందపడిన వస్తువులు ఏరి యిస్తున్నారు. బట్టలు, గాజులు పౌడర్ డబ్బా, రెండు పుస్తకాలు, యివే వున్నాయి ఆ పెట్టెలో. అనుమానించ తగ్గవీ, రహస్యమైనవీ ఏవీలేవు. కాత్యా పెట్టె ఆమెకి యిచ్చివేసింది.

థాంక్స్ చెప్పి పెట్టె తీసుకుని ఆమె వెళ్ళిపోయింది.

"ఇప్పుడేం చేద్దాం?" అడిగింది కాత్యా.

"నువ్వు ఆగిపో. నేను వెంటాడుతాను" అన్నాడు రాజు.

"వెంటాడుతున్నట్లు బయట పడిపోవు" అన్నది కాత్యా. రాజు నవ్వి "బయటపడను" అన్నాడు.

తోలుపెట్టె తీసుకుని వెళుతున్న పచ్చ చీర ఆమె త్యాగరాయ నగరం వేపు బ్రిడ్జి మెట్లు దిగింది. యుగంధర్ జనంలో కలిసిపోయి ఆమెకి కనిపించకుండా ఆమె వెనకే వెళుతున్నాడు. రైలు స్టేషన్ నించి ఉస్మాన్ రోడ్‌కి వెళ్ళే రంగనాథం వీధి చాలా రద్దీగా వుంటుంది అసలే యిరుకు వీధి. ఆ వీధి రెండు వైపులా పేవ్‌మెంట్ల మీద ఫాన్సీ సామాన్లు, కూరలు అమ్మే అంగళ్ళు. రైలుకి వెళ్ళే జనం రైలు దిగివచ్చే జనం. వీధంతా కిటకిటలాడుతూ వుంటుంది. ఆ వీధి మధ్య ఆమె ఎవరినో చూసి ఆగిపోయింది. "హల్లో! ఎప్పుడు వచ్చావు యీ వూరికి?" అడిగింది.

"నిన్న. నువ్వు ఎప్పుడు వచ్చావు?" అడిగాడతను ఆమెని.

"అంతా బాగున్నారా? నాన్నగారు యెలా వున్నారు?" ఇలా మాట్లాడుతోంది ఆమె. అతను జవాబు చెపుతున్నాడు. ప్రశ్నలు అడుగుతున్నాడు. అన్నీ వాళ్ళ కుటుంబ వ్యవహారాలు. రోడ్ పక్కన నిలుచుని కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళిద్దర్నీ యెవరూ గమనించడంలేదు.

మాట్లాడుతూ, మాట్లాడుతూ ఆమె అతని చేతికి తోలు పెట్టె యివ్వడంగాని, ఆ తోలు పెట్టె అతని చేతిలోంచి ఆమె మళ్ళీ తీసుకోకుండా వెళ్ళిపోవడంగానీ యెవరూ గమనించలేదు యుగంధర్ తప్ప.

నిన్నెవరూ గమనించకుండా వుండాలంటే ఒక మూలకి నక్కి దాక్కొక రహస్యంగా మాట్లాడక. పది మందిలో నిలబడి మామూలుగా కనబడు ఎవరి విషయం పట్టించుకోక అనే సిద్ధాంతం వీళ్ళు ఆచరణలో పెట్టారన్న మాట. అనుకుని యుగంధర్ నవ్వుకున్నాడు. ఎవరూ లేని యే సందులోకో వెళ్ళి ఆమె అతనికి ఆ తోలుపెట్టె యివ్వలేదు. నడిరోడ్డు మీద నలుగురుండగా బాహాటంగా యిచ్చివేసింది.

ఇక ఆమెని వెంబడించి ప్రయోజనం లేదు. తోలు పెట్టె ఆమె దగ్గరలేదు. యుగంధర్ అతన్ని వెంబడించాడు. పాతికేళ్ళ మనిషి అనాకారి కాడు, అందగాడూ కాడు. గొప్పవాడు కాడు. బీదవాడూ కాడు. సామాన్యుడు. సామాన్యమైన మొహం. ఒకసారి చూచి యింకోసారి చూడాలని ఎవరూ వెనక్కి తిరిగి చూడరు. జ్ఞాపకం పెట్టుకునే మొహం కాదు.

తనని ఎవరో వెంబడిస్తున్నారనే అనుమానం లేదు అతనికి. ఉస్మాన్ రోడ్ మీదకి వెళ్ళాడు. ఎడం వైపు వెళ్ళి, రెండు ఫర్లాంగులు నడిచి ఆగాడు ఒకచోట. 'డాక్టర్ మృత్యానందం - ఆయుర్వేద డిస్పెన్సరీ' అని బోర్డు వుంది. గబగబా ఆ యువకుడు లోపలికి వెళ్ళాడు. యుగంధర్ ఆ డిస్పెన్సరీకి ఎదురుగా ఒక కొట్టు వసారాలో నిలబడి చూస్తున్నాడు. డిస్పెన్సరీలో దాదాపు పదిమంది కాచుకుని వున్నారు లోపలికి వెళ్ళడానికి. ఇరవై నిమిషాల తరువాత తోలుపెట్టె పట్టుకున్న యువకుడు లోపలికి వెళ్ళాడు. పదినిమిషాల తరువాత బయటికి వచ్చాడు. అప్పుడు అతని చేతిలో తోలు పెట్టెలేదు.

సందిగ్ధంలో పడ్డాడు యుగంధర్. ఏం చెయ్యాలి? ఈ యువకుణ్ణి వెంటాడడమా లేక డాక్టర్ మృత్యానందాన్ని వెంటాడి తోలుపెట్టె చివరికి ఎక్కడికి చేరుకుంటుందో చూడడమా! ఆలోచిస్తున్నాడు.

"క్షమించండి. తొందరలో పరిగెత్తాను. మీకు దెబ్బ ఏమైనా తగిలిందా?" అడిగాడు రాజు.

ఆమె ఛటుక్కున వెనక్కి తిరిగి "మీరా?! దెబ్బేమీ తగలలేదు లెండి" అన్నది.

"ఆ పెట్టె యిలా యివ్వండి. నేను తెస్తాను."

"అవసరంలేదు" అన్నదామె.

"అందంగా వున్న మీ లేత చేతులు కందిపోతాయి" అన్నాడు రాజు నవ్వుతూ.

ఆమె గిర్రున వెనక్కి ఇరిగి "మిస్టర్! పెద్దమనిషివి అనుకుని యింతసేపు మీతో మాట్లాడాను జాగ్రత్త" అన్నది.

"అబ్బా! ఎంత కోపం! పెద్దమనిషినే."

"పెద్దమనిషివైతే యిలా"

"నేనేమన్నాను. మీ చేతులు కందిపోతాయన్నాను. కోమలంగా, అందంగా వున్నారని మీకు చెప్పడం తప్పా! పెద్దమనిషి అలా చెప్పకూడదా" అన్నాడు రాజు.

"నువ్వు పెద్ద మనిషివికావు. లేక మనిషివి. రౌడీవి. వెళ్ళు" అని ఆమె చకచకా నడుస్తోంది.

"ప్లీజ్ కోపం తెచ్చుకోకండి. నేను రౌడీని కాను. మిమ్మల్ని అల్లరిపెట్టడానికి కాదు. నిజంగా -"

"కేక వేశానంటే నలుగురూ వచ్చి నిన్ను తంతారు జాగ్రత్త."

"అయినా సరే. నేను వెళ్ళిపోతే నా ప్రాణం యిక్కడ వొదిలేసి వెళ్ళినట్లు వుంటుంది. మీ పేరు . ప్లీజ్ చెప్పండి."

"చెపితే వెళ్ళిపోతారా?"

"ఆ ప్రామిస్ యివ్వలేను."

ఆమె మాట్లాడకుండా మెట్లు దిగుతోంది. రాజు ఆమె పక్కనే నడుస్తున్నాడు.

ఆమె రోడ్ మీదికి వెళ్ళి ఆగింది. రాజు ఆమె పక్కనే నిలుచున్నాడు.

"మిస్టర్ రోడ్ మీద గొడవపడడం నాకు యిష్టంలేదు. నలుగురిని చేర్చడం అంతకన్నా యిష్టంలేదు. నువ్వు మంచిగా వెళ్ళిపోకపోతే తప్పదు."

"ప్లీజ్ మీ పేరు చెప్పండి."

"వనిత. ఇక వెళ్ళు."

"వనిత - వనిత. అవును వనితంటే నువ్వే."

ఆమె నవ్వేసింది. "వాటే యింపాజిబుల్ ఫెలో యు ఆర్. నీకేమైనా పిచ్చా!"

"అవును. వనిత పిచ్చి."

"నా పేరు చెప్పాను. నీ పేరేమిటి? ఏం చేస్తున్నావు? ఎక్కడ వుంటున్నావు?" అడిగింది వనిత.

"నా పేరు రాజు. బి.ఎ పాసయ్యాను. ఉద్యోగం కోసం యీ వూరు వచ్చాను. ఇంకా దొరకలేదు. ట్రిప్లికేన్‌లో ఓ గదిలో వుంటున్నాను."

"తాంబరం ఎందుకు వచ్చావు?"

"పార్క్ స్టేషన్‌లో నిన్ను చూసి."

వనిత రాజుని పరీక్షగా చూసింది. రాజు అమాయకంగా, ఒక విధమైన భక్తితో చూశాడు ఆమెని.

"ఇక నువ్వు వెళ్ళు. సాయంకాలం కలుసుకుందాంలే" అన్నదామె.

"ఎక్కడ?"

"బీచిలో - సెనెట్ హౌస్ ముందు."

"ఎన్నిగంటలకి?"

"ఆరు."

"థాంక్యూ"

"ఇక వెళ్ళు"

"నువ్వు సాయంకాలం రాకపోతే నేను నమ్మను. నువ్వు ఎక్కడ వుంటున్నావో చూసి వెళతాను. నువ్వు రాకపోతే నీ యింటికి వచ్చి నీ గుమ్మం ముందు."

"సరే, పద" అన్నదామె.

రాజు ఆమె వెనకే బయలుదేరాడు.

**ఆ తోలు పెట్టెలో** ఏమున్నదో యుగంధర్‌కి తెలుసు.

ఈ తోలు పెట్టెలు ఆఖరికి ఎక్కడికి చేరుకుంటాయి? ఈ ముఠాకి నాయకుడు ఎవరు? ఈ డాక్టర్ మృత్యానందం డిస్పెన్సరీ ముందు కాపలా కాస్తే యేమీ తెలియకపోవచ్చు. ఆ తోలుపెట్టె తీసుకువచ్చి డిస్పెన్సరీ ముందు కాపలా కాస్తే యేమీ తెలియకపోవచ్చు. ఆ తోలు పెట్టె తీసుకువచ్చి డిస్పెన్సరీలో వదిలి వెళుతున్న అతన్ని వెంబడించడం మంచిదని యుగంధర్ నిశ్చయించుకున్నాడు.

ఆ యువకుడు తాపీగా నడుస్తున్నాడు. వెనక్కి తిరిగి చూడడం లేదు. ఒక కొట్టు ముందు ఆగి, సోడా తాగి సిగిరెట్లు కొన్నాడు. అక్కణ్ణించి మళ్ళీ రైలు స్టేషన్ వేపు వెళ్ళాడు. టిక్కెట్టు కొనలేదు. మెట్లు యెక్కి అవతల వేపు పాత మాంబళం వేపు వెళ్ళాడు. నాలుగు వీధులు దాటి ఒక ఇరుకు సందులోకి నడిచాడు. ఆ సందులో మూడో యింట్లోకి వెళ్ళాడు. అది చాలా చిన్న ఇల్లు.

యుగంధర్ ఆ సందు చివర ఆగిపోయాడు. సందులోకి వెళితే ఆ యువకుడికి అనుమానం కలుగుతుందని. ఆ యువకుడు బయటికి వచ్చి ఎక్కడికి వెళతాడో, ఎవర్ని కలుసుకుంటాడో తను తెలుసుకోవాలి.

యుగంధర్ నిలబడిన చోట ఓ కొట్టుకానీ, ఓ యింటి వసారాకానీ లేదు. నీడైనా లేదు. అయినా అక్కడ కాచుకోక తప్పలేదు. అపరాధ పరిశోధనకి సహనమూ, ఓపికా చాలా అవసరం.

గంట అయింది. రెండు గంటలయింది. మధ్యాహ్నం అయింది. ఎండ చాలా తీక్షణంగా వుంది. కళ్ళు మూసుకుపోతున్నాయి. తల మాడుతోంది. దీప స్థంభానికి ఆనుకుని నిలుచున్నాడు. ఇంకా ఎంతసేపు కాచుకోవాలో.

"నాతో వస్తావా?" అన్న మాటలు వినిపించాయి.

యుగంధర్ వెనక్కి తిరగబోయాడు.

"ఒద్దు. చేతులు అలాగే విడిగా వుంచి కిక్కురుమనకుండా నాతో రా."

డొక్కలో పిస్తోలు గుచ్చుకుంటోంది. తను వెనక్కి తిరిగితే నడి వీధిలో పిస్తోలు పేలుస్తాడా ఏమో? తెగించిన మనిషి అయి వుండవచ్చు అనుకున్నాడు యుగంధర్.

"పద. నడు" అన్నాడు వెనకనించి.

యుగంధర్ ఇంట్లోకి నడిచాడు.

"ఆఁ అటువెళ్ళు. వెళ్ళి గోడకి మొహం ఆనించి నిలుచో" ఆజ్ఞాపించాడు అతను.

యుగంధర్ అతను చెప్పినట్లు చేశాడు. ఆ మనిషి వెనక్కి వచ్చి యుగంధర్ జేబులు తుడుముతున్నాడు. "ఓహో! నీ జేబులో పిస్తోలు కూడా వున్నదన్నమాట. ఎవరు నువ్వు?" అంటూ యుగంధర్ జేబులోంచి పిస్తోలు తీయబోతున్నాడు. ఇక ఆలస్యం చేస్తే ప్రమాదమని యుగంధర్ గోడకి ముందుకి ఆనుకుని రెండు కాళ్ళూ వెనక్కి పైకి ఎత్తి బలంగా తన్నాడు వెనక నిలుచున్న అతని మోకాలి చిప్పల మీద. మరుక్షణం ఒక గంతులో వెళ్ళి అతని చెయ్యి పట్టుకుని వెనక్కి నిలపెట్టి "పిస్తోలు వదిలెయ్యి. లేదా చెయ్యి విరిగిపోతుంది" అంటూ అతని చెయ్యి మెలిపెట్టాడు. ఆ యువకుడు యుగంధర్ బలానికి సాటికాడు. చేతిలో పిస్తోలు పట్టుకుని, యుగంధర్ వెనక నిలబడి ఆజ్ఞాపించినప్పటి ధైర్యం యిప్పుడు లేదు. నెప్పితో మూలుగుతూ పిస్తోలు వదిలేశాడు.

యుగంధర్ ఆ పిస్తోలు తీసుకుని జేబులో పెట్టుకుని "నీ పేరేమిటి?" అడిగాడు.

"మీనన్"

"పిస్తోలు వుంచుకోడానికి నీకు లైసెన్స్ వుందా?"

మీనన్ మాట్లాడలేదు.

"చెప్పు. చెప్పకపోతే ఎముకలు విరుగుతాయి" అంటూ పళ్ళు కొరుకుతూ. క్రూరంగా చూశాడు అతన్ని.

"ఏమిటి చెప్పాలి" అడిగాడు మీనన్.

"తోలు పెట్టె విషయం. డాక్టర్ మృత్యానందం సంగతి. రంగనాథం వీధిలో నీకు తోలుపెట్టె యిచ్చిన పచ్చచీర ఆడమనిషి విషయం."

మీనన్ బెదురుచూపులు చూస్తున్నాడు. ఎవరన్నా వచ్చి తనని రక్షిస్తారనే ఆశ యింకా వుంది అతనికి.

"నువ్వు మాట్లాడుతున్నది నాకేం అర్థం కావడంలేదు. నా యింట్లోకి వచ్చి, నన్ను బెదిరించి, నామీద చెయ్యి చేసుకున్నందుకు నీమీద పోలీసు కంప్లెయింట్ యిస్తాను" అన్నాడు మీనన్.

యుగంధర్ పకపకా నవ్వాడు. "తర్వాత కంప్లెంటు ఇవ్వవచ్చు. ముందు నేను అడిగిన ప్రశ్నలకి జవాబులు చెప్పు" అంటూ పిడికిలి బిగించి మీనన్ని యీ దవడా ఆ దవడా వాయించడం ప్రారంభించాడు.

మీనన్ కింద పడ్డాడు. యుగంధర్ బూట్ కాలితో అతని డొక్కలో తన్నాడు. మోకాళ్ళమీదా, మొహం మీద తన్నాడు. మీనన్ ఆ దెబ్బల బాధ ఓర్చుకోలేక మూలుగుతున్నాడు.

యుగంధర్ బూట్ కాలు పైకి యెత్తి "నీ మొహం పచ్చడి అవుతుంది. నాకు దయాదాక్షిణ్యాలు లేవు. దేశద్రోహులని యీ చేతులతో గొంతు నలిపి చంపేస్తాను" అన్నాడు పళ్ళు పటపట కొరుకుతూ.

యుగంధర్ కళ్ళల్లో క్రౌర్యం, మాటల్లో రౌద్రం చూసి మీనన్ పంచప్రాణాలు ఎగిరిపోయాయి.

"నేను దేశద్రోహిని కాను. మన దేశం బాగుపడాలనీ, తిండీ, బట్టా, ఇల్లూ లేని లక్షలాది భారతీయులు సిరిసంపదలతో సుఖపడాలనీ యిలా చేస్తున్నాను" అన్నాడు మీనన్.

"ఎలా చేశావు? వివరంగా చెప్పు" అడిగాడు యుగంధర్.

"ఆ తోలుపెట్టె ఆ స్త్రీ దగ్గర్నించి తీసుకుని మృత్యానందానికి యిచ్చాను. అంతే. నేనింకేమీ చెయ్యలేదు. ఆ తోలుపెట్టెలో ఏమున్నదీ నాకు తెలియదు."

"ఆ తోలుపెట్టె తీసుకుని మృత్యానందానికి యివ్వమని నీకు యెవరు చెప్పారు? ఎలా చెప్పారు. నాకు ఆ వివరాలు కావాలి."

"దాదాపు రెండు నెలల క్రితం నేను పార్టీ సమావేశానికి వెళ్ళినపుడు ఆ రాత్రి రహస్య సమావేశం వున్నదనీ, నన్ను రమ్మని మృత్యానందం చెప్పారు. రాత్రి పదిగంటలకి ఎడ్వర్డ్ యిలియట్సురోడ్ కార్నర్‌లో కాచుకోమన్నారు. ఒక వాన్ వచ్చింది. నేను వాన్ ఎక్కగానే నా కళ్ళకి గంతులు కట్టేశారు. తరువాత వాన్ బయలుదేరింది. నన్ను ఎక్కడికి తీసుకు వెళ్ళినదీ నాకు తెలియదు. ఓ పెద్ద గదిలో చాలామంది వున్నారు. మొగాళ్ళూ, ఆడవాళ్ళూ మేమెవరమూ ఒకళ్ళతో ఒకళ్ళం మాట్లాడకూడదని ముందే చెప్పారు. బహుశా ఒకళ్ళని ఒకళ్ళం కంఠస్వరం బట్టి గుర్తుపట్టకుండా వుండేందుకు అయివుంటుంది. ఎవరో అతను మమ్మల్నందరినీ వుద్దేశించి వుపన్యాసం యిచ్చాడు. విప్లవం తీసుకురావాలనీ, విప్లవం తీసుకురావాలంటే ముందు ప్రజలలో అసంతృప్తి, అలజడీ, అధికారుల యెడ నిరసన కలగజేయాలనీ చెప్పాడు. విప్లవం వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత విప్లవం తీసుకురావడానికి సహాయపడిన మాకందరికీ ప్రభుత్వంలో పెద్ద వుద్యోగాలు యిస్తామనీ చెప్పాడు. ఎవరెవరు పార్టీకీ, విప్లవం తీసుకు రావడానికీ యేం చెయ్యాలో ఎప్పటికప్పుడు తెలియజేస్తామనీ చెప్పాడు. మాకందరికీ రహస్యమైన గుర్తు ఒకటి యిస్తామనీ, ఆ గుర్తుని బట్టి విప్లవకారులు ఎవరో తెలుసుకోవచ్చునని అన్నాడు. మా కందరికీ రూపాయి బిళ్ళలాంటి వెండి బిళ్ళలు తలొకటీ యిచ్చాడు. ఆ బిళ్ళల మీద అంకెలున్నాయి. నా కిచ్చిన బిళ్ళమీద 143 అని వుంది. 144 గాని అంతకంటె పెద్ద అంకెవున్న బిళ్ళగాని చూపించిన మనిషి యిచ్చే ఆదేశాలు నేను పాటించాలని చెప్పాడు. ఎనిమిది రోజుల క్రితం ఒకతను వచ్చి 176 నెంబరు బిళ్ళ చూపించి ఫలానా టైంకి, ఫలానా వీధిలో పచ్చ చీర కట్టుకున్న ఆమెని కలుసుకోమని, ఆమె దగ్గర వున్న తోలుపెట్టె తీసుకుని డాక్టర్ మృత్యానందం డిస్పెన్సరిలో యివ్వమని చెప్పాడు. అప్పటినించీ అలా చేస్తున్నాను ప్రతిరోజూ" చెప్పాడు అతను.

"ఆ బిళ్ళ ఏదీ?" అడిగాడు యుగంధర్.

"నా జేబులో వుంది" అని తీసి యిచ్చాడు యుగంధర్‌కి.

"మీనన్! నీకు తల్లీ తండ్రీ, అన్నదమ్ములూ ఎవరూ లేరా? నువ్వు ఎక్కడ ఉద్యోగం చేస్తున్నావు?"

"మా వాళ్ళంతా కేరళలో వున్నారు. ది సదరన్ కమర్షియల్స్‌లో టైపిస్టుని."

"నువ్వు యెప్పుడైనా జైలుకి వెళ్ళావా?"

"లేదు"

"జైలుకి వెళ్ళి పదేళ్ళు వుండాలని వుందా?"

మీనన్ బెదురుతూ "ఎందుకు?" అడిగాడు.

"ఓ పర ప్రభుత్వంతో చేతులు కలిపి ప్రజలు ఎన్నుకున్న మన ప్రభుత్వాన్ని పడకొట్టడానికీ, హింసకీ, దౌర్జన్యానికీ తోడ్పడినందుకు శిక్ష పడుతుంది. నువ్వు అమాయకంగా ఇలా చేశావంటే ఎవరూ నమ్మరు. ఈ గూడుపుఠాణీ చేస్తున్న దుర్మార్గులని పట్టుకునేందుకు నువ్వు నాకు సహాయపడితే నువ్వు చేసి నేరానికి కొంత పరిహారం కలుగుతుంది" అన్నాడు యుగంధర్.

మీనన్ ఆలోచనలో పడ్డాడు. అయిదు నిమిషాల తర్వాత "నన్ను చంపేస్తారు" అన్నాడు గజగజ వొణుకుతూ.

"నీకు హాని కలగకుండా నేను కాపాడతాను."

"ఎలా?"

"పోలీస్ లాకప్‌లో పెట్టిస్తాను. అప్పుడు నిన్నెవరేమి చెయ్యగలరు చెయ్యగలరు. సహాయం చేస్తావా?"

మీనన్ తల వూపాడు గత్యంతరం లేక.

''ఇదే నా యిల్లు. చూశావుగా. ఇక నువ్వు వెళ్ళు'' అన్నది వనిత.

''లోపలికి రాకూడదా?'' అడిగాడు రాజు జాలిగా.

''ఆల్‌రైట్! రా'' అంటూ గేటు తెరిచింది. లోపలికి వెళ్ళి తలుపు తాళం తీసింది. కిటికీలు మూసి వుండడం వల్ల లోపల చీకటిగా వుంది.

''అక్కడే నిలబడ్డావేం? లోపలికిరా'' అన్నది వనిత రాజు వీపు మీద లాలనగా చెయ్యివేసి, లోపలికి తోస్తూ.

రాజు లోపల అడుగుపెట్టాడు. ఆమె తలుపు మూసేసి రాజుకి దగ్గరగా నిలబడ్డది ఆమె వూపిరి అతనికి తగులుతోంది. ఆమె వక్షస్థలం అతనికి రాసుకుంటోంది. రెండు చేతులూ అతని మెడచుట్టూ వేసి కావలించుకున్నది చేతుల్లో గట్టిగా బిగించింది. అతని పెదిమలని తన పెదిమలతో అదిమి పెట్టి, పళ్ళతో కొరికింది. రాజు చేతులు ఆమె భుజాల మీద వేసి ఆమెని తనలోకి లాక్కుంటున్నాడు. ''అప్పుడే - ఒదులు - కాస్త వూపిరి తీసుకోనీ. దీపం వేస్తాను. కిటికీలు తెరవనులే'' నవ్వుతూ అతని చేతులు విడిపించుకుని కలిపింది ఆమె.

రాజు నరాలన్నీ బిగతీశాడు. ఏం జరుగుతుంది? చప్పుడు చెయ్యకుండా ఒక అడుగు పక్కకి జరిగాడు.

''ఎక్కడున్నావు?''

''ఇక్కడే'' అంటూ చెయ్యి జాపి, వెంటనే యింకో అడుగు పక్కకి జరిగాడు.

రాజు జరిగేలోపున చేతికి గట్టి దెబ్బ తగిలింది. అప్రయత్నంగా 'అబ్బ' అన్నాడు. మరుక్షణం తలమీద, మెడమీద, మొహం మీద బరువైన దానితో రాజుని కొట్టింది ఆమె.

రాజుకి స్పృహ పోలేదు కానీ ఆ దెబ్బకి తల గిర్రున తిరిగింది. సరిగా నిలబడలేకపోయాడు. క్లిక్‌మన్న శబ్దం దీపం వెలిగింది గదిలో.

''నా రివాల్వర్‌కి సైలెన్సర్ వుంది. నిర్ధాక్షిణ్యంగా కాలుస్తాను. జాగ్రత్త. దూరం జరిగి రెండు చేతులూ పైకి ఎత్తి పెట్టు'' అన్నది.

ఆమె చెప్పినట్లు చెయ్యక తప్పింది కాదు రాజుకి. ఆ పరిస్థితిలో ఏం చేసినా అది సాహసం అనిపించుకోదు - తెలివి తక్కువ అవుతుంది.

''నువ్వు ఎవరు? నా వెంట ఎందుకు పడ్డావు చెప్పు?''

''చెప్పాగా! నీ అందం...''

''సరే'' అని తలుపు పక్కన వున్న కాలింగ్ బెల్ నొక్కింది.

అయిదు నిమిషాల తరువాత యిద్దరు బలశాలులు గదిలోకి వచ్చారు.

''ఇతన్ని ఆ కుర్చీకి వేసి కట్టెయ్యండి'' చెప్పింది వాళ్ళకి. తనకీ వనితకీ ఆమె చేతిలో వున్న పిస్తోల్‌కి అడ్డం వచ్చారు వాళ్ళు.

ఆ అవకాశం వినియోగించుకుని ఎదురు తిరుగుదామా, వద్దా అని ఆలోచిస్తున్నాడు రాజు.

## 20

''చాలా ప్రమాదం. ఒద్దు'' అన్నది కాత్యా.

"అవును. ప్రమాదమే. అయినా తప్పదు. ఇంకో మార్గం లేదు" అన్నాడు యుగంధర్. ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుకి మీనన్ని అప్పచెప్పాడు జాగ్రత్తగా చూసుకోమని. రాత్రి పదిగంటలకి ఎడ్వర్డు యిలియట్స్ రోడ్ కార్నర్‌కి వెళ్ళి ఆ వాన్‌లో ఎక్కి రహస్య సమావేశానికి వెళ్ళాలని యుగంధర్ ఆలోచన.

"ఆ నెంబరు వున్న బిళ్ళ మీవద్ద వున్నంత మాత్రాన మీరు మీనన్ అని వాళ్ళెందుకు అనుకుంటారు. ఆరడుగుల మూడు అంగుళాల పొడుగున్న మిమ్మల్ని చూసి మీనన్ అని యెవరూ అనుకోవడంలేదు."

"మీరు డిటెక్టివ్ యుగంధర్ అనీ తెలియనవసరంలేదు వాళ్ళకి. ఎవడో కొత్త మనిషి వాళ్ళ సమావేశానికి వచ్చాడని తెలియగానే హతమారుస్తారు. యుగంధర్! మీరు మేధావి. మీరు బలశాలి. మీరు ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లోంచి తప్పించుకున్నారు నిజమే. కానీ పాతిక, ముప్పైమంది శత్రువులనించి ఎలా తప్పించుకుంటారు? ఒద్దు. ఇంకేదైనా మార్గం ఆలోచిద్దాం. రాజుని రానివ్వండి. అతనేమైనా తెలుసుకున్నాడేమో" అన్నది కాత్యా.

యుగంధర్ నిట్టూర్పు వొదిలాడు. "పొద్దున్న వెళ్ళినవాడు రాత్రి ఎనిమిది గంటలయినా రాలేదు. టెలిఫోన్ కూడా చెయ్యలేదు. అంటే రాజు -"

"ప్రమాదంలో యిరుక్కున్నాడని ఎందుకు అనుకోవాలి? వాళ్ళ ఆచూకీ తెలుసుకుంటున్నాడేమో? టెలిఫోన్ చేసేందుకు వ్యవధి, అవకాశం లేదేమో" అని కాత్యా చెపుతుండగా టెలిఫోన్ మోగింది. యుగంధర్ రిసీవర్ తీసుకుని "యుగంధర్ హియర్" అన్నాడు.

"వెరీగుడ్. నెంబర్ 143 టోకెన్ మీ దగ్గర వున్నదిగదా!"

"ఎవరు మాట్లాడుతున్నది?"

"ఆ టోకెన్ తీసుకుని రాత్రి పది గంటలకి ఎడ్వర్డ్ యిలియట్స్ రోడ్ కార్నర్‌కి రండి, వాన్ వస్తుంది. వాన్ యెక్కండి. మీ అసిస్టెంట్ రాజుని చూడవచ్చు" క్లిక్‌మన్నది టెలిఫోన్.

యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు. "నేను నిశ్చయం చేసుకోవలసిన అవసరం లేదు" అన్నాడు.

ఎదురు తిరిగి ఏం ప్రయోజనం? ఏదో విధంగా పిస్తోల్ బారి నించి తప్పించుకున్నా, ఆ యిద్దరు బలశాలులకీ చిక్కకపోయినా తను పారిపోవలసిందేగా. పారిపోతే ఎలా? వీళ్ళెవరూ మళ్ళీ తనకి కనిపించరు. పరిశోధన మొదటికి వొస్తుంది అనుకున్నాడు రాజు.

ఆ బలశాలులు రాజు చేతులు వెనక్కి విరిచి కట్టేశారు.

"కూర్చో" అన్నది వనిత.

"థాంక్స్" అంటూ రాజు కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పు. ఎవరునువ్వు? సిటీ పోలీస్ డిపార్టుమెంటులో సి.ఐ.డి.వా, స్పెషల్ బ్రాంచి ఏజంటువా?"

రాజు నవ్వి "వనితా! నువ్వు అందంగా వున్నావని నీ వెంటపడ్డాను. నీకు అది కష్టంగా వుంటే పొమ్మను. అంతేకానీ రివాల్వర్‌తో బెదిరించడం, తాళ్ళతో కట్టెయ్యడం దేనికి?" అన్నాడు.

వనిత ఆ యిద్దరు బలశాలులనీ చూసి తలవూపింది.

వాళ్ళు రాజు జేబులు వెతికారు. చిల్లర డబ్బులు తప్ప వేరే ఏమీ లేవు.

"సులభంగా నిజం చెప్పేటట్లు లేడు. మన హెడ్ క్వార్టర్స్‌కి తీసుకువెళదాం" అన్నాడు ఒకడు.

"అవును. అదే మంచిది. ఇంజక్షన్ యియ్యి" అన్నది వనిత.

తనకి మార్ఫియా యింజక్షన్ యిస్తారని రాజుకి తెలుసు. తెలిసీ యేం చేయలేని స్థితి. తనని హెడ్ క్వార్టర్సుకి తీసుకు వెళతారుట. అంటే యీ ముఠా ముఖ్య కార్యాలయానికి తీసుకు వెళతారు. అంత అవకాశం తనకి కలిగినందుకు రాజు సంతోషించాడు.

అక్కడికి తీసుకు వెళ్ళిన తరువాత తను తప్పించుకోవడం ఎలా? ప్రాణాలతో బయటపడతాడా? ఇవేమీ రాజు ఆలోచించలేదు.

ఇంజక్షన్ యిచ్చిన పావుగంటకి రాజుకి స్పృహపోయింది.

సరిగా రాత్రి పదిగంటలకి యుగంధర్ యిలియట్స్ రోడ్ కార్నర్లో నిలబడ్డాడు ఒంటిగా. రోడ్ మీద రద్దీలేదు. ఎప్పుడో ఒకసారి ఓ కారు వెళుతోంది. పది నిమిషాల తరువాత ఒక నల్లని వాన్ వచ్చి యుగంధర్ ముందు ఆగింది.

"టోకెన్ ప్లీజ్" అన్నాడు వ్యాన్లో కూర్చున్న అతను.

యుగంధర్ టోకెన్ యిచ్చాడు.

"గెటిన్" అంటూ తలుపు తెరిచాడు అతను.

యుగంధర్ వ్యాన్ ఎక్కాడు. వ్యాన్ కదిలింది. తన పక్కన కూర్చున్న మనిషిని చూడటానికి యుగంధర్ తల తిప్పాడు.

"ఒద్దు. తిరగవద్దు" మెడమీద చల్లగా తగిలింది రివాల్వర్. వెనకనించి ఎవరో కళ్ళకి గంతలు కట్టాడు. వ్యాన్ జోరుగా వెళుతోంది. ఎంత స్పీడ్లో వెళుతున్నదో, యెటు వెళుతున్నదో తెలుసుకునే అవకాశం లేదు. దాదాపు అరగంట ప్రయాణం చేసిన తర్వాత వాన్ ఆగింది. ఎవరో వాన్ తలుపు తెరిచాడు.

"దిగండి" అంటూ ఎవరో చెయ్యి అందించాడు.

యుగంధర్ వ్యాన్లోంచి దిగాడు. కళ్ళకి గంతలు బాగా గట్టిగా కట్టడం వల్ల యేమీ కనిపించడంలేదు.

గాలికి చెట్ల ఆకులు రాసుకుంటున్న చప్పుడు నడిపించాడు. ఇంకో వాన్లోకి ఎక్కమన్నాడు. వ్యాన్ తలుపు వేస్తున్నప్పుడు అయిన చప్పుడు బట్టి అది యింకో వ్యాన్ అని తెలుసుకున్నాడు యుగంధర్.

దాదాపు గంట ఆ వ్యాన్లో ప్రయాణం చేశాడు. వ్యాన్ ఆగింది.

"దిగండి యుగంధర్" అంటూ చెయ్యి అందించారెవరో. ఆ మనిషి కంఠస్వరం విచిత్రంగా వుంది. నోట్లో ఏదో పెట్టుకుని మాట్లాడుతున్నట్లున్నది.

నేలమీద నడుస్తున్నాడు. సన్నసన్న రాళ్ళు వున్నట్లుంది. బూటు కాలు వాటిమీద పడినప్పుడు టప టప చప్పుడవుతోంది. నాలుగు మెట్లు ఎక్కాడు. గచ్చు నేలమీద నడుస్తున్నాడు. కుడివైపు తిప్పారు. మళ్ళీ ఎడం వైపుకీ, మళ్ళీ కుడివైపుకీ తీసుకు వెళ్ళారు. తలుపు తెరుస్తున్న చప్పుడయింది.

"వెళ్ళండి యుగంధర్" అన్నాడతను.

యుగంధర్ లోపల అడుగుపెట్టాడు. తలుపు మూసుకున్నది. గదిలో తనొక్కడేనా వుంది? వూపిరి బిగపట్టాడు కాసేపు. తన గుండె కొట్టుకోవడం తనకి వినిపిస్తోంది. అంత నిశ్శబ్దంగా వుంది. గదిలో యింకెవరూ లేరని నిశ్చయించుకుని కళ్ళకి కట్టిన గంతలు విప్పేసుకున్నాడు.

అది చాలా చిన్నగది. ఒక బల్లకాని, ఒక కుర్చీ కాని యింకే వస్తువు కానీ లేదు గదిలో. ఒక తలుపు, ఎత్తుగా వెంటిలేటర్. తలుపు ముట్టుకుని చూశాడు. ఉక్కు తలుపు. లోపల గడియలేదు, పిడిలేదు. నున్నగా వుంది. వాళ్ళెవరో వచ్చి తీసుకు వెళ్ళేవరకూ తాను వాళ్ళ బందీ.

''రాజుని చూడాలని వుంటే రండి'' అని వాళ్ళు టెలిఫోనులో చెప్పడం విని తను రావటం పొరపాటేమో? రాజు వీళ్ళకి చిక్కలేదేమో? చిక్కి వుంటే వీళ్ళ బందీ అయ్యాడన్నమాట కదా. రాజుకి సహాయం చేసి, రక్షించడానికి తనకి అవకాశమేమున్నది? తను తొందరపడ్డాడా? ఆలోచిస్తూ చీకట్లో గోడకి ఆనుకుని నిలబడ్డాడు యుగంధర్.

దాదాపు గంట గడిచిపోయింది. మొహం మీద వెలుగుపడేసరికి యుగంధర్ అటు చూశాడు

''దయచేసి చేతులు పైకి ఎత్తి వుంచండి మిస్టర్ యుగంధర్'' మాటలు వినిపించాయి.

తలుపు తీశారన్నమాట. చేతులు పైకి ఎత్తాడు.

''వెనక్కి తిరగండి.''

యుగంధర్ వెనక్కి తిరిగాడు. ఎవరో వచ్చి కళ్ళకి మళ్ళీ గంతలు కట్టారు. తరువాత యుగంధర్ జేబులు వెతికారు. మనిపర్సు, ఫౌంటెన్ పెన్, తాళం చెవులు తీసుకున్నారు.

''ఆశ్చర్యం. రివాల్వర్ లేకుండా వచ్చారా?'' ప్రశ్న వినిపించింది యుగంధర్‌కి.

''రివాల్వర్ తెచ్చి ప్రయోజనం ఏమిటి? మీరు తీసుకుంటారుగా'' అన్నాడు యుగంధర్.

''అవును. మీ వివేకానికి ముగ్ధుణ్ణవుతున్నాను. రండి. మీ అసిస్టెంటు రాజుని చూద్దురుగాని.''

చెయ్యి పట్టుకుని నడిపించారు మళ్ళీ. గచ్చు నేలమీద నడుస్తున్నాడు. కుడివైపూ, ఎడం వైపు నాలుగు మెట్లు ఎక్కడం, ఆరు మెట్లు దిగడం. అంతా గందరగోళంగా వుంది యుగంధర్‌కి. ఆ గదిలోంచి ఎక్కడికి ఎంత దూరం వెళ్ళినదీ వూహించలేకపోయాడు. మళ్ళీ ఓ గది తలుపు తెరుచుకుంది. నాలుగు అడుగులు వేసిన తరువాత ''కూర్చోండి యుగంధర్'' అంటూ కాళ్ళ వెనక్కి ఒక కుర్చీ తోశాడు. యుగంధర్ కూర్చున్నాడు.

''చేతులు వెనక్కి పెట్టండి యుగంధర్'' అని రెండు చేతులూ వెనక్కి విరిచి కట్టేశారు. తరవాత కళ్ళకి కట్టిన గంతలు విప్పారు.

ఢాం. ఢాం అని పిస్తోలు పేలింది. ఆ చీకటి గదిలో యుగంధర్ ఎదురుగా, పది గజాల దూరంలో ఒక చోట మాత్రం వెలుగు పడుతోంది. అది యుగంధర్ అసిస్టెంట్ రాజు కూర్చున్నచోటు. స్పాట్ లైటు వెలుగు రాజుమీద వేశారు. రాజు కుర్చీలో కూర్చున్నాడు. కుర్చీ వెనక తెల్లని పెద్ద అట్ట వుంది. రాజు తల ఆ అట్టకి ఆనించి వుంది. ఆ అట్టమీద ఒక్కొక్క అంగుళం దూరంలో రూపాయి బిళ్ళలంత చిల్లులున్నాయి.

రాజు కళ్ళు మూసుకుని వున్నాడు. చేతులూ, కాళ్ళూ కట్టేసి వున్నాయి. తాపీగా వూపిరి పీలుస్తున్నాడు.

''మిస్టర్ యుగంధర్ మీరూ, నేనూ రాజూ కాక తొమ్మిది మంది మనుష్యులున్నారు యీ గదిలో. ఆ తొమ్మిది మందీ వాళ్ళ ప్రావీణ్యత చూపిస్తారు మీకు, చూడండి. ఇందాక పిస్తోకు పేల్చింది నేను'' అన్నాడు. అతని గొంతు చాలా తగ్గుస్థాయిలో వుంది. ఇంగ్లీషులో మాట్లాడాడు. ఇంగ్లీషువాడు కాదు. భారతీయుడూ కాడు అని గ్రహించాడు యుగంధర్. అంతలో ఒకడు మనిషి స్పష్టంగా కనిపించలేదు, యుగంధర్ పక్కకి వచ్చి నిలబడి పిస్తోలు రాజు వైఉ గురిపెట్టి కాల్చాడు.

''చూశారా! గుండు మీ అసిస్టెంటు రాజుకి తగలలేదు. వెనక వున్న అట్ట చూడండి. ఆ అట్టకి చిన్న రంధ్రాలున్నాయి. గమనించారా! ఇతను పేల్చిన గుండు ఆ రంధ్రంలోంచి వెళ్ళిపోయింది. గురి అంటే అలా వుండాలి.''

ఇంకొకడు వచ్చి పిస్తోలు పేల్చాడు. అలా తొమ్మిదిమందీ పిస్తోళ్ళు పేల్చారు.

''గురి తప్పకుండా పిస్తోలు పేల్చగల వాళ్ళం పదిమందిమి యీ గదిలో వున్నామని ఒప్పుకుంటారా?''

''ఒప్పుకుంటాను. అయితే'' అడిగాడు యుగంధర్.

"ఇప్పుడు మీ కట్లు విప్పేస్తాను. మొరటు పనులు ఏమీ చేయకండి. మిమ్మల్ని పిస్తోలుతో పేల్చవలసిన పరిస్థితి కలగజేయకండి."

యుగంధర్ చేతి కట్లు విప్పేశారు. రాజుమీద మాత్రం వెలుగు పడుతోంది. ఇంకోవైపు వెలుగు లేదు. మిగతా వాళ్ళు ఎవరూ స్పష్టంగా కనిపించడం లేదు. అందరూ నల్లని బట్టలు వేసుకున్నారని మాత్రం తెలుస్తోంది.

"వెళ్ళి మీ అసిస్టెంటు రాజుని చూడండి" అన్నాడు.

యుగంధర్ రాజుకి సమీపంగా వెళ్ళాడు. "రాజూ!" పిలిచాడు.

రాజు పలకలేదు.

"మార్ఫియా యిచ్చాము. అంతకన్నా ఏమీ చెయ్యలేదు" అన్నాడు. యుగంధర్ తల వూపాడు. రాజుని పరీక్ష చేశాడు. రాజుకి ప్రమాదం యేం జరగలేదు. రాజు తల వెనక వున్న అట్టని చూశాడు. ఆ అట్టలో ఒక గుండు కూడా లేదు. వెనక్కి వెళ్ళి చూశాడు. ఒక పెద్ద పలక వుంది. వాళ్ళు కాల్చిన గుళ్ళు ఆ అట్టకున్న రంధ్రాలలోంచి వెళ్ళి ఆ పలకలో దిగబడ్డాయి.

"రండి యుగంధర్. మనం మాట్లాడుకుందాం" అన్నాడు వెనక నిలబడ్డ మనిషి.

యుగంధర్ వెనక్కి తిరిగాడు. రెండడుగులు వేసిన తరవాత ఎవరో యుగంధర్ భుజం మీద చెయ్యి వేశాడు.

"కళ్ళకి గంతలు కట్టాలి" అన్నాడు.

యుగంధర్ గంతలు కట్టించుకున్నాడు.

ఆ గదిలోంచి బయటికి నడవాలోకి వెళ్ళి యింకో గదిలోకి తీసుకెళ్ళాడు యుగంధర్ని.

"కూర్చోండి" అన్నాడు.

యుగంధర్ గంతలు విప్పేసుకున్నాడు.

"మీకు భయం లేదనుకుంటాను" నవ్వు వినిపించింది.

యుగంధర్ పక్కకి తిరిగాడు. చీకటిగా వున్న గదిలో ఒకచోట వెలుగుపడుతోంది. ఆ వెలుగులో కనిపించింది ఒక పుర్రె. ఆ పుర్రెకి కళ్ళున్నాయి. "భయంలేదు" అన్నాడు యుగంధర్.

"వెరీగుడ్ ఇది యిలా వుంచుకునే మాట్లాడదాం" అన్నాడు పుర్రెవేపు చూసి. "మీ అసిస్టెంటు రాజు ప్రాణాలు మా చేతుల్లో వున్నాయని ఒప్పుకుంటారా?" అడిగాడతను.

"రాజు ప్రాణాలేనా! నా ప్రాణాలు. అవీ మీ అరిచేతుల్లోనే వున్నాయి" అన్నాడు యుగంధర్.

"వెరీ గుడ్ మీరు ప్రజ్ఞావంతులు. డిటెక్టివ్‌లే కాదు. అహంకారం లేని గొప్పవారు. వాస్తవిక దృక్పథం గలవారు. ఐయామ్ వెరీ గ్లాడ్ టు మీట్ యు"

యుగంధర్ మాట్లాడలేదు. "మీకు కాని, రాజుకి కాని ఎటువంటి హాని మేము తలపెట్టలేదు. ఇప్పుడు కూడా మీకు ఎటువంటి హానీ చెయ్యాలన్న వుద్దేశ్యం లేదు. సురక్షితంగా మిమ్మల్ని మీ యింటివద్ద దింపుతాము. అందులో సందేహం యేమీలేదు. ఇప్పుడు మన చర్చ పర్యవసానం ఏమైనా."

"థాంక్స్" అన్నాడు యుగంధర్.

"కమాన్ యుగంధర్. రిలాక్స్. సిగిరెట్ తాగండి. బల్లమీద సిగరెట్ డబ్బావుంది. ఇవాళ 22వ తేది. 27వ తేదీవరకు మీరు మీ ఇంట్లోంచి కదలకండి. మా గురించి ఆరా తియ్యడానికిగాని, మమ్మల్ని పట్టుకునేందుకు గానీ ప్రయత్నించకండి. నేను కోరేది యింతే. 27వతేదీ రాత్రి మీ అసిస్టెంటు రాజుని మీకు సురక్షితంగా ఒప్పచెపుతాము."

"అంతేనా! ఇంకేమీ అడగరా?" అడిగాడు యుగంధర్.

"ఒక చిన్నపని. 27వతేదీన ఆ పని చెయ్యమని మిమ్మల్ని కోరుతాను."

"ఏమిటది"

"ఇప్పుడు చెప్పడానికి వీలులేదు. 27వతేదీ ఫోన్ చేసి చెపుతాను."

"మీ షరతులు నేను ఒప్పుకోకపోతే" అడిగాడు యుగంధర్.

"ఒప్పుకుంటారని ఆశిస్తున్నాను. మిమ్మల్ని మీ యింటి దగ్గర దింపుతాము. మీరు మీ ప్రయత్నం మానుకోకపోతే ఎల్లుండి పొద్దున్నకల్లా మీ అసిస్టెంటు శవం మీకు పంపిస్తాను."

"అలాగా! 27వతేదీ గడువు పెడుతున్నారు. ఆ రోజున మీరు రాజుని వొదిలేస్తారని ఏమిటి నిశ్చయం?" అడిగాడు యుగంధర్.

"27వ తేదీ తరవాత మాకు యీ రహస్యమూ, యీ ముసుగులూ అవసరం వుండవు. మీరు కాని, రాజు కానీ మాకు ఎటువంటి హానీ చెయ్యలేరు"

"నన్నూ, రాజునీ యిప్పుడే చంపేస్తే మీకు ఏ యిబ్బందీ వుండదు కదా! నేనేమీ చెయ్యకుండా వుండాలని షరతు పెట్టి, నన్ను వొదిలేసి తరవాత మీరు చిక్కుల్లో పడడం దేనికి?" అడిగాడు యుగంధర్ నవ్వుతూ.

అతనూ నవ్వాడు. "మీరు మమ్మల్ని యేమీ చెయ్యలేరు. వారం రోజులు కాదుకదా పదేళ్ళయినా మీరు మమ్మల్ని పట్టుకోలేరు. మాకు ఆ భయంలేదు. అందుకే మిమ్మల్ని వొదిలిపెడతాను. మీవల్ల మాకు ప్రయోజనం వుంటుంది. తరువాత మీలాంటివారు దేశానికి యెంతో అవసరం అవుతారని మీ ప్రాణాలని మేము గౌరవిస్తున్నాము."

"ఈ గదిలో మీరూ, నేనూ తప్ప యింకెవరూ లేరా?"

"లేరు. లేనంత మాత్రాన దౌర్జన్యం చెయ్యడానికి ప్రయత్నిచకండి. తలుపుకి వున్న అద్దంలోంచి యిద్దరు చూస్తున్నారు."

"27వ తేదీ యేం జరుగుతుంది? ఆ తర్వాత యీ దాపరికం, యీ ముసుగులూ అవసరం వుండవంటున్నారు. ఏం జరుగుతుంది?" అడిగాడు యుగంధర్.

"చెప్పను. చెప్పడానికి వీలులేదు. ఇప్పటికే మీకు చాలా చెప్పాను. ఇక వెళ్ళండి. మీమీద నాకున్న గౌరవం నిలబెట్టుకుంటారనీ, మీ ప్రాణాన్ని కాపాడుకుంటారనీ ఆశిస్తున్నాను."

## *21*

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది కాత్యా.

"27వ తేదీ తరవాత యీ రహస్యమూ, యీ ముసుగులూ అవసరం వుండదనీ, ఆ రోజు రాజుని వదిలేస్తామనీ చెప్పాడు. 27వ తేదీ యేం జరుగుతుంది. అదే ఆలోచిస్తున్నాను" చెప్పాడు యుగంధర్.

"ఈ ముఠా నాయకుడు చైనీస్ మనిషని మీ అనుమానమా?"

యుగంధర్ నవ్వి "అనుమానమేమీ లేదు. నిశ్చయంగా తెలుసు. రామానుజం, హీరాలాల్, మేజర్ రమాకాంత్, ఆర్డినెన్స్ ఫాక్టరీ యింజనీరు పార్థసారథి, పోలీస్ కమీషనర్ గిరి, వీళ్ళందరినీ తన చెప్పు చేతల్లో పెట్టుకున్నాడు. ఎందుకు? హీరాలాల్‌కి దొంగనోట్లు

యిచ్చి వాటికి బదులు మంచి నోట్లు తీసుకుంటున్నారు. అది తెలుస్తూనే వుంది. రామానుజం తను చేస్తున్న పరిశోధన పూర్తిచేశాడు. ఆ పరిశోధనా ఫలితం వాళ్ళకి యిచ్చాడా?" యుగంధర్ లేచి అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు.

"ఎంత ఆలోచించినా ఏమీ తెలియడంలేదు. వాళ్ళందరినీ విడివిడిగా కలుసుకుని అడగాలి. తప్పదు" అన్నాడు యుగంధర్.

"వాళ్ళు చెపుతారన్న నమ్మకం యేమిటి?"

"చెప్పించాలి - నయానో, భయానో."

"మీరు జోక్యం కలిపించుకుంటే రాజుని చంపేస్తామని చెప్పారుగా! అతను వాళ్ళ ఆధీనంలో వున్నాడు కదూ" అన్నది కాత్యా.

"కాత్యా అపరాధ పరిశోధన వృత్తిగా చేసుకున్న తరవాత రాజూ, నేను ఎన్నిసార్లు ప్రాణాలకి తెగించి అపాయాల్లోకి కళ్ళు తెరుచుకుని వెళ్ళలేదు. రాజుని చంపుతారేమోనని నేను, నన్ను చంపుతారేమోనని రాజు మా ధర్మం మానుకుని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే మాకు యీ వృత్తి యెందుకు?"

"అంటే రాజు ప్రాణాన్ని బలి యివ్వడానికి సిద్ధపడుతున్నారన్నమాట?"

యుగంధర్ బలవంతాన నవ్వు తెచ్చిపెట్టుకుని "నన్నూ చంపుతామన్నారు. చూద్దాం. బండార్కర్‌కి అర్జంట్ ట్రంక్‌కాల్ బుక్ చెయ్యి" చెప్పాడు యుగంధర్.

❦❦❦

సైంటిస్టు రామానుజం లాబరేటరి నించి యింటికి బయలుదేరాడు. అప్పుడు రాత్రి ఒంటిగంట అయింది. ఎప్పటిలా పాతికమైళ్ళ స్పీడున కారు తోలుతున్నాడు. రెండు మైళ్ళు వెళ్ళాక రోడ్‌కి అడ్డంగా ఎవరో నిలబడి వుండడం గమనించాడు. గుండె దడదడమన్నది. ఇదివరకు అర్ధరాత్రి ఆ రోడ్‌మీద దెయ్యం కనిపించడం జ్ఞాపకం వచ్చింది. మరుక్షణం నవ్వుకున్నాడు. అది దెయ్యం కాదని తెలిసిపోయింది. భయమెందుకు? కారు ఆపమని, చెయ్యి వూపుతున్నాడు. ఈ అర్ధరాత్రి నడిరోడ్ మీద తనని కలుసుకోవడం ఎందుకు? విసుగ్గా స్లోడవున్ చేశాడు. కారు ఆపగానే ఆ మనిషి పక్కకి చీకట్లోకి వెళ్ళిపోయాడు. నిమిషం తరువాత రామానుజం కారు దగ్గరకి వచ్చింది ఆ ఆకారం. ఆ ఆకారానికి తల లేదు. పుర్రె మాత్రం వుంది.

"ఏమిటి? ఇంకా యీ వేషం దేనికి?" అడిగాడు రామానుజం. ఆ ఆకారం ఏమీ మాట్లాడలేదు.

"ఇంకా రెండు రోజులు పడుతుందన్నానుగా తొందరెందుకు?" అన్నాడు రామానుజం.

అప్పటికీ ఆ ఆకారం మాట్లాడలేదు.

"మిస్టర్! ఎందుకు వచ్చావు? ఎందుకు నన్ను ఆపావు? త్వరగా చెప్పు. ఎలైస్ ఎలా వుంది? సుస్తీగా వుందా? రెండు వందల మినీబాంబులు, ఆ బాంబులు తయారు చేసే ఫార్ములా ఎల్లుండి యిస్తాను."

ఆ ఆకారం తలుపు తెరిచి కారులో రామానుజం పక్కన కూర్చున్నది.

"నేను అలిసిపోయి వున్నాను. ఏం కావాలో త్వరగా చెప్పి వెళ్ళు" అన్నాడు రామానుజం.

"మిస్టర్ రామానుజం. డిఫెన్స్ ఆఫ్ యిండియా ఆక్టు ప్రకారం మీరు నేరం చేశారు. దేశానికి ద్రోహం తలపెట్టారు. మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను."

"ఎవరు మీరు? నన్ను అరెస్టు చేయడం ఏమిటి?" ఖంగారుగా అడిగాడు రామానుజం.

కారులో రామానుజం పక్కన కూర్చున్న ఆకారం తలకి వున్న మాస్క్ తీసేశాడు. "నా పేరు యుగంధర్" అన్నాడు.

"ఎందుకు యిలా యీ వేషంలో వచ్చారు?"

"మీరు నిజం చెప్పడం లేదు కనుక నిజం తెలుసుకోవడానికి వచ్చాను."

రామానుజం తల స్టీరింగ్ వీల్ మీదకి వాల్చేశాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"ఆడదానిలాగా ఏడ్వక రామానుజం. ఏడ్చినంత మాత్రాన నీ మీద జాలి కలుగుతుందనుకోకు."

రామానుజం తల ఎత్తాడు. "ఆల్‌రైట్ అరెస్టు చెయ్యండి. నేను చెప్పవలసిందేమీలేదు" అన్నాడు.

"నువ్వు వుత్త ఫూల్‌వి రామానుజం. సైంటిస్టుగా నువ్వు గొప్పవాడివే కానీ నీకు యింకేమీ తెలియదు. నువ్వు నీ మాతృదేశానికి ద్రోహం చేసి నీ పరిశోధనా ఫలితాలు శత్రువులకి చెప్పినంత మాత్రాన నీ ఎలైస్ ప్రాణాలతో నీకు దక్కుతుందనుకున్నావా!? నీతో పని అయిపోగానే నీ ప్రాణమూ, నీ భార్య ప్రాణమూ గడ్డిపరకతో సమానం వాళ్ళకి."

"వాళ్ళు ఎలైస్‌నీ, మిగతా వాళ్ళనీ చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మనుష్యుల్ని చంపవలసిన అవసరం వుండదు."

"వాళ్ళ సిద్ధాంతాలు నీకు తెలియవు. నువ్వు ప్రభుత్వాన్ని మోసం చేసి, భయంవల్లో, డబ్బు ఆశవల్లో దేశ రక్షణ రహస్యాలు వాళ్ళకి చెపుతావు. రేపు యింకెవరన్నా నిన్ను భయపెడితే వీళ్ళ రహస్యాలు వాళ్ళకి చెపుతావు. నీలాటి పిరికి వాళ్ళమీద వాళ్ళకి గౌరవం వుండదు. నీలాటి వాళ్ళు వాళ్ళకి ఎప్పటికీ ముప్పే. అందుకే హతమారుస్తారు."

"నన్ను ఎందుకిలా భయపెడుతున్నారు మీరు?" అడిగాడు రామానుజం.

"నీ భార్య ఎలైస్ అంటే నీకు ప్రాణం. నిజమే. కానీ ఆ ఒక్క ప్రాణంకోసం దేశ క్షేమాన్ని, దేశ స్వాతంత్ర్యాన్ని అమ్మేస్తావా రామానుజం? ఎలైస్ లేకుండా నువ్వు బతకలేకపోతే ఆత్మహత్య చేసుకోవలసింది. అంతేగాని."

"యుగంధర్... చెప్పడం సులభంగాని -"

"అవును రామానుజం చెప్పడం సులభమే. మాతృదేశానికి సేవ చెయ్యాలని వుందని నువ్వు చెప్పావు. ఆ మాట చెప్పడం సులభమే. ఉద్యోగంలో చేరే ముందు రాజ్యాంగం మీదా, దేవుడి మీదా ప్రమాణం చేశావు. ప్రమాణం చెయ్యడం సులభమే రామానుజం. నీ భార్య ఏలైస్‌లా, నా అసిస్టెంటు రాజు కూడా వాళ్ళ బందీగా వున్నాడు. నేను యీ కేసు దర్యాప్తు మానుకోకపోతే రాజుని చంపేస్తామని చెప్పారు. రాజు నా కొడుకులాటివాడు. నాకు యీ ప్రపంచంలో ఆత్మీయుడు, నా ప్రాణానికి సమానమైన ప్రాణి, నా ప్రాణానికంటే నేను ఎక్కువ విలువ యిచ్చే ప్రాణం రాజుది. రాజుకోసం, రాజుని రక్షించడానికి నేను ఏమైనా చేస్తాను. ఏమైనా చేస్తానంటే యెంత డబ్బు అడిగినా యిస్తాను. నా ప్రాణం యివ్వమన్నా యిస్తాను. కానీ రామానుజం నా దేశం, నా తల్లితండ్రులు, నా తాత ముత్తాతలు జన్మించిన యీ దేశం, నా అక్కచెల్లెళ్ళు నా అన్నదమ్ములు అనుకునే మన ప్రజ నివసించే యీదేశం, మన పిల్లలు ఆ పిల్లల పిల్లలు నివసించవలసిన యీ దేశం - నా దేశం - నీ దేశం - మన దేశం ఐన యీ దేశానికి ద్రోహం చెయ్యను. రామానుజం, నా ప్రాణానికన్నా ఎక్కువగా చూసుకునే రాజు ప్రాణం బలియిస్తాను కాని మన దేశానికి ద్రోహం తలపెట్టను" అన్నాడు యుగంధర్ ఆవేశంతో.

అయిదు నిమిషాలు రామానుజం మౌనంగా వుండిపోయాడు. "నిజంగా రాజు వాళ్ళ బందీ అయ్యాడా?" అడిగాడు.

యుగంధర్ తల వూపాడు. "రాజునీ, ఎలైస్‌నీ, హీరాలాల్ కొడుకుని మిగతా వాళ్ళనీ కాపాడాలంటే వాళ్ళకి లొంగి పోకూడదు. 27వ తేదీలోగా శత్రువుల్ని పట్టుకుని వాళ్ళని రక్షించాలి" అన్నాడు యుగంధర్.

"మీరు పట్టుకోలేరు యుగంధర్. వాళ్ళు చాలా సమర్థులు."

"పట్టుకు తీర్తాను. నా సామర్థ్యం తక్కువది కాదు. నా బలం నైతిక బలం. విజయవంతంకాక తప్పదు."

"అయితే పట్టుకోండి. నేను అర్భకుణ్ణి."

"మీ సహాయమూ కావాలి."

"నో! నో!" అరిచాడు రామానుజం.

"పిరికివాడిలా మాట్లాడక. నీ ఎలైస్ చస్తే చస్తుంది. నువ్వూ, నేనూ చస్తే చస్తాము. మన దేశాన్ని రక్షించుకోడానికి ప్రయత్నం చెయ్యాలి. యుద్ధంలో ఎంతమంది చావడంలేదు. మనం ఛస్తే చస్తాం."

"యుగంధర్ నన్ను సందిగ్ధంలో పెట్టారు" అన్నాడు రామానుజం.

"సందిగ్ధమేమీలేదు. మీరు మీ ధర్మం ఆచరించండి."

అయిదు నిమిషాల తర్వాత రామానుజం యుగంధర్ చేతిలో చెయ్యి వేసి "చెప్పండి" అన్నాడు.

*22*

అప్పటికి వందసార్లు పరీక్ష చేసి వుంటాడు రాజు గోడలనీ, తలుపులనీ యెక్కడయినా చిన్న సందున్నదా అనీ, ఎలాగైనా ఆ గదిలోంచి తప్పించుకునేందుకు అవకాశం వుందా అనీ.

సన్నగా వున్నాయి గోడలు. ఉక్కుతలుపు. లోపలవైపు గడియ కూడాలేదు. ఆ గదిలో తనని బంధించి ఎన్నిరోజులైనదీ తెలియదు రాజుకి.

"కాఫీ, భోజనమూ, సిగిరెట్లు అన్నీ యిస్తున్నారు. రాజున్న గది పక్కన చిన్న నీళ్ళ గది వుంది. బయటికి వెళ్ళడానికి వీలులేదు కాని అన్ని సదుపాయాలూ వున్నాయి రాజుకి. అతని గదిలోకి ఎవరూ రారు. ఎవరూ మాట్లడరు అతనితో. తలుపు పక్కన గోడలో ఒక మాయ తలుపున్నది. దాన్ని బయటినించి తెరిచి, ఆ చిన్న గూడులాంటి తలుపులోంచి అతనికి యివ్వదలచుకున్నది అందిస్తారు. రాజు పలకరించినా అందించేవాళ్ళు మాట్లాడరు.

తను యింకా యీ గదిలో ఎన్నాళ్ళు బందీగా వుండాలో తెలియదు. ఎందుకు తనని వీళ్ళు యిలా మేపుతున్నారో అంతకన్నా తెలియదు. తను అక్కణ్ణించి తప్పించుకునేందుకు మార్గమేమైనా వుందా అని ఆలోచించి ఆలోచించి రాజు మెదడు వేడెక్కిపోయింది. బోనులో పులిలా ఆ గదిలో తిరుగుతున్నాడు.

తలుపు దగ్గర చప్పుడయి అటు తిరిగాడు. "మిస్టర్ రాజు కదలకుండా అక్కడే నిలుచో. నీతో మాట్లాడ్డానికి వచ్చాను. అనవసరంగా అఘాయిత్యానికి దిగి నీ ప్రాణానికి ముప్పు తెచ్చుకోక" అన్నాడు యెవడో.

ముగ్గురు వచ్చారు గదిలోకి. ముగ్గురూ నల్లని బట్టలు వేసుకున్నారు. మొహాలకి ముసుగులు కటుకున్నారు. ముందున్న అతను పొట్టిగా, లావుగా వున్నాడు. అతనికి చెరొక పక్కనా యిద్దరు బలశాలులు నిలుచున్నారు. తలుపు మూసుకున్నది. అంటే బయట యింకెవరో వున్నారు

"ఊఁ! మాట్లాడండి" అన్నాడు రాజు.

"మీకూ, యుగంధర్‌కీ ఒకర్ని ఒకరు పోల్చుకునే గుర్తు యేదైనా వుందా?"

"ఎందుకు?" అడిగాడు రాజు.

"మిస్టర్ రాజూ! నేను వుత్త బెదిరింపు మాటలు మాట్లాడను. చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నాను. మేము తలపెట్టిన కార్యక్రమం విజయవంతం కావాలంటే కొంతమంది చావక తప్పదు. అవసరమైతే మీ ప్రాణాలు తీసేస్తాము. జాలి, పాపభీతి, యిటువంటివి ఏవీలేవు మాకు."

"అయితే?" అడిగాడు రాజు.

"మీరు చచ్చిపోయేదీ, బతికి వుండేదీ మీ చేతుల్లోనే వుంది. యుగంధర్ చేతిలోనూ వుంది. యుగంధర్‌తో కొన్ని విషయాలు మీరు మాట్లాడాలి. మీరే మాట్లాడుతున్నట్లు ఆయనకి నిశ్చయంగా తెలియాలి. అందుకే మీకూ యుగంధర్‌కీ గుర్తు యేదైనా వున్నదా అని అడిగాను."

"ఉన్నది. మీకు చెప్పను."

"నాకు చెప్పనవసరం లేదు. మీరు మాట్లాడాలి. రండి" అన్నాడతను. ఆ యిద్దరు బలశాలులూ రాజుని చెరొక భుజమూ పట్టుకున్నారు.

## *23*

ముఖ్యమంత్రి చేతి గడియారం చూసుకున్నాడు. రాత్రి పదిగంటలయింది. ఆయన పక్కన హోం మంత్రి. ఎదురుగా ఐ.జి ఆఫ్ పోలీస్, ఆయన పక్కన స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్ కూర్చుని వున్నారు.

"సరిగా పది గంటలకి వస్తానన్నారు యుగంధర్. ఇంకా రాలేదే" అన్నాడు ముఖ్యమంత్రి.

"వస్తారు. తప్పకుండా వస్తారు" బండార్కర్ అంటుండగా తెల్లని పాంటు, తెల్లని కోటు, మడత టోపీ పెట్టుకుని ట్రేలో టి కప్పులు పెట్టుకుని ఒకతను గదిలోకి వచ్చాడు. కప్పులలో టీ పోసి అందరికీ యిస్తున్నాడు.

"ఆయన ఏదైనా చిక్కుల్లో పడ్డారేమో" అన్నాడు హోం మంత్రి.

"లేదు. నేనేమీ చిక్కుల్లో పడలేదు. చిక్కుల్లో పడ్డది మన దేశం."

అందరూ ఆ మాట్లాడుతున్న మనిషి వైపు చూశారు. టీ కప్పులు తెచ్చిన మనిషి యుగంధర్.

"ఇదేమిటి యుగంధర్! ఈ వేషం యేమిటి?" అడిగాడు ముఖ్యమంత్రి.

"తప్పలేదు. శత్రువులు అందర్నీ ఓ కంట కనిపెడుతున్నారు. నేను మిమ్మల్ని కలుసుకున్నానని శత్రువులకి తెలిస్తే ప్రమాదం. అందుకని యీ వేషంలో వచ్చాను" అంటూ యుగంధర్ ఐ.జీ.కి, బండార్కర్‌కీ మధ్య వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"దేశానికి ప్రమాదం అన్నారు. అదేమిటో చెపుతారా?" అడిగాడు ముఖ్యమంత్రి.

"ఇవాళ రాత్రి ఒంటిగంటకి యీ రాష్ట్రం శత్రువుల ఆధీనం అవుతుంది."

"ఏమిటి శత్రువుల ఆధీనమవుతుందా? ఎవరా శత్రువులు. ఈ రాష్ట్రాన్ని ఎలా వాళ్ళు తమ ఆధీనంలోకి తీసుకుంటారు?" అడిగాడు ముఖ్యమంత్రి.

"చైనా గూఢచారి ఒకడు యీ దేశం వచ్చి కొన్నాళ్ళు ప్రయాసపడి, ఓ పథకం ఆలోచించాడు. ప్రజా విప్లవం అన్న సాకుతో యీ రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలిగించి, అధికారం చేబట్టడానికి పథకం వేశాడు. రాత్రి ఒంటిగంటకి దెయ్యమని భ్రమ కలిగించి కొంతమందిని ఎత్తుకుపోయారని మీకు తెలుసు. అది దెయ్యం కాదనీ, ఎవరో మనుష్యులే చేశారనీ నేను యిదివరకే మీకు ఋజువు చేశాను. రామానుజం చేస్తున్న పరిశోధన గురించి మీకెవరికీ తెలియదు బండార్కర్‌కి తప్ప. చెపుతాను వినండి. గోలీకాయంత చిన్న బాంబులు తయారు చెయ్యడానికి రామానుజం తన లాబరేటరీలో కృషి చేస్తున్నాడు. ఆ చిన్న ఫైరింగ్ గన్‌లో ఒక్కసారే పది బాంబులు పెట్టవచ్చు. ఒక బాంబు తర్వాత యింకో బాంబు పిస్తోల్ గుళ్ళలా పేల్చవచ్చు. ఫర్లాంగు దూరం వరకూ వెళుతుంది ఆ బాంబు. అది దేనికైనా తగలగానే పేలుతుంది. అది పేలినచోట ఓ వంద గజాల విస్తీర్ణంలో ఏమున్నా శిథిలమై పోతుంది. అంతేకాక చుట్టుపక్కల మంటలు చెలరేగుతాయి. పర్వత ప్రాంతాలలో శత్రువులతో గొరిల్లా యుద్ధం చేయడానికి వుపకరిస్తుంది. రామానుజం యీ బాంబునీ ఫైరింగ్

గన్‌నీ తయారు చేశాడు. పరిశోధన ముగిసింది. ప్రయోగానికి కొన్ని బాంబులు, ఫైరింగ్ గన్నులూ రెండు వందలు తయారుచేసి ఇవాళ రాత్రి ఒంటిగంటలోగా తమ కివ్వాలని రామానుజానికి చెప్పారు. రామానుజం ఒప్పుకున్నాడు - ఒప్పుకోకపోతే అతని భార్యని చంపేస్తామని బెదిరించేటప్పటికి."

"గుడ్‌గాడ్! ఎంత ఘోరం. రామానుజం లాబరేటరీలోంచి పూచిక పుల్లకూడా బయటికి పోకుండా స్పెషల్ బ్రాంచి వాళ్ళు ఎందుకు జాగ్రత్తపడరు" అన్నాడు హోం మంత్రి.

"ఆ జాగ్రత్త నేను తీసుకున్నాను. రామానుజం మొదట్లో శత్రువులకి లొంగిపోయి ఆ బాంబులు, ఫైరింగ్ గన్నులూ యిస్తానని ఒప్పుకున్నా, తరువాత తన ధర్మం తెలిసొచ్చి మనతో సహకరించాడు. అతను శత్రువులకి యిచ్చే బాంబులు చిన్న టపాకాయులు లాంటివి, పెద్ద చప్పుడు అయినా నిప్పురాదు. ఎవరికీ హానీ జరగదు."

"థాంక్ గాడ్" అన్నాడు ముఖ్యమంత్రి.

"ఈ ప్రభుత్వ పాలనలో డబ్బున్న వాళ్ళు యింకా డబ్బున్న వాళ్ళవుతున్నారనీ, బీదలు యింకా బీదవాళ్ళవుతున్నారనీ, సమాన సంపదా, సమాన భోగమూ అందరికీ వుండాలంటే విప్లవం తీసుకురావాలనీ బోధించి ఎంతమందో యువతీ యువకుల్ని వాళ్ళ ముఠాలో చేర్చుకున్నారు. ఓ పర ప్రభుత్వంతో చేతులు కలిపి, మాతృదేశానికి ద్రోహం చేస్తున్నామని ఆ యువతీ యువకులు దాదాపు రెండు వేలమంది చేరారు వాళ్ళ ముఠాలో. వాళ్ళ కార్యకలాపాలకి డబ్బు కావాలికదా. చైనాలో మన నోట్లలాంటి నోట్లు అచ్చు వేయించి తెచ్చాడు ఆ గూఢచారి. కానీ ఆ నోట్లు తన ముఠా వాళ్ళకి యిస్తే, వాళ్ళలో యెవరైనా పట్టుపడితే అతని పథకమే తారుమారవుతుంది. అందుకని హీరాలాల్ కొడుకుని ఎత్తుకుపోయారు. అతన్ని బెదిరించి దొంగనోట్లు యిచ్చి అతని దగ్గర్నుంచి మంచి నోట్లు తీసుకుంటున్నారు. ఆ మంచి నోట్లే తన ముఠా మనుష్యులకి యిస్తున్నాడు. తన కొడుకు కోసం ఎంత డబ్బయినా యివ్వడానికి హీరాలాల్ సిద్ధంగా వున్నాడు. దొంగనోట్లు తన బాంకుల ద్వారా, తన వ్యాపార సంస్థల ద్వారా చెలామణి చేస్తాడని ఆశించాడు ఆ గూఢచారి. కానీ మంచి నోట్లు ఎన్నయినా యిస్తున్నాడు కానీ దొంగనోట్లు చెలామణి చెయ్యలేదు. హీరాలాల్ విషయం యిది. ఇక మేజర్ రమాకాంత్ విషయం. మేజర్ రమాకాంత్ బారక్స్‌లో చాలా కలుపుగోలు మనిషి. అతనంటే వాళ్ళ కాంప్‌లో అందరికీ చాలా ఇష్టం. మేజర్ రమాకాంత్ ప్రియురాల్ని ఎత్తుకుపోయి అతన్ని తమ చెప్పు చేతల్లో పెట్టుకున్నారు. రమాకాంత్ ద్వారా శత్రువులు సాధించదలచుకున్నది యిది - ఈ రాత్రి పదకొండు గంటలకి రమాకాంత్ ఒక పార్టీ యిస్తున్నాడు. శత్రువులు యిరవై అయిదు మంది యువకుల్ని బారక్సులోకి తీసుకువెళతారు. ఇరవై మంది ఆడవేషం వేసుకున్న మొగాళ్ళు, అయిదుగురు ఆడవాళ్ళు. లోపలికి వెళ్ళిన తర్వాత ఆ యిరవై అయిదుగురూ పార్టీలో వున్న సైనికోద్యోగులని బందీలుగా చేస్తారు. తర్వాత ఏరియా కమాండింగు ఆఫీసర్‌ని, మిగతా పెద్ద సైనికోద్యోగుల్ని బందీలు చేస్తారు. ఒకడు ఆర్మీ బిల్డింగ్ మేడమీదికి వెళ్ళి రామానుజం యిచ్చే ఆయుధం పట్టుకుని కూర్చుంటాడు. కమాండింగ్ ఆఫీసర్ స్థానే స్థానికులు యేం చెయ్యాలో చెపుతారు. అతను చెప్పినట్లు సైనికులు వినకపోతే మేడమీదనించి బారక్సు మీద బాంబులు వేసి సైనికులందరినీ చంపేస్తారు. ఇది రాత్రి ఒంటిగంటకి జరగబోయేది" చెప్పాడు యుగంధర్.

ముఖ్యమంత్రి మొహం పాలిపోయింది.

"మేజర్ రమాకాంత్‌తో మాట్లాడాను. తన ప్రియురాలి మీద ప్రేమవల్ల మొదటా అతను శత్రువులకి లొంగిపోయినా తర్వాత తన తప్పు తెలుసుకున్నాడు. శత్రువుల పథకం పారదు. ఆ ఇరవై అయిదు మందీ లోపలికి వెళ్ళగానే మేడమీదికి వెళ్ళే మనిషిని వెళ్ళనిచ్చి వాళ్ళందరినీ బందీలు చేస్తాడు. ఆ భయం ఏమీలేదు" అన్నాడు యుగంధర్.

"ఇంతేనా! ఇంకేమైనా చేస్తున్నారా?" అడిగాడు హోం మంత్రి.

"ఆర్డినెన్స్ యింజనీరు పార్థసారథి కూతుర్ని యెత్తుకుపోయి, అతన్ని బెదిరించి వాళ్ళు సాధించినదేమిటో చెపుతాను. ప్రతి సంవత్సరము యీ నెలలో పోలీస్ వాళ్ళ ఆయుధాలన్నీ మరమ్మత్తుకీ, సర్వీసింగ్‌కీ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి వస్తాయి. పాతవాటి బదులు కొత్తవి యిస్తారు. కొత్తవి పరీక్ష చేసి మంచి కండిషన్‌లో వున్నదీ లేనిదీ చూసి యిచ్చేది పార్థసారథి. అలా వాటిని తనిఖీ చేస్తున్నప్పుడు వాటి స్ప్రింగ్సు, లాక్స్ చెడగొట్టి పనికిరానివిగా చేసి యివ్వమని పార్థసారథిని శత్రువులు ఆజ్ఞాపించారు. శత్రువుల మాట వినకపోతే తన కూతురి ప్రాణం తీస్తారు. పార్థసారథి శత్రువులు చెప్పినట్లు చేశాడు."

"గుడ్ గాడ్! అయితే ఇప్పుడు పోలీస్ స్టేషన్లలో వున్న ఆయుధాలన్నీ పనికిరానివన్నమాట" అన్నాడు హోం మంత్రి.

"నో నో పార్థసారథికి పరిస్థితి నచ్చచెప్పిన తర్వాత అతను నాకు నిజం చెప్పాడు. పనికిరాని ఆయుధాలు పంపుతున్నట్లు నటించాడు గాని నిజానికి పనిచేసే కొత్త ఆయుధాలే పంపాడు. ఐ.జి.కీ, నాకూ తప్ప యీ విషయం యింకెవరికీ తెలియదు. హోంమంత్రి చిన్నగా దగ్గి "అడగడం మరిచిపోయాను. ఈ సమావేశానికి కమీషనర్ గిరిని యెందుకు పిలవలేదు?" అన్నాడు.

"పోలీస్ కమీషనర్ గిరి కొడుకు రమేష్‌ని కూడా శత్రువులు యెత్తుకుపోయారని మీరు మరిచిపోయారా" అని గిరిని కలుసుకోవడము, తనకీ ఆయనకీ జరిగిన సంభాషణ వివరంగా చెప్పాడు యుగంధర్.

"కమీషనర్ గిరి ద్వారా శత్రువులు యేం సాధించదలచారో, ఆయన్ని యేం అడిగారో నాకు తెలియదు. నేను మళ్ళీ ఆయన్ని కలుసుకోలేదు" చెప్పాడు యుగంధర్.

"యుగంధర్ గిరి కూడా శత్రువులకి లొంగిపోయాడా! వాట్ ఏ షేమ్. నాకు ఎందుకు చెప్పలేదు? అరెస్ట్ చేయించేవాణ్ణి" అన్నాడు ఐ.జి.

"తొందరపడకండి, గిరిని అరెస్టు చేసినంత మాత్రాన ప్రయోజనం యేమిటి? ఈ రాత్రి వాళ్ళ పథకం జరగకుండా ఆపాలి. కుట్రదారులని పట్టుకోవాలి. గిరి శత్రువులకి లొంగిపోలేదనీ, శత్రువులని పట్టుకునేందుకు తనో పథకం ఆలోచించాడనీ నేను అనుకుంటున్నాను. మీరు డివిజన్ రెండు పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి యీ రాత్రి జరగవలసిన కార్యక్రమం గురించి ఆదేశాలేమైనా వచ్చాయా అని అడగండి" చెప్పాడు యుగంధర్.

వెంటనే ఐ.జి ఆఫ్ పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

"ఇన్‌స్పెక్టర్ శామ్యూల్ హియర్."

"ఐ.జి స్పీకింగ్. ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చాయా?"

"వచ్చాయి సార్."

"ఒకసారి చెప్పండి. సరిగా ఫాలో అయారో, లేదో తెలుసుకోవాలి."

"సరిగా రాత్రి పన్నెండు గంటల నలభై నిమిషాలకి ఒక రైటర్‌ని మాత్రం స్టేషన్‌లో వుండనిచ్చి మిగతా యిరవై నలుగురు కానిస్టేబుల్స్, ఇద్దరు సార్జెంట్లు, ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్ వాన్‌లో వెళ్ళిపోవాలి. ఆయుధాలన్నీ నా గదిలో వొదిలేసి వెళ్ళిపోవాలి."

ఐ.జి మొహం పాలిపోయింది. "ఒక క్షణం" అని రిసీవర్ మూతి మీద చెయ్యి విప్పి ఆ సంగతి యుగంధర్‌కి చెప్పాడు. "కమీషనర్ గిరి యింత ద్రోహం చేస్తాడని అనుకోలేదు. కొడుకు మీద ప్రేమ వుండవచ్చు కానీ దేశాన్ని శత్రువులకి అప్పగిస్తాడా! చైనాకీ మనకీ జరిగిన యుద్ధంలో పాకిస్థాన్‌కీ మనకీ జరిగిన యుద్ధంలో ఎంతమంది యువకులు మరణించలేదు? దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆ యువకులూ ఆ యువకుల తల్లిదండ్రులూ గిరికి ఎందుకు జ్ఞాపకానికి రాలేదు. తన కొడుకు బాగుంటే చాలా?" అన్నాడు.

**"ప్లీజ్ యింకేమైనా** ఆదేశాలు వచ్చాయేమో అడగండి" చెప్పాడు యుగంధర్.

"ఎస్, ఇన్‌స్పెక్టర్. తర్వాత?" అడిగాడు ఐ.జి.

"వాన్ ఎక్కి వెళ్ళిపోయిన వాళ్ళు ఒంటి గంటకి పది నిమిషాలుందనగా వెనక వీధిలోకి వెళ్ళి, వాన్ దిగి, గోడ దూకి, రహస్యంగా పోలీస్ స్టేషన్‌లోకి రావాలి. వీధిలో నిలబడి ఎవరైనా చూస్తూ వుంటే వాళ్ళకి కనిపించకూడదు. స్టేషన్‌లోకి వెళ్ళి తలుపుల వెనక, కిటికీల పక్కన బల్ల మూలల్లో నిలుచోవాలి. ఒంటి గంటకి పదినిమిషాలుందనగా వెనక వీధిలోకి వెళ్ళి, వాన్ దిగి, గోడ దూకి, రహస్యంగా పోలీస్ స్టేషన్‌లోకి రావాలి. వీధిలో నిలబడి ఎవరైనా చూస్తూ వుంటే వాళ్ళకి కనిపించకూడదు. ఒంటి గంటకి కొంతమంది స్టేషన్‌లోకి వచ్చి రైటర్ని పిస్తోలు చూపించి బెదిరిస్తారు. సరిగా ఆ సమయానికి మేము వాళ్ళ మీద పడి వాళ్ళని పట్టుకుని లాకప్‌లో పెట్టాలి. తరువాత ఏం చేయాలో ఛీఫ్ కమీషనర్ యిన్‌స్ట్రక్షన్ యిస్తామన్నారు" చెప్పాడు యిన్‌స్పెక్టర్.

ఐ.జి యీ విషయం చెప్పగానే యుగంధర్ నిట్టూర్చాడు. "ఒక ఉన్నత పోలీసు ఆఫీసర్ అందులోనూ గొప్ప సర్వీసు రికార్డు వున్న గిరిలాంటి ఉన్నత పోలీసు ఉద్యోగి పిరికివాడయిపోయి, శత్రువులకి లొంగి, దేశ ద్రోహం తలపెట్టాడంటే నా గుండె కుమిలిపోయింది. మన దేశానికి చెడ్డరోజులు వచ్చాయనుకున్నాను. ఇప్పుడు నా గుండె బరువు ఎంతో తగ్గిపోయింది. గిరి శత్రువులకి లొంగిపోలేదు. లొంగినట్లు నటిస్తూ వాళ్ళ పథకం తారుమారు చెయ్యడానికి తన ప్రయత్నం తను చేశాడన్న మాట" అన్నాడు యుగంధర్.

"యుగంధర్ నాకు ఒక చిన్న సందేహం కలుగుతోంది. ఈ శత్రు గూఢచారి వేసిన పథకం విజయవంతమయినా అంటే పోలీస్ స్టేషనలన్నీ వాళ్ళు హస్తగతం చేసుకున్నా, మిలటరీ బారెక్కు వాళ్ళ ఆధ్వర్యంలోకి పోయినా, నన్నూ, నా సహచరులైన మిగతా మంత్రులనీ బందీలు చేసినా, ఎంతకాలం యీ రాష్ట్రం వాళ్ళ చేతుల్లో అట్టే పెట్టుకోగలరు? కేంద్ర ప్రభుత్వం లేదా? క్షణాల మీద దేశంలో మిగతా ప్రాంతాలనించి సైనికుల్ని పంపరా! ఎంతకాలం పడుతుంది శత్రువుల్ని పట్టుకునేందుకు. చైనాది ఫూలిష్ పథకం కదూ!" అన్నాడు ముఖ్యమంత్రి.

యుగంధర్ పెదిమ విరిచాడు. "రైలు స్టేషన్, విమానాశ్రయం, రేడియోస్టేషన్ అన్నీ శత్రువుల హస్తగతం అవుతాయి అనుకోండి. కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని ఎలా యిక్కడ దింపుతుంది? యుద్ధానికి వస్తున్నట్లు సైన్యం తరలి రావాలి. ఆలోగా యిక్కడి ప్రజలు ప్రభుత్వం మీద తిరుగుబాటు చేశారనీ, ప్రజా ప్రభుత్వం స్థాపించారనీ ప్రచారం చేసి యీ రాష్ట్రం కేంద్రంలోంచి విడిపోయిందనిపించి, ఎవడో వాళ్ళ మాట వినే అతన్ని ముఖ్యమంత్రిగా నియమించి, ఆ ముఖ్యమంత్రి చైనా సైనిక సహాయం కోరాడని చైనా సైన్యాలని దింపుతాడు మన ఒడ్డున. ఇది సముద్రతీరాన వున్న పట్టణమని మరిచిపోకండి. అప్పుడు మన గడ్డమీద మనం చైనీస్ సైన్యంతో యుద్ధం చెయ్యాలి. మన సైనికులు మన పట్టణం మీద బాంబులు వెయ్యాలి. అసలే ప్రతి చిన్న విషయానికీ తగాదాపడి ఐకమత్యం పోగొట్టుకుని యీ నది నాది, యీ కొండ నాది, యీ వంద గజాల భూభాగం మా రాష్ట్రానికి చెందినది, మా రాష్ట్రంలో పండినది మేమే తినాలి అంటూ విభేదాలు పెంచుకుని రాజకీయాలు కలుషితం చేసుకుంటున్నాం. అధికార దాహంతో మత్తెక్కి వున్నారు రాజకీయ వేత్తలు. ఎవరు ఎటు తిరుగుతారో, ఏయే రాష్ట్రాలు యీ అదను చూసుకుని కేంద్ర ప్రభుత్వానికి ఎదురు తిరుగుతాయో యెవరు చెప్పగలరు? అత్యవసర పరిస్థితులతో భారతజాతి విభేదాలు విస్మరించి ఏకమై శత్రువులని ఎదుర్కుంటుందన్న నమ్మకం వుందనుకోండి నాకు. ఒకవేళ జాతి, మత, భాషా, రాష్ట్ర విభేదాల వల్లా, స్వార్థంతో అవివేకంగా కొంతమంది నాయకులు తప్పటడులు వేస్తే, అదే ప్రమాదం" అన్నాడు యుగంధర్.

ముఖ్యమంత్రి తల ఊపాడు. "అవును యుగంధర్ మీరు చెప్పింది నిజమే. ఈ అయిదేళ్ళలో మనం ఐక్యత కోల్పోయాం. దేశం విచ్ఛిన్నం కావటానికి విత్తులు నాటుతున్నాము. రాష్ట్రప్రభుత్వాలు పటిష్టంగా లేవు. రాజకీయవేత్తలు ప్రజల బాగోగుల గురించి శ్రద్ధ

తీసుకోవడం లేదు. తమకి అధికారం ఎప్పుడు ఎలా వస్తుందా అని మంతనాలు ఆడుతూ కాలం వృధా చేస్తున్నారు. రాజకీయాలలో నీతి లేకుండా పోయింది. అందుకే యీ చైనా గూఢచారికి యింత ధైర్యం వచ్చింది. ఒక రాష్ట్రంలో తిరుగుబాటు వచ్చిందని ప్రచారం చేస్తే మిగతా రాష్ట్రాలలో కూడా తిరుగుబాట్లు వస్తాయని ఆశ కలిగి వుంటుంది. ఇప్పుడు యీ రాత్రి మన రాష్ట్రానికి కలగబోయే ప్రమాదం మీరు తప్పిస్తారని నాకు నమ్మకం వుంది. కానీ అది చాలదు. దేశమంతటా, దేశంలో అందరికీ తెలియాలి. ఎటువంటి ప్రమాదంలోంచి మనం బయటపడినదీ, పరిస్థితులు యిలాగే వుంటే దేశానికి ముందు ఎంతో ప్రమాదమనీ'' అన్నాడు.

యుగంధర్ నవ్వాడు. ''అది మీ బాధ్యత. మీరు రాజకీయ వేత్తలు. ఇతర రాజకీయవేత్తలతో సంప్రదించవలసింది మీరు. టయిం అవుతోంది. నేను వెళ్ళాలి'' అన్నాడు.

''ఎక్కడికి?''

''ఐ.జి ఆఫీసుకి. అదే ఈ రాత్రి మా హెడ్ క్వార్టర్సు.''

''మేము?''

''ఇక్కడే వుండండి. స్పెషల్ బ్రాంచి ఏజంట్లు పదిమంది మీ గది ముందు కాపలా వుంటారు'' అని యుగంధర్ లేచి నిలబడ్డాడు.

టెలిఫోన్ గణగణ మోగింది.

''నాకే అయి వుంటుంది'' అంటూ రిసీవర్ తీసుకున్నాడు యుగంధర్.

''యుగంధర్ గారా?''

''అవును.''

''మీ అసిస్టెంటు రాజు మాట్లాడతాడు.''

''హలో! సర్. నేను రాజుని. ఆర్ ఫర్ రాష్, ఏ ఫర్ ఏక్షన్, జె ఫర్ జూనియర్, యు ఫర్ యువర్'' అన్నాడు రాజు అవతలనుంచి.

## 24

అది చాలా పెద్దగది. కప్పు యిరవై అడుగుల ఎత్తున వుంది. రామానుజం భార్య ఎలైస్, హీరాలాల్ కొడుకు శోభన్, మేజర్ రమాకాంత్ ప్రియురాలు మాలిని, కమీషనర్ గిరి కొడుకు రమేష్, పార్థసారధి కూతురు సుజాత నేల మీద కూర్చున్నారు. వాళ్ళ చేతులూ, కాళ్ళూ గట్టిగా కట్టబడి వున్నాయి. వాళ్ళకి కాస్త దూరంలో రాజు కూర్చుని వున్నాడు. అతని చేతులూ, కాళ్ళూ నైలాన్ తాళ్ళతో బిగించి వున్నాయి. చైనీస్ గూఢచారి, అతని పక్కన మరో యిద్దరూ వున్నారు ఆ గదిలో.

''మిమ్మల్ని యిలా తాళ్ళతో కట్టవలసి వచ్చినందుకు చాలా విచారిస్తున్నాను. తప్పనిసరి అయింది. నా పథకం సాఫీగా సాగితే యీ రాత్రి మూడు గంటలకి మిమ్మల్నందర్నీ విడిచిపెడతాను. మీ యిళ్ళకి మీ బంధువుల దగ్గరికి పంపిస్తాను. అంతవరకూ ఓపిక పట్టమని కోరుతున్నాను.'' ఆ గూఢచారి చెబుతుండగా గదిలోకి యింకో యిద్దరు వచ్చారు. వాళ్ళ చేతుల్లో ఒక చిన్న పెట్టె, ఒక నిచ్చెన వున్నాయి.

వాళ్ళు నిచ్చెన వేసి పైకి ఎక్కి కప్పులో రెండు మేకులు కొట్టి యేదో తగిలించి, దానికి ఎలక్ట్రిక్ తీగలు బిగించారు. ''రాజూ! అదేమిటో తెలుసా?'' అడిగాడు చైనీస్ గూఢచారి.

రాజు తల వూపాడు.

"దానికి పక్కన గడియారం కనిపిస్తోందా? ఎన్ని గంటలకి సెట్ చేశాము?"

"మూడు గంటలకి."

"ఆ ఎలక్ట్రిక్ తీగ ఎందుకో చెపుతాను విను. మా పథకం నిరాటంకంగా సాగితే, నేను చెప్పగానే ఈ గది బయట కాపలా వుండే మనిషి స్విచ్ ఆఫ్ చేస్తాడు. స్విచ్ ఆఫ్ చేస్తే డిస్కనెక్టు అవుతుంది. అప్పుడు గడియారం ఆగిపోతే, మూడు గంటలు కాకపోతే "బాంబు పేలదు."

రాజు తల ఊపాడు.

"నా పథకం తారుమారు అయితే,.? "

"కావడానికి వీలులేదు. అయితే యుగంధర్ వల్ల అవ్వాలి. నేను నా మనిషికి స్విచ్ ఆఫ్ చెయ్యమని చెప్పడానికి వీలుండదు. స్విచ్ ఆఫ్ చెయ్యకపోతే సరిగా మూడు గంటలకి బాంబు పేలుతుంది. బాంబు పేలితే మీరంతా యేమవుతారో తెలియదు."

"తెలుసు" అన్నాడు రాజు.

"ఇదిగో టెలిఫోన్. యుగంధర్ గారికి ఫోన్ చేసి ఈ విషయం వివరంగా చెప్పండి."

రాజు తల వూపాడు. ఆ చైనీస్ గూఢచారి యుగంధర్ నెంబర్ తిప్పాడు.

"నేను రాజుని, ఆర్ ఫర్ రేష్" తన గుర్తు చెప్పాడు యుగంధర్‌కి.

"ఎస్. నువ్వు నా అసిస్టెంటు రాజువేనని నమ్ముతున్నాను. ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"నన్ను, ఎలైస్‌నీ, శోభన్నీ, రమేష్‌నీ, సుజాతనీ, మాలినినీ చేతులూ, కాళ్ళూ కట్టేసి ఈ గదిలో పడేశారు. పైన కప్పులో టైంబాంబు పెట్టారు. మూడు గంటలకి బాంబు పేలే ఏర్పాటు చేశారు. బాంబు పెట్టడం, కంట్రోలు స్విచ్ గది బయట పెట్టడం నేను చూశాను" చెప్పాడు రాజు.

"అయితే?" అడిగాడు యుగంధర్.

"మీకీ విషయం చెప్పమన్నాడు. మమ్మల్ని బందీ చేసిన ఆ గూఢచారి మీతో మాట్లాడతాడట" అన్నాడు రాజు.

రాజు ఆ మాట చెప్పగానే క్లిక్ మన్నది టెలిఫోన్. డిస్‌కనెక్ట్ అయింది.

యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు.

"మీరు యిక్కడ వున్నారని శత్రువులకి ఎట్లా తెలుసు?" అడిగాడు ఐ.జి.

"తెలియదు. నా యింటికి వచ్చే టెలిఫోన్ కాల్స్ ఇక్కడి టెలిఫోన్‌కి కనెక్టు చేసే ఏర్పాటు చేశాను. నేను నా కన్‌సల్టింగ్ రూంలో వున్నాననే వాళ్ళు అనుకుంటున్నారు."

"ఈ కాల్ ఎక్కణ్ణించి వచ్చిందో కనుక్కునే ఏర్పాటు చెయ్యలేదా మీరు?" అడిగాడు హోం మంత్రి.

"చేశాను. కాని ప్రయోజనం వుండదనుకుంటాను. కాల్ ట్రేస్ చేసేలోపున డిస్కనెక్టు అయింది. ఇది క్రాస్ బార్ ఆటోమేటిక్ ఎక్స్‌ఛేంజ్."

"వాళ్ళందరినీ ఒక గదిలో బంధించారనీ, మూడు గంటలకి పేలేటట్లు టైంబాబు ఏర్పాటు చేశారనీ మీకు చెప్పడం దేనికి?" అడిగాడు ముఖ్యమంత్రి.

"నన్ను బెదిరించడానికి. రాజు ప్రాణం బలికాకుండా వుండేందుకు నేను వాళ్ళకి సహాయం చేస్తానని" అన్నాడు యుగంధర్. తల వంచుకుని మాట్లాడాడు. గొంతు జీరపోయింది.

"యుగంధర్ ఈ చైనీస్ గూఢచారి పథకం సాగకుండా మనం అడ్డుపడితే ఆ గదిలో వున్న వాళ్ళందరూ, పోలీసు కమీషనర్ కొడుకు, మీ అసిస్టెంటు రాజు కూడా మరణిస్తారు కదూ" అడిగాడు ముఖ్యమంత్రి.

యుగంధర్ చివాలున లేచి నిలబడ్డాడు. "అవును. వాళ్ళంతా చస్తారు బాంబు పేలి తలలు బద్దలయి, పేగులు బయటికి వచ్చి, కాళ్ళూ, చేతులూ విరిగి, కప్పు మీదపడి చస్తారు. ఏం చెయ్యమంటారు? నా అసిస్టెంటు రాజు చస్తాడనీ, పోలీస్ కమీషనర్ కొడుకు ప్రాణం పోతుందనీ ఈ రాష్ట్రాన్ని ఆ చైనీస్ గూఢచారికి అప్పచెప్పమంటారా! చెప్పండి. ఏం చెయ్యమంటారో చెప్పండి" బిగ్గరగా అరిచాడు. రెండు చేతులతో బల్లమీద గుద్దాడు.

యుగంధర్ మానసిక క్షోభలో వున్నాడని అందరికీ తెలుసు. రాజుమీద యెంత ప్రేమవున్నా దేశం కోసం రాజుని బలివ్వడానికి సిద్ధపడ్డాడని గ్రహించారు అందరూ.

"సారీ యుగంధర్" అన్నాడు ముఖ్యమంత్రి లేచి వెళ్ళి యుగంధర్ చేతులు పట్టుకుని.

"దటీజ్ ఆల్ రైట్. మన దేశ స్వాతంత్ర్యం కాపాడుకునేందుకు యెంత మంది తమ ప్రాణాలు అర్పించలేదు యిదివరలో. ఇక ముందు ఎంతమంది తమ ప్రాణాలు త్యజించవలసి వస్తుందో. దేశం కోసం నా ప్రాణం యివ్వడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. వాళ్ళందరినీ వొదిలేసి ఆ బాంబువున్న గదిలో నన్ను పెడతానంటే సంతోషంతో ఒప్పుకుంటాను" అంటున్నాడు యుగంధర్.

"తెలుసు యుగంధర్. తెలుసు" అన్నాడు హోంమంత్రి. అంతలో టెలిఫోన్ మళ్ళీ మోగింది. యుగంధర్ రిసీవ్ తీసుకున్నాడు.

"యుగంధరా!?"

" యుగంధర్ హియర్."

"రాజు చెప్పిన విషయాలు విన్నారుగా."

"ఆఁ."

"ఆ టైం బాంబుకి కంట్రోలు స్విచ్ ఒకటి ఏర్పాటు చేశాను. అది నా యింటికి ఓ ఫర్లాంగు దూరంలో వున్నది. మూడు గంటల లోపున - మూడు గంటలకి సర్క్యూట్ కంప్లీట్ అయి బాంబు పేలే లోపున - ఆ స్విచ్ నొక్కితే బాంబు పేలదు. అంటే రాజూ, మిగతావాళ్ళూ బతుకుతారు."

"అలాగా!"

"యుగంధర్. వాళ్ళ ప్రాణాలు నా చేతుల్లో లేవు. మీ చేతుల్లో వున్నాయి. వాళ్ళు చచ్చేదీ, బతికేదీ మీరు నిర్ణయించగలరు."

"ఎలా?"

"మూడు గంటలలోపున కంట్రోల్ స్విచ్ దగ్గర వున్న మా మనిషికి టెలిఫోన్ చేసి స్విచ్ ఆఫ్ చెయ్యమని నేను చెప్పాలి. నేను అలా చెప్పాలంటే నా పథకం జయప్రదం కావాలి. ఎవరూ నాకు అడ్డు రాకూడదు."

"అలాగా!"

"యుగంధర్ మీరు సామాన్య అపరాధ పరిశోధకులు కారని నాకు తెలుసు. మంత్రులు, గవర్నరులు, ఉన్నతోద్యోగులు మీకు స్నేహితులనీ, మీ సలహాలకి విలువ యిచ్చి పాటిస్తారనీ తెలుసు నాకు."

"అయితే?" అడిగాడు యుగంధర్.

"ఈ రాత్రి పన్నెండు గంటలలోపున, పదకొండున్నర తర్వాత ముఖ్యమంత్రి తన కాబినెట్ మంత్రులందరితో గవర్నరు భవనంలో సమావేశం అయ్యే యేర్పాటు చెయ్యండి. ఒంటి గంటవరకు వాళ్ళు అక్కణ్ణించి కదలకూడదు."

"ఎందుకు?" అడిగాడు యుగంధర్.

"ఎందుకు అనే ప్రశ్న అడగకూడదు. వాళ్ళెవరికీ ప్రాణాపాయం కలగదని హామీ యిస్తున్నాను. మీ నించి ఈ సహాయం అవసరం కాబట్టి మిమ్మల్ని విడిచిపెట్టాను. లేకపోతే రజుతో బాటు మీరూ నా బందీగా వుండేవారు."

"వాళ్ళందరినీ గవర్నరు భవనంలో సమావేశపరిస్తే ఏమిటి ప్రయోజనం?" అడిగాడు యుగంధర్.

"మీకేం ప్రయోజనమనా?! రాజు, మిగతా వాళ్ళూ బతుకుతారు. అంతకన్నా యేం ప్రయోజనం కావాలి. రాజు ప్రాణం రక్షించేందుకు ఈ మాత్రం చెయ్యలేరా?"

"చేస్తాను" అన్నాడు యుగంధర్.

"థాంక్యూ. మళ్ళీ మీకు ఫోన్ చెయ్యను. ఈసారి మిమ్మల్ని ప్రత్యక్షంగా కలుసుకుంటాను" క్లిక్‌మన్నది టెలిఫోన్.

యుగంధర్ బరువుగా ఊపిరి వొదిలి రిసీవర్ పెట్టేశాడు.

## 25

టెలిఫోన్ తీగలు తెంపేసి, రిసీవర్ బద్దలు కొట్టాడు చైనీస్ గూఢచారి.

"మిస్టర్ రాజు మీరు యుగంధర్ అసిస్టెంటని నేను మరిచిపోలేదు. చీపురు పుల్ల చేతికి చిక్కితే వీళ్ళందరినీ విడిపించి యిక్కణ్ణించి పారిపోగల సమర్థుడివి నువ్వు. అది నాకు తెలుసు. అందుకే ఈ గదిలో ఒక్క వస్తువూ లేకుండా చేశాను. టెలిఫోన్ తీసేశాను. నేనూ వెళ్ళిపోతాను. మళ్ళీ నేను నిన్ను చూసేదీ లేనిదీ మీ యుగంధర్ ప్రవర్తన మీద ఆధారపడి వుంటుంది. విష్ యు గుడ్ లక్" అని యిద్దరు అనుచరులతో వెళ్ళిపోయాడు ఆ చైనీస్ గూఢచారి.

నెమ్మదిగా తలుపు మూసుకున్నది. తలుపు మూసుకుంటున్నప్పుడు చూశాడు రాజు. అది రెండంగుళాల మందం వున్న వుక్కు తలుపు. ఆ గదిలోంచి బయటపడడం అసాధ్యమని తెలుసుకున్నాడు. అయినా తన ప్రయత్నం తను మానుకోకూడదు. ఆ గదిలో వున్న వాళ్ళందరూ కళ్ళప్పగించి రాజుని చూస్తున్నారు ఆశతో. రాజు తన కాళ్ళతో తలుపుని తన్నాడు.

"ఇది వుక్కు తలుపు, మీ కాళ్ళు నెప్పి పుడతాయిగాని తలుపు కదలదు" అన్నాడు కమీషనర్ గిరి కొడుకు రమేష్.

"తలుపు కదులుతుందని కాదు. బయట ఎవరన్నా కాపలా వున్నారేమో తెలుసుకునేందుకు."

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు రమేష్.

"ఏదో చేద్దాం. నువ్వు నా అసిస్టెంటువి. నువ్వూ నేనూ కలిసి ఆపదలో వున్న మనందరినీ రక్షించుకోవాలి."

"ఏం చెయ్యాలో చెప్పండి" అడిగాడు రమేష్.

"నా చేతులు వెనక్కి విరిచి కట్టేశారు. నీ చేతులూ అలాగే కట్టేశారు. దొర్లుకుంటూ నువ్వు నా కాళ్ళ దగ్గరికిరా. నా కుడికాలుకున్న బూట్స్ హీల్స్‌ని నీ కాళ్ళతో గట్టిగా తొయ్యి. పక్కకి జరుగుతుంది. ఆ హీల్ కింద చిన్న కత్తి స్ర్కూతో బిగించి వుంటుంది. ఆ కత్తిని పక్కకి లాగు. బయటికి వస్తుంది. ఆ కత్తికి నీ చేతులకున్న కట్లు ఆనించి పెట్టి పైకీ, కిందికీ రుద్దు. కట్లు తెగుతాయి. తరువాత ఆ కత్తితో మా అందరి కట్లూ కోసెయ్యి" చెప్పాడు రాజు.

రమేష్ గబగబా రాజు పడుకున్న చోటికి దొర్లుకుంటూ వెళ్ళాడు. జరిగి జరిగి రాజు కాళ్ళ దగ్గర చేతులు పెట్టాడు. బూట్సు హీల్ తోశాడు. కదలలేదు. ఇంకా బలంగా తోశాడు కదలలేదు, బలమ్మతా పెట్టి తోశాడు. అయినా కదలలేదు. ''కదలలేదండీ'' అన్నాడు.

''రెండో కాలు హీల్సు తోసి చూడు'' చెప్పాడు రాజు.

రమేష్ ఆ హీల్సు బలంగా తోశాడు. పక్కకి కదిలింది.

''వేళ్ళతో తడిమి చూడు. కత్తి నీ వేళ్ళకి తగులుతుంది.''

''కనిపించింది. పక్కకి లాగాను.''

''వెరీగుడ్ నీ చేతికట్లు కోసేసుకో'' చెప్పాడు రాజు.

రమేష్ తన చేతులుకున్న కట్టు కత్తిమీద పెట్టి కిందికీ, పైకి రాయడం ప్రారంభించాడు. కట్లు తెగలేదు సరికదా రక్తం ప్రవాహంగా కారుతోంది.

''ఒద్దు. నేను ప్రయత్నిస్తాను'' అన్నది ఎలైస్.

''కత్తి చాలా చిన్నదండీ. పెద్దవాళ్ళ చేతులకి హీల్ అడ్డం వస్తుంది. కొంచెం రక్తం కారితే ఏమవుతుంది'' అన్నాడు రమేష్.

''వెరీగుడ్! గో ఆన్'' అన్నాడు రాజు.

## 26

**గవర్నర్ భవనంలో** బాంక్వెట్ హాలులో కూర్చున్నారు గవర్నరు, ముఖ్యమంత్రి, మిగతా మంత్రులందరూ. అప్పుడే అక్కడికి వచ్చిన డిటెక్టివ్ యుగంధర్ వైపు చూశారందరూ.

''దయచేసి మీరందరూ మేడమీది గదిలోకి రండి. ఐ.జి ఆఫీసు నించి మా హెడ్ క్వార్టర్స్ యిక్కడకి మార్చాం, గేటు దగ్గర యిద్దరు సెంట్రీలకి బులెట్ ప్రూఫ్ కవచాలు వేశాము. ఈ ఆవరణలో వున్న చెట్ల వెనక స్పెషల్ బ్రాంచి ఏజంట్లు యిరవైమందీ, సిటీ పోలీసు సి.ఐ.డి ఆఫీసర్లు పద్దెనిమిదిమందీ, ఆర్మీ యింటలిజెన్స్ ఆఫీసర్లు పధ్నాలుగుమందీ దాక్కున్నారు. మీ కెవరికీ ఎటువంటి హానీ కలగదని హామీ యిస్తున్నాను. రండి'' అని యుగంధర్ మేడమీదికి దారి తీశాడు.

మేడమీది గదిలో పెద్దబల్ల, దానిమీద పన్నెండు టెలిఫోన్‌లూ, ఒక టూవే రేడియో వున్నాయి. ఆ బల్లకి ఎదురుగా వరుసగా కుర్చీలున్నాయి. యుగంధర్ ఒక కుర్చీలో కూర్చుంటూ ''అందరూ కూర్చోండి. ఈ రాత్రి యీ ఆపద గడిచేంతవరకూ నన్ను మద్రాసు పోలీసు శాఖకి ముఖ్యాధికారిగా, స్పెషల్ బ్రాంచికి అత్యవసర నాయకుడిగా, ఆర్మీ యింటెలిజెన్స్‌కి డైరెక్టర్‌గా సైనిక సమూహానికి యీ ఏరియాకి కమాండరుగా ముఖ్యమంత్రి సలహామీద, గవర్నర్ సూచనవల్లా కేంద్ర హోం మంత్రి నియమించారు. నా మిత్రుడు, పోలీస్ శాఖలో ఘటికుడు అయిన ఐ.జి.లో కాని, బండార్కర్లోగాని, ఆర్మీ ఏరియా కమాండరులో గానీ ప్రభుత్వానికి విశ్వాసం లేక కాదు, యీ రాత్రికి అన్ని శాఖలు ఏక లక్ష్యంతో ఒక్కరి ఆధీనంలో పని చెయ్యవలసి వుంది కనుక అలా చేశారు. ఈ అధికారులందరికీ యీ విషయం ముందే తెలిపారు. కనుక మా మధ్య విభేదాలు రావు. ఈ రాత్రి యీ ఆపద గడిచిపోయాక నేను సామాన్య డిటెక్టివ్ అయిపోతాను. ఈ ఉద్యోగులందరూ తిరిగి వాళ్ళ అధికారాలు తీసుకుంటారు'' అని యుగంధర్ చెపుతుండగా గోడ గడియారం ఒంటిగంట కొట్టింది.

అందరు గుండెలూ ఝల్లుమన్నాయి. గంట మోత యింకా అందరి చెవుల్లో గింగులు మంటోంది. అంతలో ఒక టెలిఫోన్ మోగింది. యుగంధర్ రిసీవర్ తీసి బల్లమీద విన్న స్విచ్ నొక్కాడు.

"మేజర్ రమాకాంత్ రిపోర్టింగ్ సర్."

"యస్. యుగంధర్ హియర్. ప్రొసీడ్"

"ఆడవాళ్ళలా వచ్చిన యిరవైమందినీ పట్టుకుని ఓగదిలో బంధించాము. మేడమీదికి వెళ్ళవలసిన అతన్ని బంధించి విడిగా వుంచాము. ఇప్పుడు యిక్కడే నా దగ్గరే వున్నాడు. అతని వద్ద ఆయుధాలు కాక టూవే రేడియో కూడా వుంది."

"మేజర్! యూ హావ్ డన్ గుడ్ వర్క్, కంటిన్యూ దట్ గుడ్ వర్క్ ఆ టూవే రేడియో పట్టుకు వచ్చిన అతన్ని వాళ్ళ బాస్‌కి చెప్పమను అంతా సక్రమంగా, సవ్యంగా జరిగిందనీ, ఆర్మీ క్వార్టర్స్ తమ ఆధీనంలో వున్నదనీ" చెప్పాడు యుగంధర్.

"చెప్పనంటున్నాడు. ప్రాణం పోయినా చెప్పడట."

"అతని విషయంలో మీరు యేం చేసినా మీకు నిందరాదు. ఎముకలు విరగకొట్టండి. కళ్ళు పీకి వెయ్యండి. తోలు వొలిచెయ్యండి. నానా హింసలూ పెట్టండి అతను చెప్పేవరకూ, అతని కోడ్ నెంబర్ తెలుసుకుని నాకు చెప్పండి. అంతా సక్రమంగా సాగిందని ఆ చైనీస్ గూఢచారి అనుకోవాలి. అది చాలా ముఖ్యం" అని యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు.

అంతలో యింకో టెలిఫోన్ మోగింది. "ఇన్‌స్పెక్టర్ శ్యామ్యూల్ స్పీకింగ్ సర్. మీ యిన్‌స్ట్రక్షన్స్ ప్రకారం చేశాను. పధ్నాలుగు మందిని లాకప్‌లో పెట్టాను. వాళ్ళ దగ్గర వున్న ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నాను. ఒకడి దగ్గర టూవే రేడియో వున్నది" చెప్పాడు ఫోన్‌లో.

"వెరీగుడ్ ఇన్‌స్పెక్టర్. నయాన్నో, భయాన్నో అతని చేత ఆ టూవే రేడియోలో చెప్పించండి పోలీస్ స్టేషన్ తమ స్వాధీనమైనట్లు. ఈ రాత్రికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సంగతి మరిచిపోండి. మీ యిష్టం ఏం చేసినా సరే నాకు కావలసింది పని జరగడం" చెప్పాడు యుగంధర్.

ఈ విధంగానే రైలు స్టేషన్ నించీ, ఏర్‌పోర్టు నించీ, రేడియో స్టేషన్ నించీ టెలిఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఏం చెయ్యాలో వాళ్ళకి చెపుతున్నాడు యుగంధర్.

"ఇప్పటివరకూ మనం అనుకున్న ప్రకారం జరుగుతోంది. తన పథకం సాఫీగా సాగుతోందన్న నమ్మకంలో వుండి వుంటాడు శత్రువు" అన్నాడు యుగంధర్. అంతలో బల్లమీద ఎర్రదీపం వెలిగింది.

"వెరీగుడ్ వచ్చాడు. రండి చూద్దాం." అన్నాడు యుగంధర్. దీపం ఆర్పి, కిటికీ దగ్గరికి వెళ్ళి తెర తొలగించి చూశాడు. అందరూ కిటికీలోంచి చూస్తున్నారు.

గేటు దగ్గరికి రెండు కార్లు, రెండు వాన్‌లు వచ్చి ఆగాయి. సెంట్రీలు గేటుకి అడ్డంగా నిలబడ్డారు.

"ఢాం! ఢాం" మెషిన్ గన్ మోగింది. సెంట్రీలు ఇద్దరూ పక్కకి పరిగెత్తారు. మళ్ళీ మెషిన్‌గన్ మోగింది. సెంట్రీలిద్దరూ కింద పడిపోయారు."

"భయంలేదు. వాళ్ళకి యేం కాదు, చచ్చిపోయినట్లు నటిస్తున్నారు. అంతే" అన్నాడు యుగంధర్.

ఆ కార్లు, వాన్‌లు లోపలికి వస్తున్నాయి. యుగంధర్ జేబులోంచి పిస్తోలు తీశాడు. "దయచేసి మీరంతా ఇక్కడే వుండండి. నేను వెళ్ళి వాళ్ళకి సుస్వాగతం చెపుతాను" అన్నాడు.

కార్లు, వాన్‌లు పోర్టికోలో ఆగాయి. చేతుల్లో తుపాకులు పట్టుకుని దాదాపు నలభైమంది దిగారు. వాళ్ళలో యిరవైమంది అటూ యిటూ వెళ్ళారు కాపలాకి. మిగతావాళ్ళు లోపలికి వచ్చారు.

"ఈ దేశ ప్రజల తరపున, విప్లవం తరపున ఆజ్ఞాపిస్తున్నాను. అందరూ చేతులు ఎత్తి రండి యిక్కడికి" అన్నాడు ఒకడు.

"ఒకసారి వెనక్కి తిరిగి చూడండి" అన్నాడు యుగంధర్ మేడమీదినించి.

లోపలికి వచ్చినవాళ్ళు వెనక్కి తిరిగి చూశారు. తలుపు దగ్గర నలుగురు మెషిన్‌గన్స్ పట్టుకుని నిలుచున్నారు.

"కాపలాకి వెళ్ళిన మీ యిరవైమంది సహచరులూ పట్టుబడ్డారు. తుపాకులు కిందికి దింపండి. లేదా అక్కడే నేల కూలుతారు" హెచ్చరించాడు యుగంధర్.

వాళ్ళ మొహాల్లో నెత్తురు చుక్కలేదు. వాళ్ళల్లో వాళ్ళు ఏదో గొణుక్కుంటున్నారు.

"మూడు లెక్కపెడతాను. ఆలోగా మీరంతా తుపాకులు కిందికి దింపకపోతే కాల్చమని ఆజ్ఞ యిస్తాను" అని "ఒకటి, రెండు" అన్నాడు యుగంధర్.

ఆ యిరవైమందీ తుపాకులు కిందపడేశారు. పోర్టికోలోంచి స్పెషల్ బ్రాంచి ఏజంట్లు పరిగెత్తుకు వచ్చి వాళ్ళందరినీ బందీలు చేశారు.

యుగంధర్ మేడ దిగి వచ్చాడు. ఆ యిరవైమంది మొహాలు పరికించి చూశాడు. వీళ్ళలో ఎవడు నాయకుడు. తను నాయకుడ్ని చూసినపుడు మొహానికి ముసుగు వేసుకున్నాడు. ఎలా తెలుసుకోవడం.

"ఇటు చూడండి" అన్నాడు ఒక ఏజంటు యుగంధర్‌కి పెట్టెలాంటిది యిస్తూ. అది టూవే రేడియో.

యుగంధర్ రేడియో స్విచ్ ఆన్ చేశాడు. "ట్రిబుల్ జీరో స్పీకింగ్. నెం 974 ఎవరు?" అడిగాడు. ఎవరూ మాట్లాడలేదు.

"మీ జేబులు వెతికితే టోకెన్ కనబడుతుంది. చీల్చేస్తాను తరువాత. ఎవరో చెప్పండి" అన్నాడు యుగంధర్.

ఒకడు ముందుకు వచ్చాడు.

"గవర్నర్ భవనం మీ ఆధీనమైనదనీ, గవర్నరూ, మంత్రులూ మీ ఆధీనంలో వున్నారనీ చెప్పు." అన్నాడు యుగంధర్.

"నేను చెప్పను" అన్నాడతను.

యుగంధర్ రివాల్వర్ అతని మీదికి గురిపెట్టి "నువ్వు భారతీయుడివి. నువ్వు దేశద్రోహం చేశావు. చైనా వాళ్ళతో చేతులు కలిపావు. నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను. ఇప్పుడైనా మాకు సహాయం చేసి నువ్వు చేసిన నేరానికి కొంతయినా పరిహారం చేసుకో" అన్నాడు.

యుగంధర్ మాటల్లో గాంభీర్యం, దృఢసంకల్పం అతన్ని నిర్వీణ్యుణ్ణి చేశాయి. "నన్ను వురి తీయరా!?" అడిగాడు ఏడుస్తూ.

"అది తరువాత విషయం. చెప్పు" అని రేడియో ఆన్ చేశాడు యుగంధర్.

"నెంబర్ 974 రిపోర్టింగ్. రాజభవనం మన ఆధీనంలో వుంది. గవర్నరు, మంత్రులూ నా బందీలైనారు. ఇన్‌స్ట్రక్షన్స్" అన్నాడు.

"ట్రిబుల్ జీరో హియర్. కంగ్రాచ్యులేషన్స్. నేను వస్తున్నాను" చెప్పాడు రేడియోలో ఆ చైనీస్ గూఢచారి.

## 27

"తెగిపోయాయి. తెగిపోయాయి" అంటూ సంతోషంతో అరిచాడు రమేష్ రెండు చేతులూ పైకి యెత్తి రాజుకి చూపిస్తూ రెండు చేతుల నించీ, కాళ్ళనించీ రక్తం కారుతోంది. "ముందు ఆ రక్తం తుడుచుకో. తరువాత యీ కత్తి తీసి దాంతో నా చేతుల కట్లు కోసెయ్యి" చెప్పాడు రాజు.

అయిదు నిమిషాల తరువాత చేతులు రుద్దుకుని, రమేష్ చేతులు పరీక్ష చేసి "బాగా కోసుకున్నావు. ఇప్పుడు యేం చెయ్యలేను. త్వరగా మిగతా వాళ్ళందరి కట్లు తెంపెయ్యాలి."

అందరి కట్లూ కోసేశాడు. అందరూ లేచి నిలబడ్డారు.

"ఇప్పుడు రెండు గంటలయింది. ఇంకో గంట టయిం వుంది యీ బాంబు పేలడానికి. ఈ గదిలోంచి మనం తప్పించుకునే అవకాశం లేదు. కనక యీ బాంబు పేలకుండా చెయ్యాలి" అన్నాడు రాజు.

"ఎలా?" అడిగింది ఎలైస్.

"ఒకటే మార్గం. ఒకళ్ళ భుజాల మీద ఒకళ్ళం యెక్కి బాంబుని అందుకోవాలి. అందుకని డిస్‌కనెక్టు చెయ్యాలి" చెప్పాడు రాజు.

"పడిపోమూ! ఒకరి భుజాలమీద ఒకళ్ళం అంత యెత్తుకి ఎలా నిలుచుంటాం" అడిగింది సుజాత.

"నేను గోడ దగ్గర నిలుచుంటాను. నా భుజాలమీద ఎలైస్ నిలుచుంటుంది. పడకుండా గోడని పట్టుకుంటుంది. తరవాత సుజాత, తరవాత మాలిని, శోభన్ మరీ చిన్నవాడు, వాడు ఒద్దు. చివరికి రమేష్, ఆ బాంబు తీగలు యెట్లా ఊడతియ్యాలో రమేష్‌కి చెపుతాను. జాగ్రత్తగా విను రమేష్, నువ్వు పైకి వెళ్ళిన తరువాత నేను నిన్ను చూడటానికి వీలుండదు" అన్నాడు రాజు.

"డేంజరస్. రమేష్ తప్పు చేస్తే బాంబు పేలుతుంది. మీరే పైకి వెళ్ళకూడదూ" అన్నది ఎలైస్.

రాజు నవ్వాడు. "అందరి బరువూ కింద ఎవరు మోస్తారు? రమేష్ చాకచక్యం మీద మనం ఆధారపడాలి. రమేష్ పైకి యెక్కిన తరువాత గోడ దగ్గర్నించి నేను అంగుళం అంగుళం కదులుతాను. పడిపోకుండా జాగ్రత్తపడాలి. నెమ్మదిగా మనం గది మధ్యకి వెళ్ళాక రమేష్ బాంబుని డిస్కనెక్టు చేస్తాడు" చెప్పాడు రాజు.

పోర్టికోలో కారు ఆగింది. స్థంభం వెనక నక్కి నిలుచున్నాడు యుగంధర్.

కారు తలుపు తెరవలేదు. కారులోంచే కేక వేశాడు. నెం 974 లోపల్నించి కేకవేశాడు. "లోపలికి రండి సర్" అని.

"నో! కమ్ హియర్ అండ్ రిపోర్ట్. ముఖ్యమంత్రిని తీసుకురా" కేక వేశాడు కారులోంచి.

యుగంధర్ కాచుకున్నాడు ఆ చైనీస్ గూఢచారి సహనం పోయి కారులోంచి దిగుతడేమోనని. అయిదు నిమిషాలు, పది నిమిషాలు గడిచిపోయాయి. ఎవరూ రాలేదు. ఆ గూఢచారికి యేదో అనుమానం కలిగి కారు స్టార్టు చేశాడు.

"ఆగు" కేకవేశాడు యుగంధర్.

"ఆపండి" కేక వేశాడు ఐ.జి.

పిస్తోళ్ళ పేలాయి. మెషిన్ గన్స్ మోగాయి. చైనీస్ గూఢచారి కారు రివ్వున వెళ్ళిపోయింది.

యుగంధర్ పరుగు తీశాడు. అతన్ని పారిపోనివ్వకూడదు. పట్టుకోవాలి. ఆగివున్న ఓ కారు దగ్గరికి పరిగెత్తాడు.

ఆ కారు స్టార్టయింది. తన పథకం తారుమారయిందా! ఇంకా కొంతమంది శత్రువులు మిగిలారా? అని యుగంధర్ అనుకుంటుండగా "ఎక్కండి యుగంధర్. క్విక్" అన్నాడు కారులోంచి పోలీస్ కమీషనర్ గిరి.

యుగంధర్ ఒక గంతున కారులోకి దూకాడు, గిరి కారుని వేగంగా పోనిచ్చాడు. కీచుమంటున్నాయి టయిర్లు. హారన్ బొయ్యిమంటోంది. దూరంలో వెళుతున్న కారు వెనుక వున్న ఎర్ర దీపం మీదే దృష్టి వుంచి తోలుతున్నాడు గిరి.

"సారీ యుగంధర్. మీతో కలవకుండా ఒంటిగా నా ప్రయత్నం నేను చేసినందుకు ఆ చైనీస్ గూఢచారి యిప్పుడు యిక్కడికి వస్తాడని నాకు తెలుసు. అందుకే యిక్కడికి వచ్చి కాచుకున్నాను" చెప్పాడు గిరి.

"తెలుసు మిష్టర్ గిరి. మీరు శత్రువులకి లొంగిపోలేదని. మీలాంటి వున్నత పోలీసు ఉద్యోగులే లొంగిపోతే దేశం యేం కాను" అన్నాడు యుగంధర్.

"నా కొడుకుని పొట్టన పెట్టుకున్న ఆ దుర్మార్గుడ్ని తప్పించుకు పారిపోనివ్వకూడదు."

"గిరీ! నా అసిస్టెంట్ రాజు కూడా అక్కడే వున్నాడు."

"తెలుసు. టయింబాంబు పెట్టారుట వాళ్ళంతా వున్న గదిలో. ఇప్పుడు టయిం ఎంతయింది?"

"రెండు గంటలయింది."

"బాంబు పేలేలోగా వాణ్ణి పట్టుకుని"

"ఆ ఆశ లేదేమో రాజునీ, మీ అబ్బాయినీ రక్షించగలమన్న ఆశలేదు. ఆ యిల్లు ఎక్కడున్నదో మనకి తెలియదే"

కమీషనర్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. పెదిమలు వొణుకుతున్నాయి. అయినా కారు స్పీడు తగ్గించలేదు. ఇంజన్ హోరుమంటోంది. గూఢచారి కారుని సమీపిస్తున్నాడు. సెంట్ థామస్ మౌంట్ దాటారు. పూనమల్లీ చేరుకుంటున్నారు. ఇంకో రోడ్‌లోకి తిరిగి గ్రాండ్ ట్రంక్ రోడ్లోకి వెళ్ళింది. ముందున్న కారు ఎడమవైపు తిరిగి చటుక్కున ఆగింది.

"ఏమైంది? ఎందుకు కారు ఆపేశాడు?" అన్నాడు గిరి.

"కారు దిగి పరిగెత్తుతున్నాడు. రండి" అన్నాడు యుగంధర్.

చెట్ల మధ్యనించి, గట్లమీద పరిగెత్తుతున్నాడు ఆ చైనీస్ గూఢచారి. యుగంధరు, గిరీ అతన్ని తరుముకుంటూ పరిగెత్తారు.

ఢాం! ఢాం! పేలింది పిస్తోల్. గిరి కాల్లో దిగబడింది గుండు.

"మీరు ఆగిపొండి. నేను అతన్ని ఒదలను" అని యుగంధర్ పరిగెత్తాడు. మసక వెలుగులో ఒక యిల్లు లాటిది కనిపించింది. చైనీస్ గూఢచారి ఆ యింట్లోకి వెళ్ళలేదు. పక్కనున్న మెట్లు ఎక్కి పైకి వెళుతున్నాడు. వెనక్కి తిరిగి యుగంధర్ వస్తున్న వైపు పిస్తోల్ పేలుస్తున్నాడు, తన దగ్గరికి యుగంధర్ రాకుండా. రెండు నిమిషాలు పిస్తోల్ పేలలేదు. యుగంధర్ ముందుకి వెళ్ళాడు. మళ్ళీ పిస్తోల్ పేలింది. డాబా మీదకి వెళ్ళి ఏదో చేస్తున్నాడు అతను. యుగంధర్ కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

ఒక పెద్ద టార్పాలిన్ దేనిమీద నించో తీసి మెట్లమీద పడేశాడు అతను. ఇప్పుడు యుగంధర్ మెట్లెక్కి వెళ్ళడం సులభం కాదు.

నిమిషం తరువాత యింజన్ హోరు వినిపించింది.

"యుగంధర్! అది హెలీకాప్టర్. తప్పించుకు పోతున్నాడు రాస్కెల్" అంటూ కమీషనర్ గిరి పరిగెత్తాడు కాలినించి రక్తం కారుతున్నా లక్ష్యపెట్టకుండా.

యుగంధర్ టార్పాకిన్ లాగి పారేసి గబగబా మెట్లు ఎక్కాడు. హెలీకాప్టర్‌లోంచి అతను పిస్తోల్ పేల్చాడు.

క్షణాలు నిమిషాలు అవుతున్నాయి. నిమిషాలు దొర్లిపోతున్నాయి. అంతమంది బరువూ భుజాల మీద మోసుకుంటూ రాజు అంగుళం, అంగుళం జరుగుతున్నాడు. త్వరగా జరిగితే పైన నిలుచున్న వాళ్ళు బాలన్స్ తప్పి పడతారని భయం. పడ్డారంటే బాంబు డిస్కనెక్ట్ చేసే అవకాశం పూర్తిగా పోతుంది. టయిం ఎంత అయింది రమేష్?" అడిగాడు.

"రెండూ యాభై అయిదు."

"ఇంక అయిదు నిమిషాలేనా వున్నది?"

"అవును"

"ఇంకెంత దూరంలో వున్నావు?"

"రెండడుగులు."

"అయితే త్వరగా కదులుతాను. ఎవరూ పడకూడదు" అన్నాడు రాజు.

పోలీస్ కమీషనర్ గిరి గురి చూసి రివాల్వర్ పేల్చాడు. కాక్‌పిట్‌లో కూర్చున్న అతని తలకి గుండు తగిలింది. తల ముందుకు వేలాడేశాడు. హెలికాప్టర్ యింజన్ హోరుమంటోంది. కానీ పైకి లేవలేదు. యుగంధర్ ముందుకి వెళ్ళాడు. శత్రువు షూట్ చెయ్యలేదు. పరిగెత్తారు యిద్దరూ.

"ప్రాణం పోయింది. గుండు తలలో దిగబడింది. సత్రువుల నాయకుడు, చైనీస్ గూఢచారి చచ్చాడు" అన్నాడు యుగంధర్.

కమీషనర్ గిరి నిట్టూర్పు వదిలాడు. "నా రమేష్‌ని పొట్టనపెట్టుకున్న రాక్షసుణ్ణి నా చేతులతో" అంటున్నాడు.

"ఇంకా మూడు కాలేదు. అయిదు నిమిషాలు టైం వుంది. రండి" అన్నాడు యుగంధర్.

"ఎక్కడికి?" అడిగాడు గిరి.

"ఇదే శత్రువుల హెడ్‌క్వార్టర్సు అయివుండాలి. ఈ యింట్లోనే వాళ్ళని బంధించి వుంటాడు రండి" అంటూ మెట్ల దగ్గరికి పరిగెత్తాడు యుగంధర్.

"ఇంకెంత దూరం?" అడిగాడు రాజు. బరువు మొయ్యలేకుండా వున్నాడు. భుజాలు విరిగిపోతున్నట్లుంది.

"ఇంకో రెండంగుళాలు."

"టయిం ఎంతయింది?"

"రెండూ యాభై తొమ్మిది" చెప్పాడు రమేష్.

రాజు కాళ్ళు కదలడం లేదు. అయినా ప్రాణరక్షణ కోసం, శరీరంలో ఎక్కణ్ణించో మిగిలిన కాస్త శక్తి కూడదీసుకుని ముందుకు నడిచాడు.

"అందింది" అరిచాడు రమేష్.

"తెంపెయ్యి" చెప్పాడు రాజు.

గడియారం టకటక – రాజు వూపిరి – మిగతా వాళ్ళ గుండెల దడదడ తప్ప వేరే యే శబ్దమూ లేదు ఆ గదిలో.

"తెంపేశాను" అరిచాడు రమేష్.

"గడియారం ఆగిపోయిందా?" అడిగాడు రాజు.

"ఆగిపోయింది" అన్న మాటలు వినిపించగానే రాజు గుండె ఉరకలు వేసింది. అది యుగంధర్ గొంతు.

రమేష్ తలుపు వైపు చూశాడు. తలుపు దగ్గర నిలబడి వున్నాడు తన తండ్రి, పోలీస్ కమీషనర్ గిరి. "నాన్నా!" అరిచాడు.

"బంగారు తండ్రీ" అంటూ గిరి ముందుకి వెళ్ళాడు.

అంత పైనుంచీ ఒక్క దూకు దూకాడు రమేష్. గిరి రెండు చేతుల్లో కొడుకుని పట్టుకుని గట్టిగా కావలించుకుని ముద్దు పెట్టుకున్నాడు. కొడుకు చేతులు చూసి "ఏమిటీ రక్తం? ఏమైంది?" ఖంగారుగా అడిగాడు.

రాజు నవ్వి, "మిస్టర్ గిరి. కంగ్రాచ్యులేషన్స్. మీ కొడుకు రమేష్ మా అందరినీ రక్షించాడు. రమేష్ లాంటి కుర్రవాళ్ళుండగా మన దేశానికి ఏనాడూ ఏ ఆపదా రాదు" అన్నాడు.

రాజుని మళ్ళీ ప్రాణాలతో చూడనేమో అనుకున్నాడు యుగంధర్. ఆనందంతో మాట్లాడలేక రమేష్‌ని ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. రాజుని ఎత్తుకుని ముద్దు పెట్టుకోవడం బావుండదనేమో.